ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు
30-7-'52


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
ఇక్షుపురమనే నగరంలో సాలెవాడొకడు వున్నాడు వాడికి మిత్రుడు వడ్రంగి
ఒకరోజున ఆ నగరంలో ఉత్సవమేదో జరిగింది
రాచనగరులో రాజుకూతురగు లావణ్యాంగి చెలికత్తెలతో ఊరేగింపును చూస్తోంది
లావణ్యాంగిని చూచెనోలేదో సాలెవాని మది వలపువలలలో తగులుకు తన్నుకులాడింది!
మరుసటి దినమున వడ్రంగి వచ్చిచూడగా సాలెవాడు తన మంచంపైపడి మూలుగుచుండెను
రాజకుమార్తెను పెళ్లాడనిదే క్షణమైనా యిక బ్రతుకజాలనని సాలెయువకుడూ భోరునపడ్డెను
...మాశాలియగు వడ్రంగప్పుడు మీటనొక్కితే తుర్రున ఎగిరే గరుడ వాహనము తయారొనర్చెను
"విష్ణువులాగా వేషంవేసి- వాహనమెక్కి, రాచనగరుకూ- రాత్రికళప్పుడు పోవోయి- రాకుమార్తె తన గదిలో ఒంటిగ- శయనిస్తుందని తెలిసింది"
ఆరాత్రే మన సాలెయువకుడూ విష్ణువేషమున వాహనమెక్కి రాచనగరులో ప్రవేశాడు
"శాపవశముచే మానవకన్యగ- పుట్టిన లక్ష్మివి నీవే సుమ్మా!- విష్ణువు నేనే, నీకై వచ్చితి!"
రోజుకి రోజూ లావణ్యాంగి సాలెవానితో గడుపుచుండగా పసిగట్టిన పరిచారకులంతా రాజుగారితో చెప్పారు
లబోదిబోమని రాజాగారూ- రాణీగారిని పిలిపించీ- కూతురు చేసిన ఒఘాయిత్యం- చల్లగమెల్లగ చెప్పారు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 47
30-7-52

నందన శ్రావణ శుద్ధ అష్టమి బుధవారము



మొదటి ప్రతాపరుద్ర చక్రవర్తి నిర్మించిన స్వయంభూదేవాలయ ద్వారములు, ఓరుగల్లు.

—ఛాయా-చిత్రకారుడు :
శ్రీ పి. వీరయ్య—సికింద్రాబాద్.

వ్యాఖ్యలు; విమర్శలు:

కాశ్మీర్ రాజ్యాంగసమస్యలు

కాశ్మీర్ రాజ్యాంగ సమస్యలనుగురించి ఢిల్లీ సమాలోచనలఫలితంగా కాశ్మీర్ ప్రభుత్వానికీ భారతప్రభుత్వానికీ మధ్య కుదిరిన ఒప్పందం వివరాలను భారత ప్రధాని నెహ్రూ పార్లమెంట్‌లో తెలియచేశారు. సమాలోచనల సమయంలో ఏ నిర్ణయాన్ని గాని బలవంతంగా ఒప్పించరాదనే విషయాన్ని భారత ప్రభుత్వం దృష్టిలో పెట్టుకున్నదని నెహ్రూ చెప్పారు. ఆ పైన ఐక్యరాజ్యసమితి కిచ్చిన వాగ్దానాలకు ఎట్టి భంగం కలగదని కూడా నెహ్రూ తిరిగి స్పష్టపరిచారు.

కాశ్మీర్ రాజ్యాంగపరిషత్తు భూముల పట్టాదారీ పద్ధతిలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, సంస్థానాధిపతిని తొలగించి ఇకపైన అధిపతిని ఎన్నుకునే పద్ధతిని నిర్ణయించడం ఈ రెండింటితో కాశ్మీర్-భారతప్రభుత్వాల మధ్య కొత్తసమస్యలుత్పన్నమైనాయి. మహారాజా స్థానే యువరాజును అధిపతిగా ఉంచడానికి మొదట కాశ్మీర్ ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ తరవాత కాశ్మీర్ రాజ్యాంగ పరిషత్తు సంస్థానాధిపతి ఎన్నుకోబడాలని తీర్మానించింది. దీనిపైన జమ్మూరాష్ట్రంలోని హిందూప్రజానీకంలోనూ భారతదేశంలోనూ కలవరం బయలుదేరింది.

భారత రాజ్యాంగంలో కాశ్మీర్ బి తరగతి రాష్ట్రాల జాబితాలో చేర్చబడింది. ఇదికాక 370వ నిబంధనప్రకారం కాశ్మీర్ సంస్థానానికి కొన్ని రాజ్యాంగనిబంధనలు వర్తించవలసిన అవసరం లేకుండా ఏర్పాటుచేయబడింది. రాజ్యాంగ నిబంధనల నిర్ణయ సమయంలోనే కలవరం రావలసింది కాని అప్పుడు ఉభయప్రభుత్వాలమధ్యనూ, కాశ్మీర్, భారత జాతీయ నాయకుల మధ్యనూ ఉన్న సామరస్యభావంవల్ల కలవరం మణిగిపోయింది. రిపబ్లికన్ రాజ్యాంగం అమలు జరిగినప్పుడూ కాశ్మీర్ భారత ప్రభుత్వాలమధ్య వర్తిల్లవలసిన వ్యవహారవిధానంగురించి రిపబ్లిక్ అధ్యక్షులు ప్రకటించిన ఉత్తరువులో, విదేశాంగ వ్యవహారాలు, దేశరక్షణ, తంతితపాలా రైల్వే మొదలైన రవానా శాఖలను మాత్రం భారత ప్రభుత్వం నిర్వహించగలదని చెప్పబడింది. మిగిలిన అంశాలను, అనగా మిగిలిన బి తరగతి రాజ్యాలకు సంబంధించినవీ కేంద్ర ప్రభుత్వనిర్వహణలోనికి తీసుకోబడిన శాఖలను భవిష్యన్నిర్ణయానికి విడిచిపెట్టారు. అంటే కాశ్మీర్ రాజ్యాంగ పరిషత్తుకు విడిచిపెట్టారు.

కాశ్మీర్ రాజ్యాంగపరిషత్తు ఎన్నికల అనంతరం పరిషత్తు సమావేశాలు జరిపి కొన్ని నిర్ణయాలకు వచ్చింది. ఈ నిర్ణయాలలో కొన్ని మిగిలిన బి తరగతి రాష్ట్రాల నిర్ణయాల మాదిరిగా లేవు. మిగిలిన బి తరగతి రాష్ట్రాలలో రాజ్యాధిపతులే రాజప్రముఖులైనారు. కాని కాశ్మీర్ రాజ్యాంగపరిషత్తు నిర్ణయించిన ప్రకారం, కాశ్మీర్ రాజ్యాధిపతి ఎన్నుకోబడాలి. ఈ సందర్భంలో ఒక విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. భారతరాజ్యాంగం చిత్తు తయారైనప్పుడు అందులో రాష్ట్రాల గవర్నర్లు ఎన్నుకోబడాలని ఉంది. తరవాత ఆపద్ధతి పనికిరాదని భావించి గవర్నర్లను రిపబ్లిక్ అధ్యక్షుడు నియమించాలని నిర్ణయించబడింది. ఎన్నికలద్వారా నిర్మించబడే మంత్రివర్గానికీ, ఎన్నికకాగల గవర్నరుకీ మధ్య బాధ్యతలనుగురించి సందిగ్ధ పరిస్థితు లేర్పడగల అవకాశమున్నదనే

విషయానుక్రమణిక

కారణంపైనే గవర్నర్ల ఎన్నికపద్ధతిని మార్చివేశారు.

బి. తరగతి రాష్ట్రాలగురించి అధిపతిని ఎన్నుకునే ప్రసక్తి రాలేదు. రిపబ్లిక్ అధ్యక్షుని ఆమోదంపొందిన రాజ్యాధిపతి రాజప్రముఖుడుగా ఉంటాడు. ఇప్పుడు కాశ్మీరు రాజ్యాంగపరిషత్తు మహారాజు యువరాజుల రాజ్యాధిపత్యాన్ని గాని రాజప్రముఖుని అవసరాన్ని గాని లేకుండా చేసుకోవాలనే ఉద్దేశంతోమాత్రమే అధిపతిని ఎన్నుకోవాలని నిర్ణయించింది. ఇప్పుడు ఢిల్లీసమాలోచనల ఫలితంగా కాశ్మీర్ నాయకులకూ భారత ప్రభుత్వానికీ ఒక మధ్యేమార్గంగా ఈ సమస్య పరిష్కరించబడింది. అధిపతిని ఎన్నుకునే అధికారం కాశ్మీరు రాజ్యాంగపరిషత్తు కివ్వబడుతున్నది. అయితే యువరాజునే అధిపతిగా ఎన్నుకోడానికి కాశ్మీరునాయకులు సమ్మతించారు..

జాతీయ పతాకను ఇతర రాష్ట్రాలలో మాదిరిగానే ప్రధానమైనదిగా పరిగణించడానికి కాశ్మీర్ నాయకులు, పై పరతుకు లోబడి కాశ్మీర్ పతాకను కూడా వినియోగించడానికి భారతప్రభుత్వమూ సమ్మతించారు.

రిపబ్లిక్ రాజ్యాంగం ప్రకటించబడిన నాడు భారతప్రభుత్వం అధీనమైన మూడు శాఖలూ కాక, ఇప్పుడు కొత్తగా మరి కొన్ని అంశాలను కూడా కేంద్రపరిపాలన శాఖలకు ఒప్పగించడానికి నిర్ణయమయింది.

కాశ్మీర్ భూమిశిస్తు సంస్కరణల ప్రకారం భూస్వాములవద్దనుండి తీసుకోబడిన భూములకు పరిహారం చెల్లించనవసరం లేకుండా భారత రాజ్యాంగంలో ఇందుకు సంబంధించిన నిబంధనవర్తిల్లకుండా చెయ్యడానికిభారతప్రభుత్వంసమ్మతించింది. ఇంతే కాదు. భారతప్రధాని పండిట్ నెహ్రూ కాశ్మీర్ భూమిశిస్తుసంస్కరణల పద్ధతిని ప్రశంసించారు. భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలోకూడా ఇట్టి సంస్కరణలకు వీలు కల్పించడం మంచిదనే సూచనకూడా ఉంది.

కొన్ని హద్దులకు లోబడి ప్రాథమిక హక్కులు, పౌరసత్వ నిబంధనలకు కూడా కాశ్మీర్ నాయకులు సమ్మతించారు కాని ఇంకా కొంత పరిశీలన జరిగినమీదట వివరంగా వేరే ఒప్పందం కుదరవచ్చు. సుప్రీంకోర్టు అధికారం విషయంలో కొన్నిటికి వెంటనే కాశ్మీర్ నాయకులు సమ్మతించారు. మరి కొన్నిటికి పరిశీలన జరుగుతుంది.

మొత్తానికి ఒప్పందంవల్ల ఒక చిత్రమైన అంశం స్పష్టపడుతున్నది. జాతీయైక్యత కోసం రాష్ట్రాల అధికారులను పరిమితం చేసి, స్వభాషలో పరిపాలనా వ్యాసంగం జరుపుకోవాలనే సిద్ధాంతాన్ని కూడా నిరసిస్తున్న కేంద్ర కాంగ్రెస్ నాయకులు కొన్ని అత్యవసరసందర్భాలలో తమ సిద్ధాంతాలను సడలించుకోడానికి సన్నద్ధులేనని తేలుతున్నది. జాతీయైక్యతకు వివిధ ప్రాంతాల వ్యష్టివికాసం ఆటంకం కాదని కేంద్రనాయకులు గ్రహించడానికి మరి కొంత వ్యవధి పట్టవచ్చును. [25-7-52]

★

మానివేసిన కథ

"మరా: ఇందలి పాత్రలు కేవలం కల్పితాలు. ప్రత్యేకంగా యేవ్యక్తికీ సంబంధించినవి కావు.

N. G. O ఆర్ముగం అయ్యరు కలెక్టరు ఆఫీసులో గుమాస్తా. 80 రూపాయలజీతం. వయస్సు సుమారు యాభైసంవత్సరాలుంటాయి. ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు అతనికి గల సంతానం. భార్య కుట్టెమ్మాళ్ నాలుగేళ్ళ క్రితం చనిపోయింది. అతి దుఃఖంతో ఆర్ముగం అయ్యరు, అతని ముసలితల్లి పిల్లల్ని పెంచుకుంటూ వచ్చారు.

తలిపోరు పడలేక పెద్దపిల్లకు పెళ్ళిచేశాడు. ఎంత కుష్టంగాచేసినా వెయ్యిరూపాయలైంది పెళ్ళిఖర్చు. ఇంత ఖర్చుచేసనా వియ్యాలవారిని తృప్తిపరచలేకపోయాడు. వారికి మొహంముడుపుగానే వుంది. పెద్దపిల్ల పెళ్ళిచేసిన మరుసటి సంవత్సరమే తల్లి కాలంచేసింది. పాపం ఆర్ముగం అయ్యరు, పిల్లలు దిక్కులేనివాళ్ళయారు.

ఆర్ముగంఅయ్యరు చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. అతని పోషణభారం తల్లిమీదపడింది. ఆమె యింటింటికీ వెళ్ళి చందాలుపోగుచేసి కొడుకును పెంచి,విద్యావంతుణ్ణి చేసింది. అంత కష్టపడి పైకి తీసుకువచ్చిన తల్లికి ఒక్కగానొక్క కొడుకైన తను ఆమె పరలోకక్రియలు గొప్పగా నిర్వర్తించాలి. రెండువందలు ఖర్చుచేశాడు.

పిల్లపెళ్ళికి, తల్లి అంత్యక్రియలకు నోటు రాసి అప్పుతెచ్చాడు. వియ్యాలవారిని పండగలకు తీసుకురావాలి. పెద్దపిల్లవాడు ఇంటరు చదువుతున్నాడు. మరోయిద్దరు పిల్లలు హైస్కూలుక్లాసులు చదువుతున్నారు. వీరందరికీ నెలనెలా జీతాలు కట్టాలి. పుస్తకాలు కొనాలి. ఖర్చు భరించలేక ఆఖరిపిల్లలిద్దరినీ స్కూలికి పంపకుండా తీరుబడి అయినప్పుడు తనే పాఠాలు చెప్పుకుంటున్నాడు.

పట్నవాసం కాపురం. తెచ్చేజీతం అందరికీ భోజనానికే చాలడంలేదు పైనియేఖర్చు వచ్చినా అప్పుచేసి తీరవలసిందే. వెంటనే తీరుద్దామనే సదుద్దేశంతోనే అప్పు తెచ్చేవాడు. అయినా జీతం వచ్చేటప్పటికికానీ మిగిలేది కాదు. రెండవతేదీనే బిక్షాధికారిగా తయారయేవాడు. అప్పు యెలా తీర్చడం? ప్రతీనెలా యీ విధంగానే జరిగేది. తీర్చవలసిన బాకీ తడిసిమోపెడయింది. అప్పు తలుచుకున్నప్పుడల్లా వొళ్లు ఝల్లుమనేది. రాత్రి నిద్రపట్టేది కాదు. చాలా బాధపడేవాడు.

ఏడాదినుండి అద్దె కానీకూడా యివ్వలేదు.

"నీ పెద్దల ఆస్తి అనుకున్నావా? ఇవ్వవలసిన సొమ్ము మర్యాదగా యిచ్చెయ్యి" అనే యిల్లుగలాయనమాటలు ఖాతరు చెయ్యకుండా గడిపేస్తున్నాడు. ఓనాడు ప్రొద్దున్నే యిల్లుగలాయన వచ్చి యిరుగుపొరుగు పెద్దమనుష్యులను పిలిచి "అయ్యా, చూశారా యీ అన్యాయం. ఏడాది అద్దె యివ్వాలి. రోజూ తిరిగి పోతున్నానేకాని ఒక్కనెల అద్దె అయినా యిచ్చిన పాపాన పోలేదు. ఇవ్వగలిగితే వుండాలి. లేకపోతే యింట్లోంచి వెళ్ళిపోవాలిగాని యిలా చెయ్యడం బాగుందా?" అని నడివీధిలో కేకలు మొదలుపెట్టాడు. అవచ్చినవారంతా అతని మాటలు సబబే అన్నట్లు తలూపారు.

"అయ్యా, అద్దె యివ్వకపోవడము తప్పే. కొంతైనా యిచ్చిపంపుదామంటే చేతిలో యెర్రని యేగానీయైనా లేదు." అన్నాడు ఆర్ముగం అయ్యరు తలవంచుకుని.

"అద్దె కావలసే యిళ్లు అద్దెకిచ్చుకుంటారుగాని హాయిగా అనుభవించలేక కాదు" అని కొందరన్నారు.

"నీలాగేసొమ్ము అవసరంకాదా అందరికీను?" అన్నారు మరి కొందరు.

"అంత యిచ్చుకోలేనివాడివైతే యిల్లు ఖాళీచేసి యే సత్రంలోనైనా వుండరాదూ?" అన్నారు యింకా కొందరు.

"అయినా అరవవాడిని నమ్మకూడదు బాబూ" అన్నాడొక ముసలాయన. అంతా తలోరకంగా అనేటప్పటికి ఆర్ముగం అయ్యరు చాలా బాధపడ్డాడు. అభిమానధనుడవడమువల్ల శిరచ్ఛేదం జరిగినట్లుభావించాడు. "ఇలాంటి బ్రతుకు బ్రతకవలసి వచ్చిందే" అని లోలోపల కుమిలిపోయాడు. "ఈ సాయంత్రమే మీ యిల్లు ఖాళీచేసేస్తాను. సొమ్ము సాధ్యమైనంత త్వరలో తీర్చేస్తాను" అని యిల్లుగలాయనకు, అక్కడి జనానికీ నచ్చచెప్పేసరికి పెద్దలు దిగివచ్చారు.

అన్నప్రకారం ఆ సాయంత్రమే యిల్లు ఖాళీచేసి వూరిచివరి సత్రంలో కాపురం పెట్టాడు ఆర్ముగం అయ్యరు. రాత్రి పన్నెండు గంటలయింది. సంరక్షణ లేకపోవడంవల్ల చిక్కి సగమై, చింపిరితలలతోను, మాసినబట్టలతోను పిల్లలంతా నిద్రపోతున్నారు గాఢంగా. ఆర్ముగంఅయ్యరు పడుకున్నవాడు గభీమని లేచి కూర్చున్నాడు పక్కమీద. అతని మనస్సు మనస్సులో లేదు. అమావాస్యరోజవడంవల్ల బయటఅంతా అంధకారం ఆవరించింది

"ఆర్ముగంఅయ్యరుచేత ఆత్మహత్య చేయించడమా? పరారీ చేయించడమా? చిన్నప్పుడు తల్లి వేయించిన లాటరీలాటరీలాకు డబ్బు వచ్చినట్లు చెయ్యడమా? ఇక ముందుకథ యెలాగా నడిపించడం?" అని ఆలోచనలో పడ్డాను.

అవతల యెండ చాలా యెక్కువగా వుంది. కిటికీలోంచిమాత్రం గాలి బాగా వస్తోంది. బద్ధకంగా వుంది. టేబిల్ మీద గడియారం చూశాను. 12 గంటలైంది. ఆవలింతలు వరుసగా వస్తున్నాయి. కాస్సేపు పడుకుని లేచాక కథ పూర్తి చెయ్యవచ్చు అనుకున్నాను. "అమ్మ, నీ చేతిలో కాగితాలు మా కివ్వవూ పడవలు కట్టుకుంటాం" అని అడుగుతున్నారు మా చిన్న పిల్లలిద్దరూ. "అవి యిచ్చేవి కావు వాటిమీద కథ రాస్తున్నాను" అని సమాధానం చెప్పి అక్కడే యీజీఛైర్ లో పడుకున్నాను. బల్లమీది కాగితాలు గాలికి టపటప కొట్టుకుంటున్నాయి.

చెయ్యెత్తు మనిషి. చామనచాయ. విశాలమైన నుదురు. గోల్డుగోల్డుఫ్రేము కళ్ళజోడు. తల ముందుభాగం నున్నగా వుండి, వెనక తిలతండులన్యాయంగా సగంసగం నెరసిన జుట్టుముడి. గూడకట్టు. హాఫ్ షర్టు వేసుకున్నాడు. పైన అంచుగల ఓ తెల్లకండువా. చేతిలో సంచీ. వచ్చి యెదురుగా నిలబడ్డాడు.

"ఎవరు నువ్వు?"

"దోషిగా ప్రవ

ఉంలో పేరు పొందబోతున్న ఒక అభాగ్యుణ్ణి."
"నీపేరు ?"
"నాపేరే తెలియదా! తెలిసికూడా తెలియనట్లుడుగుతున్నావే!"
"నిజంగా తెలియదు."
"తెలియందే కథ యెల్లారాస్తున్నావు?"
"ఏమిటీ! నా కథలోని ఆర్ముగంఅయ్యరువా నువ్వు ?" ఆశ్చర్యపోతూ అడిగాను.
"కాక మరెవరనుకున్నావు? ఆ అభాగ్యపు ఆర్ముగం అయ్యరును నేనే."
"అయితే యెందు కిక్కడికి వచ్చావు?"
"నాజీవితం దుర్భరం చేశావని చెప్పడానికి."
"నే నేదో కథ రాసుకుంటుంటే నీగొడవేమిటి మధ్య ?"
"మధ్య నా గొడవ యేమిటి ? మొదటినుండి చివరిదాకా నాగొడవే."





ఆర్ముగం అయ్యరుచేత ఆత్మహత్య చేయించాలో లేక పరారీ చేయించాలో తెలియక నిద్రపోతున్న రచయిత్రికి ఆర్ముగం సాక్షాత్కరించాడు.

"వెంటనే యిక్కడినుండి వెళ్లిపో" అన్నాను గట్టిగా. ఎదటివ్యక్తి కదలలేదు సరికదా మళ్లీ మాట్లాడ్డం ప్రారంభించాడు.

"నాజీవితానికీ నీకథకీ యెంత తేడా వుందో తెలుసా ?"

"నువ్వెవరో, నీజీవితం యేమిటో యెరగను. నీ బ్రతుక్కీ నాకథకీ వున్న తేడా అంతకన్న యెరగను" అన్నాను వింత పడుతూ.

"అయితేనే చెబుతాను విను. నిజంగా నాకు ముగ్గురే సంతానం. ఆరుగురు పిల్లలున్నారని నీకథలో కంటకంగా వ్రాశావు. వీధిగుమ్మం యెలాంటిదో యెన్నడూ యెరగని మా అమ్మని యింటింటికీ పంపి చందాలు పోగుచేయించావు నాకోసం. నాభార్య సుస్వేమ్మాళ్ నిక్షేపంలాగ వుంటే నీకథలో ఆమెని చంపేసి పిల్లల్ని తల్లిలేనివాళ్ళని చేశావు. మీ ఆంధ్రులలాగ దూబర తిండి తినకుండా సాంబారు అన్నంమాత్రమే తిని యెవ్వరికీ దమ్మిడీ అయినా యివ్వాలని అనిపించుకోకుండా గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాను. అలాంటివాడిని అప్పులపాలుచేసి నడివీధిలో నలుగురిచేత కేకలెట్టిస్తావా ? ప్రతినెలా ఒకటోతారీకున అందరిబాకీలు తీర్చేవాడికి నిలవనీడ లేకుండా చేసి సత్రంలో కాపురం పెట్టిస్తావా ? ఇవన్నీ చాలక నాచేత పరారీ చేయించనా ? ఆత్మహత్య చేయించనా ? అని ఆలోచిస్తున్నావా ?" అన్నాడు.

స్తంభించిపోయాను ఆ మాటలకి. నీళ్ళతో నిండిన అతని కళ్లు చూస్తే జాలివేసింది. నేనేం మాట్లాడలేదు.

'ఇలాంటి ఆధారం లేని వ్రాతలు వ్రాయాలని నీకెల్లా తోచింది ?" అని గద్దించి అడిగాడు.

"అనవసరంగా బాధపడుతున్నావు. కథ మొదట్లో "షరా" వుంది. "ఇందలి పాత్రలు కేవలం కల్పితాలు. ప్రత్యేకంగా యే వ్యక్తికీ సంబంధించినవికావు" అని వ్రాశాను. చూడలేదా ? నీమాటలు వింటుంటే నవ్వొస్తోంది. పత్రికకు పంపుదామని నేనేదో కథ వ్రాస్తున్నాను. అందులో వ్రాసిన సంగతులన్నీ ఏ ఒక్కరివో కావు. రెవెన్యూడిపార్టుమెంటులో వున్న సుబ్రహ్మణ్యంగారికి ఆరుగురుపిల్లలు. ఆయన కీమధ్యే భార్యావియోగం కలిగింది. ఆ విషయం కథలోకి తీసుకున్నా, అప్పులు యెగవెయ్యడం, సత్రంలో చేరడం మావూళ్ళో వెంకన్నగారి సంగతి. మా వెనకవీధిలోని నరసింహంగారి తల్లి చందాలు పోగుచేసి ఆయన్ని పోషించింది. ఆ సంగతి తీసుకున్నాను. ఇల్లాగే తెలిసిన నాలుగు సంగతులు తీసుకుని అవసరమైతే కొంత కల్పించి వ్రాశాను. లోకానికి మీ $N.\ G\ O$ లమీద సానుభూతి కలగడానికి వ్రాశా నీకథ." అన్నాను.

మనిషి కొంత సమాధానపడ్డట్టు కనబడ్డాడు.

"అయితే సాటిఆంధ్రుల పేరుపెట్టక అరవ పేరు పెట్టడంలో నీ వుద్దేశమేమిటి ? అరవవారిని అవహేళన చేశానని ఆనందిస్తున్నావా ? ఆంధ్రులు అరవలు అనే ప్రాంతీయభేదం సామాన్య జనానికి వుంటే వుండవచ్చును. కాని, మా $N.\ G.\ O$ లకా ప్రాంతీయభేదం లేదు. ఎక్కడెక్కడివారైనాసరే $N.\ G.\ O$ లమంతా ఒక్కటే. గవర్నమెంటు వుద్యోగులు అనే పదమే తేడా కాని శ్రీశ్రీ యో యెవరో చెప్పినట్లు "గనిలో, వనిలో, కార్ఖానాలో పాటుపడే దౌర్భాగ్య జీవులూ మేమూ ఒకటే. మాకు ఫలితం తక్కువ. ఏవిధమైన గౌరవానికీ అర్హులంకాము."

"కథలో ప్రధానపాత్రకు పేరుపెట్టవలసివచ్చింది. ఏపేరు పెట్టనా అని ఆలోచించాను. చాలా పేర్లు స్ఫురించాయి. అవన్నీ వెనక నేను వ్రాసిన కథల్లో పెట్టిన పేర్లే. "ఆరుముగంఅయ్యరు" అన్న పేరుతోచగానే యీపేరు క్రొత్తది కదా అని యీ కథానాయకుడికి ఆ పేరు పెట్టాను."

"సరేలే. పోనీ పేరుపెడితే పెట్టావు కాని, అన్ని బాధలూ ఒక్కడికే తెచ్చిపెడితే యెల్లా బ్రతుకుతాడనుకున్నావ్ ? పోనీ కథ సుఖాంతం చెయ్యడానికి చూడరాదూ ?"

"అల్లా దార్లోకి వచ్చి అడిగితే చెబుతాను. నువ్వు మాంధాతపుట్టకలనాటివాడివిలాగ వున్నావు. మన భారతీయులు ఒరులకష్టాలు, బాధలు సహించలేని దయార్ద్రహృదయులు. కథలెంతసేపూ సుఖాంతంగావుండాలని అభిలషించేవారు. అందుకే మన పూర్వులు చనిపోయినవారిని యే పార్వతీ పరమేశ్వరుల చేతో, సిద్ధుల చేతో బ్రతికించి కథలను సుఖాంతం చేసేవారు.

పాశ్చాత్యుల పద్ధతి మనకి పూర్తిగా విరుద్ధం. సుఖాంతమైన కథలు చప్పగా వుంటాయిట. కథ రక్తి కట్టదుట. దుఃఖాంతమైనకథే అసలైనకథట. వారి పద్ధతి ఇంగ్లీషు సంస్కారం పొందిన మన భారతీయులందరికీ నచ్చడం ప్రారంభమై క్రమంగా సామాన్య ప్రజానీకపు అభిరుచిగా అయిపోయింది. ఈ రోజులలో అన్నీ దుఃఖాంతమైన కథలేగాని సుఖాంతమైన కథలు మచ్చుకైనా వున్నాయా ? కాక, ప్రజల్ని యేడిపించినంత సులువుగా నవ్వించలేం."

"పాశ్చాత్యుల పద్ధతిగా వ్రాయడం కోసం వెన్నలాంటి హృదయాన్ని వజ్రహృదయం చేసుకుంటావా ? పత్రికా రచయితలంటే చాలా మంచివారనీ, ఒరుల బాధ లర్థం చేసుకునే శక్తివారి కున్నదనీ అనుకునేవాడిని. ఇంత ఘోరంగా బాధించి వాళ్ల బ్రతుకు భారం చేసేవాళ్లని యెన్నడూ అనుకోలేదు. మీకన్న గవర్నమెంటువారే నయం. ఇటీవల మా $N.\ G.\ O$ ల బిడ్డలకు వుచితంగా విద్య గరపడానికి యేర్పాటు చేశారు."

ఆ మూర్ఖత చూస్తే అసహ్యం వేసింది. గట్టిగా చివాట్లేస్తే కానీ ఒడిలే ఘటంలా కనిపించలేదు అందుచేత యిలా అన్నాను "ఏనాటనుండో కవులు వ్రాస్తున్నారు. వారి రచనలలో నమ్మగలిగినవీ, నమ్మలేనివీ కూడా వున్నాయి. "వజ్రాయుధంతో ఇంద్రుడు పర్వతాల రెక్కలు విరగ్గొట్టాడు" అని పురాణాల్లో వుంది. ఇంద్రుడు వచ్చి "నేను పర్వతాల రెక్కలు విరగ్గొట్టానా? నాకీ అపకీర్తి తెచ్చి పెట్టావేమిటి?" అని అడిగాడా వ్రాసినవారిని? పర్వతాలు వచ్చి "మాకు రెక్కలెక్కడివి? భూమితో అంటుకుపోయివున్న మేము యెల్లా యెగురగలం?" అని అడిగాయా? దీక్షితులు, మునిమాణిక్యం, కుటుంబరావు లాంటివారు సుమారు పాతికముప్పైయేళ్ళనుండి రచనలు చేస్తూ నేవున్నారే! ఎన్నెన్ని కథలు వ్రాశారు! వారి కథలలోని పాత్రలను వారు పెట్టని కష్టాలున్నాయా! చెయ్యని హాస్యముందా! ఎన్నడైనా యేపాత్రయినా వారిని దండించిన పాపాన పోలేదు సరికదా కనబడనైనా లేదే? వారంటే భయంచేత కాబోలు క్రొత్తగా బయలుదేరిన రచయితలమనేనా మేమంటే యీ లోకువ? లేకపోతే యిలాంటి విద్దూరం యెన్నడైనా యెరుగుదుమా! కథ రక్తికట్టడానికి అనేక కల్పనలు చేస్తాం. రచయితలను వారికథలలోని పాత్రలు వచ్చి నిలదీసి అడుగుతుంటే వారికి కాగితంమీద కలం నడుస్తుందా!" గొప్పగా అన్నాననుకున్నాను.

"ఇంత అస్వాభావికమైన కథలు వ్రాయకపోతేయేం? ఎవడేడ్చాడు?" అన్నాడు అంతా విని.

నా మనస్సు చివుక్కుమంది. అయినా నా భావాన్ని పైకి కనబడనివ్వలేదు. "పిల్లలపత్రికలు, పెద్దలపత్రికలు, స్త్రీలపత్రికలు, పురుషులపత్రికలు అనేకం బయలుదేరాయి. అవన్నీ నిండవద్దా. ఏ కల్పనా చెయ్యకుండా రచయితలు యథార్థ విషయం వ్రాస్తే చదువరులకు రోతపుడుతుంది. అదీగాక నాకథ అస్వాభావికమైనది కాదే! నా కథలోని ఆరుమగం అయ్యరులాంటి వాళ్లు మధ్యతరగతి కుటుంబాలలో కనబడుతూనే వుంటారు" అన్నాను.

"ఎయ్యి చెప్పూ. లక్ష చెప్పూ, నీ కథ దారుణంగా వుంది. పిల్లలు గలవాళ్లు యిలాంటి వ్రాతలు వ్రాయవచ్చా?" అని అడిగాడు.

"ఈ ప్రశ్న చాలా చిత్రంగా వుంది పిల్లలకీ, పత్రికారచనకీ సంబంధం యేమిటి?"

"పిల్లలు కలవాళ్లెంతసేపూ నవ్వు పుట్టించేవి, భక్తిరస ప్రధానమైనవి, నీతిబోధకములైన వ్రాతలు వ్రాయాలి. మంచివి వ్రాస్తే మంచీ, చెడ్డవివ్రాస్తే చెడుగూ కలుగుతుంది. ఆ విషయం చెబుదామనే వచ్చాను" అన్నాడు.

"ఎంతమంది రచయితలు ఎన్నిరకాల కథలు, వ్యాసాలు, పద్యాలు వ్రాయడం లేదు? ఎవరికైనా ఆపద వచ్చిందని అనుకోవడం విన్నామా? నీ చాదస్తంగాని మరేం ఫరవాలేదు," అన్నాను నవ్వుతూ.

"వ్రాస్తే వ్రాశావు కాని పత్రికకు పంపడానికి యెంతమాత్రం వీల్లేదు" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్లు.

"పంపితీరతాను. నే నీ కథ వ్రాసింది పత్రికకు పంపడానికే" అన్నాను ఒళ్లుమండి.

"అల్లాగేం? నీకథ అచ్చుపడనీ యేంచేస్తానో చూద్దువుగాని. నే నెలాంటివాడినో యెరక్క అల్లా మాట్లాడుతున్నావు. నేను పెద్దమనుషులలో పెద్దమనిషినీ, రౌడీలలో రౌడీని. జాగ్రత్త" అని కళ్ళవెంట నిప్పులు రాలుస్తూ వెళ్ళిపోయాడు.

ఆ ముఖం చూసేటప్పటికి నా కేమిటో చెప్పలేని భయంవేసింది. నా వొంట్లోని ప్రతీనరం వొణుకుతున్నట్టనిపించింది. పత్రికకు పంపుతానని అంత తెగేసి చెప్పిన నాకు ఆ కథను పంపడానికి మనస్కరించలేదు. గాలికి టపటప కొట్టుకుంటున్న కాగితాలని ముక్కలుగా చింపేసి నలిపి చెత్తబుట్టలో పారేసి "అమ్మయ్య" అనుకున్నాను. మనస్సెంతో తేలిక పడ్డట్టయింది.

*   *   *   *

పిల్లల కేకలతో మెలకువ వచ్చింది. నాకథ కాగితాలను చింపి పడవలు కడుతున్నారు నా కాళ్లదగ్గిర కూర్చుని గాబాబూ, లక్ష్మీ.

సహవాసం

ప్రొద్దున్నే మొఖము కడుక్కొని "అమ్మా! తుండుగుడ్డెక్కడుందే? కనపడటంలేదు. కాస్త చూసివ్వమ్మా." అని కేకేశా.

"ఆఁ. ఇక ఇదే పనినాయనా! ఇంకేం పని లేదిక్కడ నాకు. ఇరవై ఏళ్లు వచ్చినా నీకు అన్నీ అందిస్తూ కూర్చోవాల్సిందే. ఎవరొస్తుతారు బాబూ! నీకి వత్తులన్నీ. అందుకనే పెళ్ళి చేసుకోమంటే విన్నావూ? ఆవిడగా రొస్తే, సరిదిద్దుకు పోతుందిగా అటువంటివన్నీనూ."

ఇదీ అమ్మ సమాధానం-చాలరోజుల నుండీ, ముఖ్యంగా, ఈమధ్య ఆ సంబంధం కాదన్నదగ్గరనుండీ ఈ కసుర్లు, విసుర్లు, వినొస్తున్నాయి మాటిమాటికీ. హుఁ కాక పోతే తుండుగుడ్డకూ నా పెళ్లికీ లంకేమిటి?

ఎంత వెదికినా తుండుగుడ్డమటుకు కనపడలేదు. మళ్ళీ అమ్మ నడగటానికి, ధైర్యంలేదు. అడిగినా లాభంలేదు, మళ్ళీ నాల్గుతిట్లు తిని మాడు బొప్పి కట్టించుకోవటంతప్ప.

కాని మొఖం తడి ఆరిపోతుందొకవైపు. చేసేదేమీలేక వంటిపై చొక్కాతోటే (దానితోటే కాలేజి కెళ్లాలి) తుడిచేసుకున్నా.

కాని హృదయంలోమటుకు, అమ్మ మాటలఘాటు, పోటు సమసిపోలా. నేనెంతగానో ప్రేమించే అమ్మకే,నా ఈనిరసన! నేనేం, కొండమీద కోతిని తెచ్చిపెట్టమన్నానని ఈ నిష్ఠురత!

సరే! కుర్చీలో కూలబడి 'జువాలజీ టెక్స్టు', తీశా చదవటానికి. పేజీలన్నీ అలానే ఉన్నాయి. మధ్యలో బొమ్మలు కత్తిరించబడి ఉన్నాయి. నాకడుపు మండిపోయింది. ఇది వెధవ కృష్ణుడిపనే. పట్టుకొని ఎముకలు విరగగొడదామన్నంత కోపమొచ్చింది. వెంటనే ఇంట్లోకి పోయి చూశా. ఎక్కడా కనిపించలా' వాకబు చేస్తే అప్పుడే బళ్లోకి వెళ్లాడట. ఇక ఆ పట్టున బడికెళ్ళి చితగగొట్టాలన్నంత పిచ్చికోపము వచ్చింది.

పదిగంటలు కాగానే కాలేజికి బయలుదేరుతూ, నాన్నను అడగలేక అడిగా, ఒక పదిరూపాయలు కావాలని. ఎందుకనడిగితే, ఇవ్వాళ ఫ్రెండ్స్‌తో కలసి ఎగ్జిబిషన్‌కు వెళ్లుతున్నానని చెప్పా.

"ఏం, ఎగ్జిబిషన్రా! ఏముంటుందక్కడ కుహుఁ! అనవసరంగా డబ్బుదండగ. నాదగ్గర ఇప్పుడేమీ లేదే" అన్నాడు.

"అలాకాదు నాన్నా! ఐదురూపాయలన్నా ఇవ్వండి," అన్నా.

"నా పర్సులో ఇప్పుడు కానీ కూడ లేదురా. నన్ను విసిగించకు," అని తేల్చి చెప్పాడు నాన్న మొఖం ముడుచుకుని.

ఇక లాభములేదని పుస్తకాలు తీసుకుని సైకిల్ దగ్గరకు వెళ్లేటప్పటికి అది కాస్తా పంచర్ పడుంది. ఇది తప్పకుండా ఆ ఫ్యాక్ గాడిపనే. ఎక్కడెక్కడో చక్కర్ కొట్టొచ్చుంటాడు. టైం అరగంటే ఉంది. ఆ ఫ్యాక్ కోసము చూశా, మొఖము వాచేటట్లు చీవాట్లుపెట్టి పోదామని. కాని వాడెటు మాయమయ్యాడో పత్తాలేదు.

ఇక ఎట్లానో దారిలో షాపుదగ్గర పంచర్ బాగుచేయించుకొని బయలుదేరా.

దారిలో దీపక్‌మహల్ మలుపులో ఒక బుక్‌స్టాలుంది. ఒక సైకిల్‌వాలా సైకిల్ తొక్కుతూనే, ఆ స్టాలులోంచి కనబడుతున్న సినిమాతారల ముఖచిత్రాలను పారజూస్తూ, వాటిలో లీనమైపోయి అమాంతం వచ్చి నాసైకిల్‌కు ఢీకొట్టించాడు. తను ఏదో ధ్యాసలో మునిగుండి తప్పుదారిని సైకిల్ తొక్కుతూవచ్చి నాపై పడ్డందుకు క్షమాపణ వేడుకోకపోగా, "ఏం, మిస్టర్! కళ్లు కనపడటంలా" అని దబాయించి కళ్ళురిమి వెళ్ళిపోయాడు.

ఇంతలో ఉంది న్యాయం! ఏమిచేయాలిటువంటి వాళ్ళను? ఇది సర్దుకుని తిరిగి నా వాహనం ఎక్కుతున్నానో లేదో, ఓ సైకిల్ రిక్షావాడు సాంతం నాకాలు మీదుగానే నడిపించుకపోతున్నాడు. కనీసం, ఏమి జరిగిందోనని, వెనక్కైనా తిరిగి చూడకుండా. ఇంక నాకు కోపం ఆగలా. ఆ రిక్షావాణ్ని పట్టుకుని అక్కడే చంపేద్దామనిపించింది.

"అరేయ్, రిక్షా; వెధవ రేస్కెల్. నిలబడక్కడ. నిలబడమంటే" అంటూ వాడి దగ్గరకు చేరా. "ఏంరా! వెధవ! కళ్లు కనపడటంలా," అన్నానో లేదో ఆ రిక్షాలో ఆయన ఏధో కార్మికసేవకుడులాగా ఉన్నాడు-"ఏయ్, మిస్టర్! కొంచెము జాగ్రత్తగా వాడు మాటలు. ఎందుకలా అనవసరంగా తిడతావు వాణ్ని? వాడుమటుకు నీలాగా, మనిషి కాదూ! తోటి మానవుణ్ని అలా పశువులాగా చూడొచ్చా?" అని ఎదురొక్కన్నాడు.

ఈదెబ్బతో నిజంగా నేను నిర్విణ్ణుడినై పోయాను. హారి భగవంతుడా! ఎవరిప్పుడు నిజంగా వాడ్ని పశువులాగ జూస్తున్నారు! చూడటమేమిటి! ఆ పెద్దమనిషి ఒకవైపున వాడ్ని పశువులాగే ఉపయోగించుకుంటూ వాహనం ఎక్కి కూర్చుని, పైగా నేను జూస్తున్నానట వాడ్ని పశువులాగ. ఇదంతా చూస్తుంటే కడుపులో ఏదో కార్చిచ్చు రేగుతూంది, ఎందుకనో.

మొత్తముమీద కాలేజి చేరి క్లాసు కెళ్ళేటప్పటికి పది నిముషాలు లేటయింది. బోటనీ లెక్చరర్ తన సెకండ్ హాండ్ విజ్ఞానాన్ని అనర్గళంగా అప్పచెప్పుకు పోతున్నాడు ఎవరు విన్నా, వినకపోయినా. పర్మిషన్ తీసుకుని క్లాసులో కెళ్ళి కూర్చున్నా.

కొంచెము సేపటికి యధాప్రకారమే "కంపౌండర్! కంపౌండర్!" అని కేకలు బయలుదేరాయి క్లాసునలుమూలలా. ఇదీ



పుస్తకం మధ్యలో బొమ్మలు కత్తిరించబడి ఉన్నాయి!

★ ఆత్రేయ ★

మా లెక్చరర్ గారికి అవసరము కొద్దీ స్టూండెంట్స్ పెట్టవలసొచ్చిన నిక్ నేమ్. ఈ అవసరమైన నిక్ నేమ్ ఎందుకంటే, మా కాలేజీలో బోటనీ లెక్చరర్ కీ కెమిస్ట్రీ లెక్చరర్ కీ ఒకే పేరుంది. కెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ డిగ్రీ సంపాదించాడు గాబట్టి, ఆయనన్నందరూ, 'డాక్టర్' అంటారు. మా బోటనీ లెక్చరర్ పోయిన సంవత్సరమే వచ్చారు మా కాలేజికి. మరి ఇద్దరి పేర్లూ ఒకటే కావటంవలన సంభాషణలో ఎవళ్లు ఎవరాఅని గుర్తుంచు కోవటం చాల దుస్తరంగా ఉండేది. ఎటు గూడి డాక్టరుగా రొకాయన ఉండనే ఉన్నారు, కాబట్టి ఈ క్రొత్తాయనను కంపౌండర్ అందాం అన్నాడు ఛలోక్తిగా ఓ క్లెవర్ స్టూడెంట్. ఇక నేం! ఈయన ఆరోజునుండీ ఈ పేరనే బరగుతున్నాడా కాలేజిలో.

ఇక ఆయన పిరియడప్పుడల్లా ఇదేగోల. ఈరోజుకూడ అలాగే సాగిపోతున్నది. ఈరోజు ఎందుకో ఆయన మా బెంచిలవైపే చూస్తున్నాడు. నిజానికి, ఆ గోలచేసేవాళ్లు ఉన్నది డా మా బెంచీల్లోనే. కాని ఆయన ఈసారి ఉండిఉండివచ్చి అమాంతం నన్ను పట్టుకుని క్లాస్‌లోంచి వెళ్ళిపొమ్మన్నాడు. కారణమేమంటే నేను నవ్వుతున్నానట. అందుకని నేనే ఆ విధంగా అనుంటానని ఆయనగారనుకున్నారట.

నా జన్మలో నాకింతవరకు గోలచేయటమంటే అసలు చేతకాదు. ఇష్టముకూడ లేదు. కాని ఎవరన్నా గోలజేస్తుంటేమటుకు నవ్వుతాను. ఆపుకున్నా ఆనవ్వు ఆగదు. అది నాలో పుట్టుకతో వచ్చిన బలహీనత.

కాని ఆయనకేం తెలుసు, అసలుగోల చేసేవాళ్లు ఎప్పుడూ నవ్వరని. ఎంతసేపు ఎన్నివిధాల నేను నిర్దోషినని వాదించినా ఆయనగారు తన జడ్జిమెంటును, ఉపసంహరించుకోలా. ఇక చేసేదిలేక బయటకొచ్చేశాను. కాని దీనితో నిజంగా పిచ్చెత్తినట్లయి పోయింది నాపని.

ఈ తీరికలో అలా 'నోటీస్‌బోర్డ్'వైపు వెళ్ళి ఒకసారి చూసొచ్చి వరండాలోవచ్చి నుంచున్నాను. సాయంత్రపు ఎగ్జిబిషన్ విషయము మాటిమాటికి మెదడులో దొలుస్తూంది. ఇంతలో 'గోపీ' ఇటొస్తూ కనపడ్డాడు. వాడు నావద్ద ఎప్పుడు తీసుకుంటేనేం, ఇప్పటికి మొత్తము పదిహేను రూపాయలదాకా ఇవ్వాలి. ఎప్పుడడిగినా పాతవి చెల్లించకుండానే క్రొత్తబాకీ పెడుతుంటాడు. కాని ఇవ్వాళెట్లాగయినా గొంతుమీద కూర్చొని కొంతవరకైనా వసూలుచేద్దామనుకున్నాను. కాని ఎప్పటిలాగే వాడు మొండిచెయ్యి చూపెట్టాడు. కాదు, చాల అవసరమనీ, ఇవ్వకతప్పదనీ, పట్టుబట్టి అడిగాను. తెగలాగితే తెగి ఊరుకుంటుందన్నట్లుగా అయింది వాడితోటి వ్యవహారం. "ఏమిటోయ్, ఇలా గొంతుమీదొచ్చి కూర్చొని పీడిస్తావ్. మార్వాడీసేట్లు, కాబూలీవాలాలన్నా నయమే నీకంటే" అంటూ ఏకుమేకులాగ తేలాడు. అక్కడకు చేరిన వాడి స్నేహితులు కూడ వాడికి వత్తాసుఇస్తూ, నేనేదో 'షైలాక్' అయినట్లు చూడసాగారు నావైపు. వాడి మాటలు, వాళ్ళమాటలు వింటుంటే, నాకు ఆశ్చర్యము, అసహ్యము కూడ వేశాయి. కాని చేయగలిగినదేముంది? చివరకు విసుగొచ్చి "ఎపుడిస్తావు? తేల్చి చెప్ప"మన్నా వాడితో. "ఉన్నప్పుడ"న్నాడు వాడు, వాడికేమీ ఇవ్వాల్సిన బాధ్యత అసలు లేనేలేనట్లు. ఇంక వాడితోటి ఏమిమాట్లాడుతాం! కాని లోపల కోపంతో రక్తంమటుకు ఉడికిపోతూంది.

నాలుగ్గంటలకు కాలేజిఅయిపోగానే ఇంటికి బయలుదేరా. దారిలో సుగుణమాట జ్ఞాపకమొచ్చింది.

ఆ అమ్మాయి మొన్న మోహన్‌ని నోట్సివ్వమని అడగటం నేను చూశా. వాడి మొఖం వాడెక్కడన్నా, సినిమా పత్రికలు, లేకపోతే, మోహిని, రేరాణులు, తీసుకవచ్చి ఇవ్వమంటే ఇస్తాడుగాని, ఈ నోట్సు లెక్కడ తెచ్చి ఇవ్వగలుతాడు? ఆ అమ్మాయి మరి అంతటితో ఎవ్వర్నీ తిరిగి అడక్కుండా ఊరుకుంది. ఇది నాకు చాల ఆశ్చర్యంగా ఉంది. నన్నడగకూడదూ, ఎన్నిరోజులుంచుకుంటానన్నా మారు మాటడకుండా ఇచ్చేవాడిని. కావాలంటే నేనే శుభ్రంగా వ్రాసిచ్చేవాడిని.

ఆ అమ్మాయి సిగ్గుపడి నన్ను అడగటం లేదేమోనని, నేనే మాట్లాడి ఇద్దామని నిశ్చయించుకున్నాను. కాని ఆ అమ్మాయి, నిన్న ఇవ్వాళకూడ కాలేజికి రాలేదు. ఆ అమ్మాయి ఇల్లు నాకు తెలుసు కాబట్టి ఇంటికి వెళ్ళి ఇద్దామని నిశ్చయించుకున్నా.

నిజంగా సుగుణ ఇల్లు సమీపిస్తుండగానే మనస్సులో తియ్యటి తలపులు మెదలాడుతుంటే, ఒడలంతా పులకరింప నారంభించింది. సుగుణ ఇంటికెళ్ళి ఆవరణలో అడుగు పెట్టగానే వాళ్ళ ఫ్యాన్ తారసిల్లాడు. వాడితో చెప్పా సుగుణను చూడాలనీ, సుగుణతోనే మాట్లాడాలనీ.

ఇంతలో సుగుణ వచ్చింది. ఆ దగ్గరున్న కుర్చీలో కూర్చోమనన్నా అనకుండా,



"మీ నోట్సు అక్కరలేదండీ; మీరు శ్రమపడి మా ఇంటికల్లా వచ్చారు."అంది.

ఆశ్చర్యపోయి, వింతమృగాన్ని చూసినట్లు చూడసాగింది నావైపు.

"ఇదిగో మీరు నోట్సు కావాలన్నారు కదూ మోహన్‌తో. నిన్ననే చూశాను క్లాస్‌లో ఇద్దామని. కాని నిన్న, ఇవ్వాళ కూడ రాలేదు మీరు కాలేజికి. అందుకని ఇంటికి తీసుకొచ్చాను" అని సుగుణ కళ్ళల్లోకి చూశా.

"థేంక్స్. కాని నాకేమీ నోట్సు అక్కర్లేదండీ. మీరు శ్రమపడి మా ఇంటికల్లా వచ్చారు" అంది నవ్వుతూ. ఆ నవ్వులో ఒకవిధమైన, నిరసన, హేళనా, కొట్టొచ్చినట్లు తొణికిసలాడినవి.

"మరి మీరు మొన్న మోహన్‌ని అడిగితే!" ఆశ్చర్యాన్ని దాచుకోలేక అడిగేశా.

"ఏమిటి! ఇది మోహన్ దా అండి. అవును. అడిగాను, అయితే ఇలా ఇచ్చిపొండి. తనే ఎందుకు రాకూడదో మోహన్." అన్న సుగుణ మాటల్లో, మోములోకూడ, ఎక్కడలేని ఆనందము హుషారు వెల్లివిరిశాయి, నోట్సు మోహన్ దనుకునేటప్పటికి.

"అతనసలు నోట్సు వ్రాయడండీ ఈ నోట్సు నాదే. మీనోట్సు, కంప్లీట్‌గా లేకపోవటంవలన చదువు సాగటంలేదేమోనని తెచ్చా"

ఈసారి ఈమాటలు వినేటప్పటికి సుగుణ మోము చిన్నపోయింది.

"అదాండీ! ఇప్పుడు మీ నోట్సేమీ అక్కరలేదు లెండి నాకు. మొన్న ఎట్లానో సులోచనదగ్గర అడిగి తీసుకుని, వ్రాసేసుకున్నానులెండి" అని ఇంట్లోకి వెళ్ళిపోబోతూ అంది.

సుగుణకోసం అలమటించే ఈ పాడు ప్రాణం నన్ను ఊరుకోనివ్వలా.

"పోనీ ఇంకేమన్నా ఫిజిక్స్, కెమిస్ట్రీ నోట్సులు కావాలా అండీ?"

"అబ్బబ్బ, నాకేమీ అక్కర్లేదండీ. మీరిక వెళ్ళొచ్చు." అంటూ వెనక్కు తిరిగి చూడనైనా చూడకుండా ఇంట్లోకి జారుకుంది.

నిలువునా నీరైపోయాను. హతాశుడనై ఇంటికొచ్చి యీజీచైరులో కూలబడ్డా. జరిగినదంతా నా మెదడుకు కీలాగ పనిచేసి, కదిలింప నారంభించింది.

ఈరోజునుండి డైరీ వ్రాసుకుందామని కొన్న డైరీ టేబిల్ మీద కనపడుతోంది. వెంటనే తీసి ప్రొద్దుట్నుండి జరిగిన ఈ ముఖ్యమైన ఘటనలన్నీ వ్రాశా. ఆ వ్రాసిన వాటిని ఒక్కసారి సింహావలోకన చేసేటప్పటికి, వెంటనే చెప్పనలవిగాని ఆవేశము ఆవేదన లలముకున్నాయి నాలో. ఒక్కొక్క సంఘటన చదువుతున్నకొలదీ, ఒక్కొక్క విధముగా, నాలో క్రోధావేశాలు ఆశ్చర్య సంభ్రమాలు పెరిగిపోజొచ్చాయి.

ఏమిటి! ఇంట్లో రక్తసంబంధీకుల దగ్గర నుండి బయట రిక్షావాడు, సైకిల్ వాలాలు, క్లాస్‌లో లెక్చరర్, నా డబ్బుతిన్న ఫ్రెండ్, నేను ప్రాణప్రదముగా ప్రేమిస్తున్న సుగుణ అంతా నాకు విరోధులేనా! ఆలోచిస్తున్నకొద్దీ నాకు, అంతా ఏదో ఒక విధంగా, కాకపోతే తరతమ భేదాలలో, అపకారం చేసినట్లె ననిపించారు. నన్ను ఏడిపించటమే వాళ్ళ ముఖ్యోద్దేశములాగ కనిపించింది.

నాలో అప్రయత్నంగా ప్రతీకారేచ్ఛ ప్రబలింది. ఇక నామనస్సు నా స్వాధీనంలో లేదు. వీళ్ళంతా ఇలా బాధిస్తుంటే నేనెందు కూరుకోవాలి? నేనంత చేతకానివాడనా? అసలు మెత్తనివాణ్ణి చూస్తే మొత్త బుద్ధవుతుందట ఎవరికైనా! ఏం? నేనుమటుకు ఎందుకు మెత్తగా ఉండాలి? మాటకుమాట పంటికిపన్ను, కంటికికన్ను, జవాబు చెబుతాను. ప్రతివాడికీ ప్రతీకారము చేసి వదులుతాను. తిరిగి డైరీ చూశా. ఆ రోజు మొట్టమొదటి నేరం చేసింది మా తమ్ముడు కిష్టాయ్. టేబిల్ మీద జువాలజీ టెక్స్ట చూసేటప్పటికి, నాకోపం అసలే చరమస్థాయికి పోయింది.

వెంటనే 'అరేయ్, కిష్టాయ్,' అని ఇంట్లోకి పొయ్యేటప్పటికి, వాడు ముందుగానే సడిగన్నాడుగామాలి, ప్రక్కవాళ్ళింట్లో వెళ్ళి దూరాడు. అసలు వాడికి ప్రొద్దున్న నేను కేకలువేసిపోయిన సంగతి ఎవరో చెప్పుంటారు. అందుకనే వాడు నేను వచ్చినప్పటినుండీ తప్పుకునే తిరుగుతున్నాడు. అయినా వదిలిపెడతానా వెధవాయిని? ప్రక్కవాళ్ళింట్లోనుంచి లాక్కొచ్చి అమ్మ అడ్డమొచ్చినాకూడా నెట్టేసి, చావ చితగ్గొట్టొదిలిపెట్టా.

ఇక ఆపని తీర్చుకవచ్చి తిరిగి కుర్చీలో కూలబడ్డా. తమ్ముణ్ణి కొట్టినదెబ్బలకు ఇంకా చేతులు తిమ్మిర్లు పుడుతూనే ఉన్నాయి. ఆవిధంగా హూనంచేసి వదిలిపెట్టానన్నమాట వాడివళ్ళు.

ఇప్పటికి ఒక ప్రతీకారము నెగ్గించా. అయినా మనస్సులో ఇంకా ఆ క్రోధావేశము తగ్గలా. ఎలా తగ్గుతుంది, ఇంకా నన్ను అవమానపరచిన ముఖ్యులంతా అలానేఉంటే. కాని చేతిక్రింది తమ్ముడైతే, ఎన్నితన్నినా నక్కినపేనులాగా పడున్నాడుగాని, పైవాళ్ళ పైన ఎట్లా దెబ్బకుదెబ్బ తీర్చుకోవటం? వాళ్ళపై దెబ్బకుదెబ్బ తీయాలంటే ముందు నానా హంగామాకు, దెబ్బలాటలకు దిగాలి. అందుకు సిద్ధంగా ఉన్నా నా అంటే సిద్ధంగా లేను.

నా అశక్తతకు నాకే నాపైన కోపము, అసంతృప్తి, ఉక్రోషము, అన్నీ వచ్చాయి. మనస్సు పూర్తిగా విచలితమైపోయింది. ఇంతలో దృష్టి టేబిల్ మీద తెరచి పడియున్న ఓ పత్రికపై పడింది. కనపడుతున్న పేజీ క్రింద భాగంలో ఈక్రింది వాక్యము ఉంది.

"అపకారబుద్ధి నిన్ను శత్రువుకంటె హీనపరుమను. ప్రతీకారబుద్ధి నిన్ను అతనితో సమానుని చేయును. క్షమ, ఓర్పు నిన్నతనికంటె అధికుని చేయును" బెంజిమిన్ ఫ్రాంక్లిన్.

దానిని అప్రయత్నముగా ఇంకా రెండు మూడుసార్లు చదివాను. ఆ వాక్యము అమాంతము నాకు తెలియకుండానే నా మెదడులోనికి ప్రయాణము చేసింది. అంతదనుక నా మెదడులో వీస్తున్న అశాంతి వీచికలన్నీ ఒక్కసారి అంతరించాయి. దానంతటదే పరిపూర్ణ ప్రశాంత తేర్పడింది హృదయంలో. నాకు చాల ఆశ్చర్యం వేసింది, నాలో వచ్చిన ఈ ఆకస్మిక మార్పు చూసేటప్పటికి.

చక్కగా అది నా ప్రస్తుత సమస్యకు ఏదో తిరుగులేని పరిష్కార మిస్తున్నట్లుగా

తోచింది. ఎడారిలో ఒయాశిస్సులా అనిపించింది. నిత్యజీవితసత్యాన్ని ఇంత నిర్దుష్టంగా ప్రబోధిస్తున్న ఈ అమర వాక్కును తరచి తరచి ఆలోచిస్తున్న కొద్దీ దానిలోని గొప్పతనము దానంతటదే ఇంకా ఎక్కువగా స్పష్టము కాజొచ్చింది.

ఈసత్యాన్ని అందరూ గుర్తించి పాటించితే ప్రపంచములో మానవుని జీవితము, ఎంత మాననీయముగా ఉంటుంది!

ఇక ఇదే వాక్యాన్ని నా జీవితానికి అన్వయించి చూసుకున్నా వెంటనే.

మొట్టమొదటి విషయంలో, జయించానటంలో ఏమీ అతిశయోక్తి లేదు. అసలు నాకింతవరకు ఎవరిమీదా పెద్ద శత్రుత్వము లేదు. ఒకరూ అరా ఉన్నా వాళ్ళకెప్పుడూ అపకారముచేసిఎరుగను. అందుచేత ఒక వేళ ఉన్నావాళ్ళకంటె తక్కువయ్యానసే ప్రశ్నే రాదు.

ఇక రెండో విషయము ప్రతీకారము. ఇప్పుడు నన్నెదుర్కొన్నది సరిగ్గా ఇదే సమస్య!

"ప్రతీకారబుద్ధి నిన్నతనితో సమానుని చేయును" అన్నాడు ఫ్రాంక్లిన్.

ఆలోచించ సాగాను. అసలు ప్రతీకారమంటే ఏమిటి? ఒకరు మనకెట్టి అపకారము చేసి మన మనస్సుకుగాని, శరీరానికి గాని కష్టము గల్గించాడో, అదే అపకారమును అదే మోతాదులో గాని, లేక చేతనైతే రెట్టింపుగాగాని వాడికి ముట్టజెప్పి వాడ్ని కష్టపెట్టటం, మళ్ళీ వాడు మరికాస్త రెచ్చిపోయి మనల్ని దెబ్బగొట్టటానికి చూడటం, మళ్ళీ మన ప్రతీకారం. మళ్ళీ వాడు—మళ్ళీ మనం—ఇక దీనికి అంతేమిటి? ఎప్పుడు? ప్రత్యర్థికి ప్రతీకారము చేయగలశక్తియున్నంతవరకు, లేక ఇద్దరిలో ఎవ్వరో ఒకరు సర్వనాశనమయ్యేవరకు ఇలా జరుగుతూపోవలసిందే!

ఈ మన ప్రతీకారంవల్ల శత్రువు మారతాడా అంటే మారడు. పైగా దీనివలన ఒరిగేదేమిటి? ఏ బాధనైతే అతనివలన పొంది మనము కష్టపడుతున్నామో, అదే బాధను, లేకపోతే అంతకంటె ఎక్కువ బాధను వాడిచేత అనుభవింపజేయుటం. అంతే. దీనివలన మనబాధ ఏమన్నా తప్పటంగాని తగ్గటంగాని జరుగుతుందా అంటే అదేమీలేదు. అసలు మనము అవతలివ్యక్తివల్ల పొందిన బాధను స్వానుభవముచే తెలుసుకొనివుండి కూడా, తిరిగి దానిని వాడిచేత అనుభవింపజేయటంలో అర్థమేమిటి? కేవలం ఒకవిధమైన పశుసంబంధమైన ఉద్రేకము, మానవబలహీనతానూ!

ఈవిధంగా ఆలోచిస్తున్నకొద్దీ "ఆ చెంపకొడితే ఈ చెంప చూపించు" అన్న క్రీస్తు మహాత్ముని సూక్తిలోని మహత్తు నాకిప్పుడు బాగా అర్థమయింది. దీనితో అసలు ప్రతీకారము చేయటమనే పనే ఒక పశుకార్యముగా తోచింది. ఇటువంటి ఆలోచన వచ్చినందుకు ఒకవిధమైన భయము వేయసాగింది.

అసలింతకుముందు ఎవరికైనా ప్రతీకారము చేశానా? చేసినట్లు నాకు జ్ఞాపకములేదు. అసలు అటువంటి ఆలోచనలే నాకు తట్టలేదు ఇంతకుముందెప్పుడూ. మరి ఈ రోజీ ఆలోచన ఎందుకొచ్చినట్లు? కళ్ళొక్కసారి మళ్ళీ వ్రాసిన డైరీ పేజీమీదకు పోయినవి. తీరాచూస్తే, ఏ ఒకటో రెండో మినహాయిస్తే తక్కినవన్నీ సర్వసామాన్యముగా రోజూ జరిగే సంఘటనలే ఈ రోజూ అందులో ఉన్నవి. అయితే ఎప్పుడూ ఇలా క్రోధావేశాలకు లోనుకాలేదే! ఈ ప్రతీకారేచ్ఛ జనించలేదే! కారణం సహజంగా నాది ప్రతీకార ప్రకృతి కాకపోవటమొకటీ, రెండోది ఎప్పుడు జరిగినవాటిని అప్పుడు మరచిపోతూ ఉండటం.

మరి అలాగే ఈరోజుకూడా ఎందుకు మర్చిపోలేక పోయాను. దానికి కారణం క్రొత్తగా ఆరంభించిన ఈదినచర్య లేఖనమేనని, నే నింతకుముందు కొద్దో గొప్పో నేర్చుకున్న డిడక్టివ్ లాజిక్ తేల్చి చెప్పింది.

"ఆరోజు జరిగిన సంఘటనలన్నీ ఒక్కచోట జేర్చి చూసుకునేటప్పటికి, వేర్వేరు ఘటనల సంఘటిత సమిష్టి ఆవేశబలము, నా సహజ శాంతభావాన్ని లొంగదీసి, ప్రతీకారేచ్ఛను ప్రబలింపజేశాయి" అనే నిశ్చయానికి రావటానికి నాకెంతో కాలము పట్టలా.

ఎంత పనిచేసింది ఈ దినచర్య హాబీ!

ఇంతలో "మన కెందుకురా, ఈ దినచర్యలు గినచర్యలన్నీ? ఏదో గొప్పవాళ్ళకుగాని అలాటివన్నీ" అని డైరీ కొనేటప్పుడు వెంటఉన్న రామూ అన్నమాటలు జ్ఞప్తికొచ్చాయి.

వెంటనే ఒక్కక్షణముకూడా ఆగకుండా, ఆ దినచర్యతోసహా డైరీ మొత్తాన్ని పరపర చించి అవతల పారేశాను. వెంటనే అప్పటివరకు ఎంతో ఇరుకునబడిఉన్న హృదయం ఒక్కసారి సువిశాలమయినట్లనిపించింది. ఎవరు ఎన్నికష్టాలు తెచ్చిపెట్టినా తిరిగి పల్లెత్తి ఒక్కమాట అననీయని నూతనమైన ఓ శక్తి నాలో ఆవిర్భవించినట్లయింది. ఆ సమానంలో నే ఏదో అమరసుఖానుభూతి గోచరించింది.

ఇంతలో "పరపర డైరీ చించేసిన శబ్దమయేటప్పటికి ఇంట్లో ఏడుస్తున్న తమ్ముడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

వాడ్ని చూసేటప్పటికి నాహృదయం ద్రవించిపోయింది. వెంటనే ఎత్తికొని లాలించిందాకా మనస్సు ఆగలా.

"ఇంకెప్పుడూ కొట్టనులేరా కృష్ణుడూ" అనేటప్పటికి వాడు వెంటనే, "ఇంకెప్పుడూ నీ పుస్తకాల్లో బొమ్మలు చించనులే అన్నయ్యా" అన్నాడు. ★

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

23

డిఫార్జ్ పానశాలలో, ఆ రోజు మామూలుకంటే పెందరాళే మధుసేవ ప్రారంభమైంది. అప్పటి కింకా ఉదయం 6 గంటలేనా కాలేదు. క్రొత్తగా వచ్చినవాళ్లు కటకటాల్లోనుంచి తొంగి చూస్తుంటే, అప్పటికే మధుసేవలో నిమగ్నులైవున్న పెద్ద మనుషుల బుర్రలు లోపలనుంచి కనుపించుతున్నయ్. అల్లాంటి సమయాల్లో, అంటే వత్తిడి సమయాల్లో, మంది పెరిగినకొద్దీ మజ్జిగపల్చనైనాయన్నట్టు, పల్చని పానీయాన్నే అమ్ముతూ వుంటారు. ఆ పానీయం పుచ్చుకోవటంవల్ల శరీరంలో వెచ్చపుట్టక పోయినా, ఆనాటుమనుషుల హృదయ కుహరాల్లో లోలోపల ఏవేవో జ్వాలలు రేగుతూనే వున్నయ్.

ఇలా, ఇంత పెందరాళే పానీయస్వీకరణ ప్రారంభం కావటానికి యిది మూడో రోజు. మధుసేవకంటే మంతనలు ముందుగా ప్రారంభమౌతున్నయ్; గుసగుసలాడేవాళ్లు గుసగుసలాడుకుంటూ వుంటే, యీ బల్లదగ్గిరనుంచి ఆ బల్లదగ్గిరికీ ఆ బల్లదగ్గిరనుంచి యీ బల్లదగ్గిరికీ తిరిగేవాళ్లు తిరుగుతున్నారు. వాళ్ళందరి దగ్గిరా డబ్బులుంటే నిజంగా పీపాలతరబడి సారా కావలసివచ్చేది. కాని వాళ్లల్లో చాలామంది సారాకు బదులు కబుర్లు తాగుతున్నారు.

అంతమంది జనం వస్తూపోతూవున్నా పానశాలయజమాని మాత్రం అక్కడెక్కడా పత్తాలేదు; అతను కనుపించలేదని అనుకున్నవాళ్ళు కూడా లేరు. అతన్నిగురించి భోగట్టా చేసినవాళ్ళే లేరు. గల్లాపెట్టెదగ్గిర డిఫార్జ్ భార్య ఒక్కతే కూర్చునుండటం కూడా యెవ్వరికీ ఆశ్చర్యంగా వున్నట్టు లేదు.

ఆ రోజుల్లో గూఢచారులు, రాజభవనం దగ్గరనుంచి క్రిమినల్ జైళ్లవరకూ సమస్త ప్రదేశాలనూ పరిశీలించుతూవుండేవారు. అలాంటివాళ్లెవళ్ళైనా యీ పానశాలలోకి తొంగిచూస్తే, పనీపాటాలేని మనుషు లెవళ్ళో యేమీ తోచక కూర్చున్నట్టు కనుపించుతుందిగాని మరో ఆందోళనేమీ వున్నట్టు బోధపడటం కష్టం. చీట్లపేక ఆడుతూన్నవాళ్ళు ఆడటం మానేసి యేమీ పని తోచనివాళ్ళలాగు పేకముక్కల్తో మేడలు కడుతున్నారు; సారా తాగుతున్నవాళ్ళు తాగటం మానేసి బల్లలమీద చిందపడ్డ సారా బొట్లతో బొమ్మలు గీస్తున్నారు. మాడమ్ డిఫార్జి కూడా పన్ను కుట్టుపుల్లతో జాబ్బా చేతులమీద అలాగే బొమ్మలు గీస్తూ, ఏదో ఆలోచిస్తూ వుంది.

మధ్యాహ్నం దాటింది; సెయింట్ ఆంటోనీ వీధిన బడి దుమ్ము గొట్టుకుంటున్న దుస్తులతో యిద్దరు మనుషులు చకచకా నడిచివస్తున్నారు. వాళ్లిద్దరిలో ఒకడు సారాదుకాణం యజమాని మాన్సియర్ డిఫార్జ్; రెండవవాడు, రోడ్లు బాగుచేసే నీలిటోపీ కూలీ. ఒళ్ళంతా దుమ్ముతోనూ, ఆర్చుకుపోతున్న దాహంతోనూ ఆ యిద్దరూ పానశాలలో ప్రవేశించారు. వాళ్లిద్దరూ సెయింట్ ఆంటోనీ వీధినబడి వస్తూవుంటే, ఆ వీధిలోవున్న ప్రజల ముఖాల్లో యేవో ఉద్వేగరేఖలు జిగేల్ జిగేల్ మంటూ ప్రభవించుతూన్నయ్. త్రోవపొడుగునా ఎదురైన మనిషల్లా వాళ్లిద్దరి ముఖాలలోకి చూస్తున్నారు. అయినా వాళ్లల్లో యే వొకడూ వాళ్ళ వెంటబడి పానశాలదగ్గిరికి రాలేదు. వాళ్ళని పలకరించలేదు. లోపలికి వచ్చిన తరవాతకూడా అక్కడున్నవాళ్ళు వాళ్ళ వంక చూచారే కాని పన్నెత్తి పలకరించలేదు. వాళ్ళందర్నీ ఒక్కసారి కలయజూచి:

'నమస్తే భాయిహో!' అన్నాడు డిఫార్జ్; అది, ఏదో ఊకదంపు లోకాభిరామాయణం ప్రారంభించమని అక్కడున్న కామ్రేడ్సుకు హెచ్చరిక కావచ్చు.

'వాతావరణం ఏమంత బాగుళ్ళేదు'—అన్నాడు, మళ్ళా, ఆ మాట అనేసరికి అక్కడున్నవాళ్ళంతా ఒకళ్ళ ముఖాల్లోకి ఒకళ్లు చూసుకుని తలలు వంచుకు మౌనంగా కూర్చున్నారు. అందులో ఒక వ్యక్తిమాత్రం చివాల్న లేచి బయటికి వెళ్లిపోయాడు.

డిఫార్జ్, నీలిటోపీ రోడ్డు కూలీని భార్యకు చూపించి 'ఈ మనిషి చూశావా? మంచివాడు; రోడ్లు మరమ్మతు చేస్తూవుంటాడు; నేనూ యితనూ కలిసి చాలా దూరంనుంచి ప్రయాణం చేసి వస్తున్నాం. పారిస్‌నుంచి బయలుదేరి ఒక రోజున్నర ప్రయాణం చేశాను. అక్కడ ఒక గ్రామం చేరువలో, రోడ్డుమీద, హఠాత్తుగా నాకు తగిలాడు. ఈయన పేరు జాక్వెస్; చాలా అలిసిపోయి వున్నాడు. దాహం కూడా వేస్తూందల్లే వుంది పాపం—మంచి ద్రాక్షాసారా ఒక గ్లాసెడు యివ్వు.'

కూర్చున్న జనంలోనుంచి మరోమనిషి లేచి బయటికి వెళ్ళిపోయాడు. మాడమ్ డిఫార్జ్ సారాసీసా రోడ్డుకూలీచేతికి అందించింది. అతను చేతిలోవున్న నీలిటోపీతో అక్కడున్నవాళ్ళందరికీ సలాంకొట్టి, బల్లదగ్గిర కూర్చుని తాగటానికి ఉపక్రమించాడు. వెయిస్టుకోటుజేబులోనుంచి చిన్ని గుడ్డమూట బయటికి తీశాడు. దాన్లో ఎన్నాళ్లనాటిదో పులిసిపోయిన రొట్టెముక్క వుంది. అది కొస్తకానే మధ్యమధ్య చప్పరించుతూ సారా ఒకొక్కగుక్కే నెమ్మదిగా పుచ్చుకుంటున్నాడు. మరో మూడో మనిషి లేచి బయటికి వెళ్ళిపోయాడు.

అనువాదం: తెన్నేటి సూరి

డిఫార్జ్ తను కూడా ఒక బల్లదగ్గిర కూర్చుని కొంచెం పానీయం పుచ్చుకుని సేదదీర్చుకున్నాడు. తన మిత్రుడు ఫలహారం ముగించేవరకూ కనిపెట్టుకు కూర్చున్నాడు. అంతసేపూ అక్కడ గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడన్న మాటేగాని, మిగతా వాళ్లెవళ్ళవంకా కన్నెత్తయినా చూళ్లేదు. వాళ్ళూ అతనివంక చూడ్డంలేదు. మాడమ్ డిఫార్జ్ కూడా అతనివంక చూడ్డంలేదు. కుట్టుసామాను ముందేసుకుని తన పని తను చూసుకుంటోంది.

'అయిందా తమ్ముడూ!' అన్నాడు డిఫార్జ్—రోడ్డుకూలీ నీలిటోపీకి చేతులు తుడుచుకుంటూ వుండటం చూసి.

ఈ కథను, అతను తన గ్రామంలోవున్న మనిషి మనిషికీ, సంవత్సరంపొడుగునా యెన్నో వందలసార్లు చెప్పివున్న కారణంగా బాగా రాటుతేలి సాభినయంగా మాంచి యమకంగా చెబుతున్నాడు.

జాక్విస్ నెం. 1. అడ్డుతగిలాడు: 'ఆ మడిసిని నువ్వు అంతకి పూర్వం ఎన్నడేనా చూశావా?'—

'ఎబ్బే లేందే!'—

జాక్విస్ నెం. 3 అందుకున్నాడు.

'మరి తరవాత యెట్టా గుర్తుబట్టావ్?'—

'అయింది'—

'సరే! వెడదాంరా?—నువ్వు మకాం చెయ్యటానికి గదిచూపిస్తా— హాయిగా వుంటుందిలే'—

ఇద్దరూ లేచి, పానశాల పెరటిదొడ్లోకి నడిచారు; దొడ్లోనుంచి మెట్లెక్కి మేడమీదికి పోయారు. మేడమీద పై అంతస్తు గదిదగ్గిరికి చేరారు—పూర్వం ఆ గదిలోనే కొన్నాళ్లు, చెప్పులు కుట్టుకుంటూ, ముగ్గుబుట్టతల ముసలిమొహం డాక్టరు వుండేవాడు.

ఆయన అక్కడ లేడుగాని, వెనక ఆయన ఆ గదిలో వుండగా, ఆయన్ను కిటికీలోనుంచి తొంగిచూసిన ఆ భాయీలు ముగ్గురూ దాన్లో కూర్చునున్నారు.

ఇద్దరూ గదిలోకి ప్రవేశించగానే డిఫార్జ్ తలుపు దగ్గిరేసి, గొంతు మంద్రస్వరంలోకి తగ్గించి: 'జాక్విస్ నెం. 1, జాక్విస్ నెం. 2, జాక్విస్ నెం. 3!—జాక్విస్ నెం. 4 అయిన నేను కలుసుకోవటానికి వెళ్ళిన సాక్షి యితనే—జాక్విస్ నెం. 5. అయిన ఈ పెద్దమనిషి జరిగిన సంగతంతా సవిస్తరంగా చెబుతాడు వినండి!'—అన్నాడు. నీలిటోపీ రోడ్డుకూలీ, ముందేలితో నుదురుమీద క్రమ్మిన చెమటతుడిచేసుకుని 'ఏడనుంచీ మొదలెట్టేదీ?' అంటూ బుర్ర గోక్కుంటున్నాడు.

'ఎక్కణ్ణుంచి యేవిటి? — మొట్టమొదట్నుంచీ మొదలెట్టు' అన్నాడు డిఫార్జ్.

రోడ్డుకూలీ చెప్పుకొస్తున్నాడు: 'ఆ మడిసిని మొట్టమొదట చూడ్డం అదే—ఈ యాసంగికి ఒక యేడాది దాటివుంటది. జమీందారు బండికింద గొలుసుచ్చుకుని యీమయిన యేలాడబడివుండాడు. కప్పెడు కప్పెచీకటిబడతా వుండది. పని ఆపేసి యింటికి బయలుదేరా లనుకుంటా వుండాను. ఇంతలోనే బండీ, బండికింద మడిసి యేలాడతా వుండటం చూశాను. బండి కొండగుట్టమీదనుంచి కిందకి దిగుతా వుండది— ఊరేపుకు —ఆ మడిసి అట్టనే ఎలాడుతా వుండాడు'—

‘ఓ! అంత బారాటి మడిసిని నా జన్మలో ఎప్పుడూ చూళ్లేదనుకో—అదీ గుర్తు!—ఆ సాయంత్రంవేళ జమీందారు నన్ను బిల్చి “ఆ డెట్టా వుండాడురా” అంటే, నే జెప్పింది అదే గందా, గెడవాసంమాదిరి అంత బారుగా వుండాడని చెబితి నే’

‘నువ్వు గిసా, మరిగుజ్జోడుమాదిరి పొట్టి కురచగా వుండాడని చెప్పాల్సింది’ అన్నాడు జాక్విస్ నెం. 2.

‘నాకేం దెలుసు—ఆ పని యింకా జరగలేదాయిరి—అయినా ఆమడిసి ముందుగా నాకా సంగతి చెప్పిందు గనకనా?—అయినా, అప్పటికేనా నాయంతటికి నేను పోయి చెప్పేనా—జమీందారు నీటి కుళాయికాడ నాయంక జూసి, “ఆ యెదవనిట్టా యీడ్చుకురండ”ని అరిసిందు, లేకుంటే చస్తే జెప్పివుండేవోణ్ణి గాదు—నిజం జెబుతావుండాను’—

‘జౌనౌను నిజమే’ అంటూ గొణిగాడు డిఫార్జి—‘సరే తరవాతేమైందో చెప్పు.’

‘ఆతరవాత ఏమైందీ యెవ్వరికీ తెలవలేదు—యెతకటం మొదలెట్టిర్రు—యెతికిర్రు, యెతికిర్రు తొమ్మిది నెల్లో, పది నెల్లో, పదకొండు నెల్లో—ఎన్నో నెల్లు ఎతికిర్రు!’—

‘ఎన్ని నెల్లయితేనేంలే—బాగానే దాచారు—కాని దురదృష్టం పట్టుబడిపోయాడు-సరే, కానీ!’—అన్నాడు డిఫార్జ్.

‘ఓనాడు మళ్లా యిట్టనే కొండగుట్టమీద పనిచేస్తావుండాను. పొద్దు గూకే యేళ. పారా పలుగూ మూపు నెత్తుకుని యింటికి బయల్దేరబోతావుండా—ఇట్టా తలెత్తి సూద్దునుగందా—ఓ అయిదారుగురు పోలీసోల్లు కొండమీద గనుపిచ్చిర్రు. ఆళ్ళ మద్దెన ఆ బారాటి మడిసి కనుపిచ్చిందు. ఈమయిన చేతులు యెనక్కి యిరిచి కట్టేసుండయ్.

‘అట్టనే దూరంగా నిలొచ్చని సూత్తావుండాను. ఆళ్లు అయిదారుగురూ బడి ఆ మడిసిని లాక్కుడతావుండారు; కనుచీకటి బడతావుండదేమో, అచ్చు, యెములోళ్ళమాదిరిగా వుండారు. పాపం ఆ మడిసికి కాలుకుంటి—నడవలేక నడవలేక నడుత్తావుండాడు. తొందరగా నడిపించటానికి ఆ పోలీసోళ్ళు అరుగురూ బడి తుపాకి సన్నీలతో ఎన్నుమీన యిట్టా యిట్టా కుమ్మిర్రు. కుంటికాలు యీడ్చుకుంటా కొండమీదనుంచి కిందికి పరుగెత్తుతా జర్రున కాలుజారి బోర్ల బొక్కులుగా పడిపోయిందు. ఆళ్లు పకపకా నవ్వుతా యెల్లి మెడబట్టుకు లేవదీసి నిలొచ్చబెట్టిర్రు: మొహమంతా రక్తం వరదలు గారతావుంది. తుడుచుకోడానికి చూస్తే చేతులు యిరిచికట్టేసుండె; అది జూసి మరీ నవ్విర్రు; ఆమయిన ఊళ్లోకి దీసుకుపోయిర్రు; ఆ మడిసిని జూట్టానికి వూళ్లో జనమంతా చుట్టేసిర్రు; ఊళ్ళోనుంచి జైలుగుట్టమీదికి తీసుకెళ్ళి జైలు తలుపులు తెరిసి దాన్లోబెట్టి మూసేసిర్రు.

‘తెల్లారిపొద్దునే, కులుగూ పారా బుజానెట్టుకుని పనిలోకి యెడతా, అట్టా జైలుమీదగా బయలుదేరాను. ఆమడిసి జైలు కటకటాల యెనకాతల కనిపిచ్చిందు. మొహం నెత్తురూ దుమ్మూ మరకలు గట్టుకుపోయింది. చేతులింకా యిరిచి కట్టేసేవుండయ్. పలకరించుదా మనుకున్నాగాని బయమేసి వూరుకుండాను—ఆ మడిసీ నన్ను పలకరించలేదు—చచ్చిపోయినోడులా బిత్తరపోయి నాయంక జూసిందు.’—

డిఫార్జ్, అక్కడున్న ముగ్గురూ ఒకరి ముఖంవంక వకరు చూసుకున్నారు. వాళ్ళ ముగ్గురి ముఖాలూ ఉద్రేకంతో కందగడ్డల్లా యెర్రబడిపోయినై పగసాధించాలనే క్రౌర్యం వాళ్ల నుదుళ్లలో మెలికలు తిరుగుతోంది.

డిఫార్జ్ చివాల్న ఆవేశంగా లేచి నిల్చుని: ‘సరే! తరవాత సంగతి చెప్పు!’ అన్నాడు.

‘ఆమయిన ఆ జైల్లో కొన్నాళ్ళపాటు వుండాడు. ఊళ్ళోవాళ్ళు, చాటునామాటునా యెల్లి సూత్తానేవుండేవోళ్లుగాని పబ్లికుగా మాత్రం యెళ్ళేవోళ్ళుగాదు. బయంగందా!—జైలుకేసి సూత్తానేవుండేవోళ్లు, కుళ్ళాయిదగ్గిర గుసగుసలాడుకుంటానే వుండేవోళ్లు. ఆ మడిసికి ఉరిశిక్ష యెయ్యాల్సివున్నా, ఉరిదియ్యరని చెప్పుకునేవోళ్లు. ఆడిబిడ్డ సచ్చిపిచ్చెత్తిపోయి అట్టాజేసిందుగనక రచ్చించాల్సిందని యీడ పారిస్‌లో అధికార్లకూ రాజుకూ మాజర్లుబెట్టిర్రని చెప్పుకుంటా వుండేవోళ్ళు—పెట్టిర్రో లేదోగాని—అయ్యన్నీ నా కెట్టా దెలుత్తయ్!’

నెం. I జాక్విస్ అందుకున్నాడు: ‘అయితే ఇను—రాజుకీ రాణీకి ఓ మాజరు పెట్టిన మాట నిజమే, ఆ మాజరు రాజా సొంతంగా అందుకోడం, ఇక్కడున్నోళ్ళలో నువ్వొక్కడివి దప్ప, తక్కినోళ్ళంతా అక్కడుండి కళ్ళతో జూసినోళ్లే—పేణాలమీద ఆశ కూడా వొదులుకుని రాజుగారి బండీకి యెదురెళ్లి మాజరు అందించింది యెవుళ్ళోగాదు—ఈ డిఫార్జ్ అన్నే—రాజుగారి సిపాయిలూ గుర్రపాళ్లూ, యెంట వుండోళ్లూ యీయన్ని చుట్టేసి సావా సితకా బాదిర్రు—తెలిసిందా,—

‘తెలిసింది’—అన్నాడు నీలిటోపీ.

‘అయితే ఇక నీ కథ గానీ’—

‘ఆతరవాత నీటికుళాయి దగ్గిర, మళ్ళా యేం జెప్పుకోడం మొదలెట్టిర్రంటే — ఉరిదీయటం ఖాయమేననీ — గ్రామస్థులకందరికీ జమీందారు తండ్రంటివోడు గనక—తండ్రిని జంపిన నేరస్తుణ్ణి బిడ్డలయెదట చావనూకటానికి గావానికి తీసుకొచ్చిర్రు అని చెప్పుకుంటావుండారు. ఒక ముసలాయన జెప్పిందేమిటంటే బాకుబట్టిన కుడిచేతిని బతికుండగానే కాల్చి తగలెడతారన్నాడు. ముంచేతుల్లోనూ గుండెల్లోనూ తొడల్లోనూ పిక్కలమీనా బర్మలతో బొక్కలుగోసి, ఆ కన్నాల్లో మసులుతావున్న నూనె, కరిగిన సీసం, మరగిన గుగ్గిలం గంధకం, యియ్యన్నీ పోస్తారనీ సివరికి నాలుగు గుర్రాలకు నాలుగేపులా కాళ్ళూ చేతులూ గట్టి, యేకీలు కా కీలు ఊడబీకించుతారని చెప్పిందు. ఆ ముసలాయిన యింకా జెప్పిందేవిటంటే, ఈడ పారిస్‌లో రాజుగారిని చంపటానికి యెవుడో కుట్ర బన్నాడనీ ఆ మడిసిని ఈ రకంగానే చిత్రవధ జేసిర్రనీ చెప్పిందు. ఆ ముసలాయన మరి నిజవే జెప్పిండో, అబద్ధమే జెప్పిండో మరి, నా కెట్టా తెలుత్తది—నేను సదువుకున్నోణ్ణిగాదు గందా?’—

‘సరే అయితే ఆ సంగతి నే జెబుతా ఇను’ అంటూ ఎత్తుకున్నాడు, జాక్విస్ నెం 2. ‘ఆ చిత్రవధ జరిగినమడిసిపేరు డేమియన్సు, అదంతా పట్టపగలు నడివీధిలో జరిగింది. ఈ పారిస్ పట్నం నడివీధిలో జరిగింది; లక్షుల జనం కళ్ళముందు జరిగింది; గొప్పింటి ఆడోళ్లు యెంతోమంది చుట్టూతా మూగి సొంతం కడంటా సూత్తానేవుండారు. ఎంతో సర్దాగా కూడా చూశారు—చివరంటా. మద్దెనపేళనుంచీ చిత్రవధ మొదలైతే చీకటిబడేతలికి ఆడికి ఒక కాలూ ఒక చెయ్యీ ఊడిపోయినై—అదంతా అట్టా జరిగిందిలే—ఇదంతా నీకు తెలీకపోడమేంది?—నీ కెన్నేళ్లు?’

‘ముప్ఫయ్ అయిదు’

‘నువ్వు పదేళ్ళ కుర్రాడివై వుండగా యిది జరిగింది—నువ్వు చూసుండాల్సిందే నే’

‘సరే! చేస్తారులే వెధవలు!—తరవాత కథ కానీ’ అంటూ డిఫార్జ్ తొందరపెట్టాడు

'ఇట్టా వుండగా ఒక ఆదివారంనాటి రాత్రి, ఊళ్ళో వున్న జనమంతా నిద్రబోతావుండగా పోలీసులు ఊళ్ళోకొచ్చిన్రు; నీటి కుళాయిదగ్గిర, కూలోళ్ళని బెట్టి తెల్లవార్లూ ఏదో తవ్వించిన్రు. తెల్లారిలేచి చూసేతలికి ఆడ నలభై అడుగుల యెత్తున ఉరికంబం పాతివుండది. ఆ మద్దానపేళ యీ పోలీసులంతా రాండోళ్ళు వాయించుకుంటా జైల్లోకి యెళ్ళి ఆ మడిసిని దీసుకొచ్చి ఉరిదీసిన్రు. మడిసిశవం ఆమయిన యెలాడతా వుంటే ఊళ్ళో జనమంతా పిల్లా జల్లా అడిలి సచ్చిన్రనకోండి అదీ జరిగిన సంగతి; అక్కడనుంచి ఆ రాత్రే బయలుదేరిన్నా, ఈయన నాకు దోవలో ఎదురొత్తాడని చెప్పిన్రు—ఇద్దరం కలుసుకుని యీడకి వచ్చినాం—ఇదీ సంగతి'—

కథ యావత్తూ ఆసాంతం విని జాక్వెస్ నెం 1. నీలి టోపీ వంక జూసి: 'భేష్ మంచోడివి—దాపరికం లేకుండా సంగతంతా జెప్పేశావ్. సరేగాని రవ్వంతసేపు బయటికెళ్ళి ఆడకూచో, మళ్ళీ పిలుత్తాం.'

డిఫార్జ్ అతన్ని వెంటబెట్టుకుని గదిలోనుంచి బయటికి దీసుకొచ్చి మెట్లదగ్గిర కూర్చోబెట్టి, మళ్లా గదిలోకి తిరిగొచ్చాడు.

ముగ్గురూ ఒకళ్ళముఖంలోకి ఒకళ్లు ఉరిమి చూసుకున్నారు:

'ఆఁ! మరేంది జరగాలిసింది!'—

'ఇంకా యేందేంది—జాపితాలో యెక్కించాలిసిందే—ఆ జమీందారు కుటుంబంలో పురుగన్నా మిగలరాదు–దివాణం గివాణం నేలమట్టమైపోవాల'—

అంతా నిర్ణయమైపోయింది.

'అయితే యీ మడిసి నేమిఁ జెయ్యాల! ఇక్కడుంచడమాఁ? —యింటికి పంపించెయ్యడమాఁ?'

'ఆడు మరీ మట్టిబుర్రలాగున్నాడు ఈడుంటే యేమిఁ మునుగుతదో! పంపించెయ్యడమే మెరుగు'—

'ఆ మనిషిసంగతి నేను చూస్తాలెండి' అన్నాడు డిఫార్జి–'వాడు రాజునీ రాణినీ, దివాణం చూడాలని ఉబలాటపడుతున్నాడు. వచ్చే ఆదివారం చూపించిపంపుదాం'—

'ఏమిఁటీ ఆ బంగారుపిచ్చికల్ని చూడాలనా—?'

'మంచిదేలే—పిల్లికి దాహం పుట్టించాలంటే పాలు చూపించటం మంచిది'—

అంతకుమించి సంభాషణేమీ జరగలేదు; వాళ్ళు ముగ్గురూ గదిలోనుంచి బయటికి వచ్చేసరికే రోడ్డుకూలీ మెట్లదగ్గిర కునికిపాట్లు పడుతున్నాడు. పోయి, గదిలోవున్న గడ్డిపరుపులమీద పడుకుని విశ్రాంతి తీసుకోమన్నారు.

ఆదివారంనాడు, రాజునూ, రాణీనీ చూపించటానికి డిఫార్జ్ నీలిటోపీకూలీని వెంటబెట్టుకుని వర్సెలిస్‌కు బయలుదేరాడు; మాడెమ్ డిఫార్జ్ కూడా వాళ్ళతో బయలుదేరింది, కుట్టుసామానుతో సహా; పోయినపొడుగునా బండిలోకూడా కుడుతూనే వుంది. బండిలోనే కాదు, రాజదంపతులను చూట్టానికి మూగిన జనసమూహంమధ్యను నిల్చుని కూడా కుడుతూనే వుంది.

మహోత్సవం: గవిఁడిగవదల రాజూ, గాజుకళ్ళ రాణీ బంగారు బండిలో యెక్కి బయటికొచ్చారు. వాళ్ళవెంట గొప్ప గొప్ప ప్రభువులూ వాళ్ల ఆడవాళ్ళూ నవరత్నరాగ సంపదలతో తులదూగుతూ, అనుసరించివస్తున్నారు.—ఆనందకోలాహలంగా యెకయెకలూ పకపకలూ ఆడుతూ. ఆ దృశ్యాన్ని చూసి రోడ్డుకూలీకి విభ్రాంతి కలిగిపోయింది; వొళ్ళు తెలియని ఆవేశంతో: 'మహారాజుకూ జై! రాణీకీ జై! అందరికీ జై!' అంటూ పిచ్చికేకలు బెట్టేశాడు. ఆ అభినందనపారవశ్యంలో రాజుమీదికో రాణీమీదికో ఎగిరి గొంతు నులిమేస్తే నులిమేయవచ్చునని భయపడి, డిఫార్జ్ అతన్ని చొక్కాకాలరు పట్టుకుని వెనక్కు లాగి పట్టి అదుపుచేశాడు. ఉత్సవం ముగిసిపోయిన తరవాత డిఫార్జ్ అతన్ని భుజంమీద తట్టి: 'భేష్ మంచి కుర్రాడివి' అన్నాడు.

అప్పటికి కొంచెం స్పృహలోకొచ్చి నీలిటోపీకి అనుమానమేసింది, తాను అలా అభినందించి ఎగరటం పొరపాటేమోనని. కాని డిఫార్జ్ ఆ సందేహాన్ని నివృత్తిచేశాడు.

'నీవంటివాళ్ళు కొంతమంది, అలా కేకలేసేవాళ్ళూ వుండాలి—ఆ కేకలు చెవులబడుతూంటే వాళ్లు మైకంలో వుంటారు. ఈ కథ యిలాగే సాగిపోతూందనే వెర్రిలో వుంటారు. దాంతో మరింత అదరగణ్ణం బలుస్తుంది—అదే వాళ్ల అంతం.'

'హాఁ!—నిజమేఁ'—అన్నాడు నీలిటోపీ, డిఫార్జ్ ధోరణికి ఆశ్చర్యపడుతూ.

'ఇదిగో ఇటు చూడు' అన్నది మాడమ్ డిఫార్జ్: 'ధగధగలాడుతూవుండి, మోతచేసే యే వస్తువును చూసినా నీకు కళ్ళవెంట నీళ్లొస్తాయి—అవునా కాదా?'

'నిజమేనమ్మా—నిజమేఁ' అన్నాడు నీలిటోపీ.

'నీముందు ఒక పెద్ద బొమ్మలగుట్ట పడేశారనుకో, దాల్లో యేదేనా నీ యిష్టంవచ్చినబొమ్మను తీసి విరగ్గొట్టేసి దానికున్న అలంకారాలన్నీ నిన్ను తీసుకోమన్నారనుకో, యే బొమ్మను దీస్తావ్? మంచి షోగ్గా అలంకరించివున్న బొమ్మను తీస్తావా లేదా?'

'అవును—అట్టానే'—

'ఎగిరిపోలేని పక్షులమంద నీయెదట వున్నదనుకో, వాటిలో యే పక్షినో ఒకదాన్ని పట్టుకుని దాని యీకలు పీకేసి, అవి నువ్వు తీసుకోవచ్చునంటారనుకో, అప్పుడు ఎలాంటి పక్షిని యేరతావు? మంచి అందమైన యీకలున్న పక్షిని పట్టుకుంటావు—అంతేనా?'—

'నిజం'—

'ఇవ్వాళ నువ్వు, రంగురంగుల బొమ్మల్నీ పక్షుల్నీ ఎన్నిటినో చూశావు—ఇక నువ్వు ఇంటికి వెళ్ళిపో.' ★

ఉపావతారాలు

'అమ్మా, అమ్మా! వాళ్ళొస్తున్నారే!' అని యింట్లోకి పరిగెట్టింది చిన్నమ్మలు. ఈ కేక విని సుబ్బమ్మగారు వీధిలోకివచ్చి తొంగిచూసి 'వెనకటికి నీ తరహాకి చెందినవ్యక్తే 'నల్లచీర కట్టుకున్న వాళ్ళంతా నా పెళ్ళాలే' అన్నాడుట. వీధి వెంట తిరిగిన బండీఅల్లా మనంటికివచ్చినట్టేనటే?' అంది. 'అదేం మాటే? 'బాలవాక్యం బ్రహ్మవాక్యం' అన్నారు. మనింటికే రాకూడదా ఏమిటి?' అని సమర్థించారు సోమన్నగారు. అనుకున్నట్టే ఆ జట్కాబండీ వాళ్ళగుమ్మంలోనే ఆగింది. సుబ్బమ్మగారు లోపలికి వెళ్ళిపోయింది. ఆ బండీలోంచి గళ్ళగళ్ళ పరుపుగుడ్డలాంటి బుష్‌కోటు తొడుక్కున్న యువకుడు దిగేడు. దిగుతూనే 'తెలుగు మేష్టరు సోమన్నగారిల్లిదేనాండి?' అని అడిగాడు. 'అవును బాబూ, ఆ సోమన్నను నేనే' అన్నారు సోమన్నగారు. 'నా పేరు అవతారం అంటారు లెండి. కాకినాడలో యింజనీరింగు చదువుతున్నాను. నిజానికి యిలాంటి వ్యవహారాలంటే విపరీతమయిన సిగ్గండి నాకు. అయినా మా ఫాదర్ మాటతో సెయ్యటానికి నాకు మనస్కరించలేదు. మా నాన్న యిదంతా మీకు రాశారుట కదూ?' అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి. సోమన్నగారు లోపల్నుంచి ఓ కార్డు తీసుకొచ్చి 'ఇదేనా బాబూ?' అన్నారు. 'అవునండి అదే. మీ యింట్లో పెళ్ళికి ఎదిగిన పిల్ల ఉందని......' మిగతా మాటలు మాట్లాడలేక సిగ్గుపడిపోయాడు అవతారం. 'అదేటి బాబూ, యింతసేపు నిలబెట్టేసినారు? బండీకి డబ్బులు?' వీధిలోంచి బండీవాడు కేకపెట్టేడు. 'నాదగ్గర పెనరుపీస్ నోటు ఉందోయ్. చిల్లరుందా?' బండీవాడు అడ్డంగా తల ఆడించాడు. 'నే నిస్తానోయ్' అంటూ సోమన్నగారు. 'తమకెందుకండీ శ్రమ? వాడే మార్చుకొస్తాడు' అని అవతారం అంటున్నా వినిపించుకోక బండీవాడికి డబ్బులిచ్చి పంపేశాడు.

సుబ్బమ్మగారు పక్కింటికి గబగబా వెళ్ళేసరికి పెద్దమ్మలు పొరుగింటి రచన మ్మతో చింతపిక్కలాడుతోంది. 'తెల్లారిలేచి యీఆటఏమిటే పెద్దమ్మలూ, మరేం పని లేనట్టు? పద పద పెళ్ళివారొచ్చారు' అని రెక్కపట్టుకుని లేవదీసుకుపోయింది. పక్కింటి జానకిరాముడు 'ఎవరి మాట పిన్నిగారూ?' అని అడిగింది. 'మొన్న దీపాలెట్టేవేళ బందరునుంచి ఉత్తరం వచ్చిందని చెప్పేను కాదుటమ్మా? వాళ్ళ తాలూకేట. అబ్బాయి ఒక్కడే వచ్చాడు. ఏదో నీ దయవల్ల యీ మూడుముళ్ళూ పడిపోతే మరి అడక్కు. వస్తానమ్మా. పదవే!' పెద్దమ్మల్ని తీసుకుని సుబ్బమ్మగారు యింటికొచ్చింది.

'ఏదో చదువుకోసం, ఫ్రండ్సుతో తిరగడం తప్ప మీలాంటి పెద్దమనుషులతో మాట్లాడి ఎరగనండీ! అసలు యిలాంటి పని మీద రాడానికి నాకు ఎంత మొహమాటంగానైనా ఉంది' అవతారం యిలా అంటూండగా చిన్నమ్మలు అక్కడ కాఫీ యిడ్లెన్లూ తెచ్చిపెట్టింది.

'మీరు యిస్తున్నారని మాట తీసెయ్యలేక తింటున్నాను కాని నాకేం ఆకలి లేదండీ! నాగురించి నేనే అంతా చెప్పుకోవలసి వచ్చినందుకు ఎంతయినా మొహమాటంగా ఉందనుకోండి మా నాన్నగారికి తాసీల్దారు పనామరి, క్షణం తీరిక ఉండదు. మా అమ్మను తీసుకువద్దామనుకున్నాను గాని సమయానికి యింట్లోకి రాడానికి వీల్లేకపోయిందండీ. అయినా 'నీ కిష్టమయితే నా కిష్టమే బాబూ' అంది. మావాళ్ళయినా మనుషులు పూర్వకాలపు వాళ్లు గాని భావాలన్నీ యీనాటివేనండీ!'

'అలాగా!'

'చాలా పెళ్ళిళ్లు పెద్దల యిష్టప్రకారం జరిగినవే గాని కుర్రాళ్ల యిష్టాయిష్టాలు కనుక్కొని జరిగినవి అరుదు. ఎంతమంది పిల్లల మంచిమంచి ఉద్దేశాలో పెద్దల్ని ఎదిరించలేక శాశ్వతంగా నిద్రపోతున్నాయి. కాని మా యింట్లో అలా కాదు సుమండీ పెద్దలికి తోచిన ఉద్దేశాలు ఏవయినా సరే మంచివే అని వాళ్లకు నమ్మకం లేదు. ఉద్దేశానికి మంచీ చెడూ ఆపాదిస్తాతగాని ఆ భావం పెద్దలు కల్పించింటా, లేక పిల్లలకు తోచిందా అని చూసుకుని దానికి విలువ కట్టరు. దేనికయినా పెద్దల సపోర్టు కావాలి. ఏమంటారు?'

'అయ్యో, కాదు మరి!'

'తల్లిదండ్రులు ఏర్పరిచిన ఓ చక్కని చుక్కను కట్నంతోసహా పెళ్లాడేసి సంభాషణాలలో సాహిత్యమంతా ఒలకబోస్తే సంస్కరణ ఏముందండీ? అందచందాలు, డబ్బు ఉన్న అమ్మాయికి ఎలాగేనా పెళ్ళవుతుంది. దేవుడిచ్చిన దిక్కుమాలిన రూపానికి విచారిస్తూ, బీదకుటుంబంలో పుట్టిన దురదృష్టానికి చింతిస్తూ నిత్యం కుమిలిపోయే నిర్భాగ్యులను దరిచేర్చడమే సంస్కారమంటాను. అలా చేస్తేనే మనసుకి శాశ్వత తృప్తి ఉంటుంది.'

సోమన్నగారి హృదయం కరిగిపోయింది. 'ఇలాంటి పదిమంది యువకులుంటే నాలాంటి ఆడపిల్లల్ని కన్న దౌర్భాగ్యులు కన్నీరుకార్చే అవసరం రాదుకదా!' అనుకున్నారు.

'చిన్నవాడివయినా నీకింత జ్ఞానం ఎలా కలిగిందోయ్?' అని పైకి అనకుండా ఆ ముసలిప్రాణం ఉండలేకపోయింది.

'ఇందులో నే పెద్ద చేసిందేముందండి? పరిస్థితుల్ని సత్యదృష్టితో పరికించి తదనుగుణంగా నడవడం కూడా ఓ ఘనతేనా? సరే కాని...'

'ఏమిటి బాబూ?'

'ఇలా మాట్లాడుతూనే ఉన్నాను గాని నాకెంత...'

'ఏమిటోయ్?'

'ఎందుకులెండి మీకు మరింత శ్రమ గాని...'

'శ్రమ కేముందోయ్. నీలాంటి వాడికి ఏం చేసినా తప్పులేదు. చెప్పు'

'మరేం లేదు, మీ అమ్మాయిని చూడ్డానికి ఏమయినా ఆలశ్యముందా?'

'ఆడపిల్ల కాదు బాబూ? అందులో మీ అత్తగారికి చాదస్తమెక్కువ. అయినా మరోటీ మరోటీ గనుకనా? అందుకని కాస్త ఆలశ్యమే అవుతుంది.'

'మరేం లేదండీ, తలనొప్పి దంచేస్తోంది.'

'అయ్యో అలాగా, చెప్పేవు కాదేమోయ్? అమృతాం

శ్రీ అవసరాల రామకృష్ణారావు

జనం యిమ్మన్నావా? యాస్ప్రో వేసుకుంటావా?'

'ఎందుకొచ్చిందో దానివల్ల పోవాలి గాని యీ మందులవల్ల ఏం లాభంలెండి.'

'ఎందుకొచ్చిందీ?'

'అదేమిటో మీ మొహంచూసిన దగ్గిర్నుంచీ మీరంటే ఏదో పూర్వజన్మ సంబంధం ఉన్నట్టు ఎంతో అభిమానం వేస్తోంది. మా నాన్నగారి దగ్గిరయినా యింత చనువుగా మాట్లాడి ఎరగను. పెద్ద పెద్ద బాధలొచ్చినా దిగమింగుకోడమే గాని 'ఈగ వాలనా, 'యీ' పెట్టనా?' అనే స్వభావం కాదు నాది. అయినా మిమ్మల్ని చూస్తే ఎంత స్వల్పమైన బాధ కలిగినా చెప్పకోకుండా ఉండబట్టింది కాదండీ!'

'సరే గాని నీ తలనొప్పి ఏం వేస్తే పోతుందో చెప్పేవు కావు.'

'ఎందుకండీ, వచ్చినపని చూసుకుని పోక మిమ్మల్ని యిబ్బంది పెట్టడం?

'అలా కాదు. చెప్తేకాని వదలను. నీ యిల్లు ఒకటి మా యిల్లు ఒకటీనా? నీ బాధ ఒకటీ నా బాధ ఒకటీనా? చెప్పు.'

'మీరంత ఆప్యాయంగా అడుగుతూంటే ఊరుకోడం తప్పే అనిపిస్తోంది. మరేం లేదండీ. నాకు శనివారం శనివారం తలంటుకోడం అలవాటు. 'ఎంచేత చెప్మా యింత తలినొప్పి వచ్చిందీ' అని ఆలోచిస్తే అప్పుడు తెలిసింది 'ఓహో, యిదా' అని. ఈ అభ్యంతరం తీర్చుకుంటేగాని యిది వదలదు. ఇంటికెళ్ళి తీర్చుకుంటాను లెండి. ఈమాట చెప్పడానికి నా ఒళ్లెంత చచ్చిపోయిందో మీకు చెబితే అర్థంకాదు. మీరు అడిగారని మొహమాట పడి ఉన్న మాట కక్కేశానుగాని, మీరు ఊఁ శ్రమ పడి ప్రయత్నాలు చేయించకండి.'

'ఓయి వెర్రివాడా, యింత అమాయకమేమిటోయ్ నీకు? ఎలా బతుకుతావోయ్? తలంటు నిరభ్యంతరంగా తీర్చుకోవచ్చు. ఉండు, వస్తాను.'

సోమన్నగారు యింట్లోకి వెళ్లి అన్ని సంగతులూ సుబ్బమ్మగారితో చెప్పేరు.

'ఇవాళ లేచినవేళ మంచిదండి! ఇంతకీ మన పెద్దమ్మలు అదృష్టం. మీరు మళ్ళీ మంగలి అప్పన్నను కేకేశారు గనుక. నా అల్లుడికి నేను తప్ప మరోరు తల కడగడానికి వల్లకాదు. పండుగనాడు అల్లుడొచ్చి తల రుద్దమన్నంత సరదాగా ఉంది నాకు. పాపం హఠాత్తుగా వచ్చాడు కాబోలు. గుడ్డలు తెచ్చుకున్నట్టు లేదు. ఇలాంటి సమయంలో మనం వెనుదీసి లాభం లేదు. చూడండి, బీరవాలో మీ సన్న జరీ పంచ ఉంది, అదిచ్చి కట్టుకోమని యిలా పంపండి. చిన్నమ్మలు పులుసు పోస్తుంది. పాపం ఎంత తలనొప్పిగా ఉందో ఏమిటో!' అని మొగుడ్ని పంపించి, జడవేస్తున్న కూతురుతో అంది సుబ్బమ్మగారు.

'జడేస్తూంటే అదేమిటే ఊఁ అలా కదిలిపోతావ్? తాసిల్దారుగారి కోడలూ, యింజనీరుగారి భార్యా అని గర్వం కాబోలు. ఇకముందు మాతో మాట్లాడతావా, ఏమే పెద్దమ్మలూ?, అని కూతురు నొసట మెటికలు విరిచి 'చూడు పెద్దమ్మలూ, నేను అల్లుడికి తలంటాలి. మంచి చీరా జాకట్టూ తీసికట్టుకో. మొహం మరోమారు కడుక్కో' అని పెరట్లోకి బయలుదేరింది.



"తెలుగుమేష్టరు సోమన్నగారిల్లిదేనాండి?"

'ఏమోయ్, అమ్మాయిని తీసుకురమ్మన్నావా?'

అవతారం మాట్లాడలేదు.

'అలా నిలదీస్తే ఏం జవాబు చెప్తాడండీ? అసలే తలనొప్పి. దాంతో తలకు నీళ్ళోసుకున్నాడు. నీర్సంగా ఉందో ఏమిటో. భోంచేశాక మాసుకుంటాడు లెండి. ఏం బాబూ?'

'పెద్దలు మీ మాట, తీసెయ్యలేక గాని యింత తొందరగా నే ఎప్పుడూ పరాయి యింట్లో విస్తరేసి ఎరగను?'

'ఎంత మాటన్నావు బాబూ. ఇది నీకు పరాయి యిల్లా?'

'కాదనుకోండి. మహాలక్ష్మిలాంటి మీ ముఖలక్షణాలు చూస్తే అనకూడదు గాని నాకు దణ్ణం పెట్టబుద్ధేస్తోందండీ సుబ్బమ్మత్తగారూ!'

సుబ్బమ్మగారి మనసు ఆనందంతో కాగులో వేణ్ణీళ్ళలా పరుగులెట్టింది.

* * *

'ఒహో! ఏం గౌరవం, ఏం వినయం! పిల్లాడు మహాబుద్ధిమంతుడిలా ఉన్నాడు. ఏమంటారు?' అంది భోజనాల అనంతరం సుబ్బమ్మగారు భర్తతో.

'ఆ మాట వేరే చెప్పాలిటే? అంత పెద్ద చదువు చదువుతూ అలాంటి గొప్ప కుటుంబానికి చెందినవాడైతే మరోడు కిందా మీదా ఉండునా? అలాంటిది ఎక్కడయినా నోటిమాట ఉందా? నిండుకుండ తొణకదన్నారు. ఇంతకీ మనమ్మాయి చేసుకున్న అదృష్టం. అతను చూసి అవునన్నట్టయితే మనకన్న అదృష్టవంతులు లేరనుకో.'

'అలాగే. చిన్నమ్మల్ని కోటయ్యకొట్టుకి పంపేను, తమలపాకులు తెస్తుంది. వేసుకుంటూండండి. ఈలోగా నేనూ పెద్దమ్మలూ భోంచేసి తీసుకువస్తాను' సోమన్నగారు వీధిలోకి వెళ్ళిపోయాడు. ఇంతలో జానకిరాముడు సెయ్యి అప్పుకొచ్చింది.

'ఏమిటి పిన్నిగారూ యీవాళ పిండివంటలూ?'

'ఏదో 'చంద్రుడికో నూలుపోగు' అని మాకు తోచింది పెట్టేం గాని వాళ్ళెక్కడ, మేమెక్కడ? అప్పటికప్పుడు ఏం చెయ్యను? అయినా బాగుండదని యింట్లో సగ్గుబియ్యం ఉంటేనూ, యింత పరవాన్నం చేసి పెట్టేను.'

'అబ్బాయి తలంటుకున్నట్టున్నాడు?'

'ఏం తలంటులే. పాపం ఆ యబ్బాయి ఎంత బాధయినా పైకి చెప్పనే చెప్పడు. తలనొప్పి అంటేనూ ఓసారి కాస్త ములాగ్గా తలకడిగేనేమో, అంతే.'

'అయినా అటు వంటా, యిటు తలంటూ, అమ్మాయిముస్తాబూ మీ ఓపిక్కి సంతోషించాలి. ఇంతకీ పిల్లాడు పిల్లని చూచుకున్నాడా?'

'లేదమ్మా! ఇదుగో మా భోజనాలు అయ్యాక తీరిగ్గా పిల్లని చూపిస్తాము. ఏదో యిది కుదిరిపోతే యిద్దరి చేతా సత్యన్నారాయణ వ్రతం చేయిస్తాను.'

'ఎందుకు కుదరదు లెండి! ఇంతకీ అల్లుడు ఏం చదువుకున్నాడో?'

'ఇంజనీరుంగుటమ్మా'

'అంటే?'

'ఏమో. ఫలానా అని నాకు తెలీదూ, అంటే వినడమే గాని. బందరులో కాబోలు చదువుతున్నాడట.'

'బందరులో ఇంజనీరింగు లేదని చెప్పుకుంటారు?'

'ఏమోనమ్మా, మన కెందుకూ అక్కర్లేని మగాళ్ళ భోగట్టాలూ? చెయ్యి ఊరికే లేదు. మళ్ళీ వాళ్ళు కనిపెట్టుకు ఉంటారు. వస్తానమ్మా జానకిరాముడూ!'

* * *

'ఎలా వుంది నాయనా అమ్మాయి?'

సమాధానంకోసం మూడుజీవాలు ఆత్రుతతో నిరీక్షిస్తున్నాయి. ఆ ప్రశ్నకే వ్యతిరేక సమాధానాలతో తల్లడిల్లిపోయిన ఆ తండ్రిప్రాణం విద్యార్థి పరీక్షాఫలితాలకు ఎదురుచూసినట్లు నిరీక్షించసాగేడు. అవతారం తలెత్తి మరోసారి చూశాడు. దగ్గరగా వచ్చి చూస్తేనేగాని కనపడని కళ్ళూ, పైకొచ్చిన పళ్ళూ, విపరీతమయిన ఒళ్ళూ ఇదీ ఆ అమ్మాయి ఆకారం. చీర బీరాకు పచ్చరంగూ, జాకెట్టు ముఖమల్ ముదర నీలంరంగూ, ముఖం ముద్దుకృష్ణుడి రంగూ యివీ ఆ అమ్మాయిలో రంగురంగులు.

'మీరు బలవంతపెట్టేరు, చిన్నప్పట్నుంచీ పెద్దలమాట తోసెయ్యలేని స్వభావంచేత చూశానుగాని పిల్ల అందచందాలు నాకు అక్కర్లేదని చెప్పేనుకదూ?'

సోమన్నగారు ధైర్యంగా గుండె రాసుకున్నారు.

'గుడ్లగూబలా పెద్దపెద్ద కళ్ళుంటే సరిటండీ? అయినా పెద్ద కళ్ళుంటే నలుగురివైపూ తేరిపార చూడ బుద్ధేస్తుంది. ఉన్నాయా లేవా అన్నట్లు ఎలక పళ్ళలా ఉంటే కోపమొచ్చినప్పుడు మొగుడ్ని కొరకడానికయినా పనికొస్తాయా, పట్టేసి పైకి కనిపించాలిగాని! ఇక రంగన్నారా? కళాకాంతీ లేకుండా తెల్లగా అప్పడంలా ఉంటే సరా, కళాకాంతీ ఉండొద్దూ?'

సిగ్గుతో పెద్దమ్మలు బుగ్గలు ఎరుపెక్క—

లేదు గాని తల మాత్రం వాలిపోయింది సుబ్బమ్మగారి ఒళ్లు కూడా పులకరించక పోలేదు.

'ఇలానే ఎదురుగుండా మీ అమ్మాయిని వర్ణిస్తూంటే ఏమనుకుంటున్నారో ఏమిటో! చక్కనివస్తువు కనపడగానే సౌందర్యోపాసి నవడంవల్ల నా హృదయం నాకు తెలీకుండానే నా నోటిచేత కావ్యాలు అల్లించేస్తుంది! అయినా ఎదురుగుండా ఏమీ చెల్పకపోవడం, వెనకనుంచి రాస్తామని కన్న తండ్రుల్ని ఆశపెట్టడం, యిలాంటివి బొత్తిగా నాకు కిట్టవు.'

'అయితే అమ్మాయి నచ్చినట్టేనా బాబూ?' సుబ్బమ్మగారు అడిగింది.

'ఆమాట వేరే చెప్పాలిటే? ఇంతకీ వాళ్ళవాళ్ళు ఒప్పుకోవాలి'

పెద్దమ్మలు ఒక్కసారి లేచి చివాలున పక్కనున్న చీకటిగదిలో కలిసిపోయింది.

'వెర్రితల్లికి అప్పుడే ఎంత సిగ్గో!' అంది సుబ్బమ్మగారు.

'ఆడపిల్లలు కదండీ ఆర్జించుకున్నదే సిగ్గు! అమ్మాయి పేరేమిటే అన్నారూ?'

'వెంకటకాముడని, ఆ రోజుల్లో పెట్టిన పేరులే. దరిమిలా మార్చుకోవచ్చు'

'ఛ! ఎంతమాటన్నారు? పెద్దలు పెట్టిన పేరుని మార్చడమా? ఎంత సాహసం! నా పూర్తి పేరు 'పంగనామాల చిన వరహావతారం' మార్చుకున్నానా? సరేగాని చూడండి. నే యిలా హఠాత్తుగా రావడం, సాంప్రదాయవిరుద్ధంగా అప్పటికప్పుడు ఒప్పేసుకోడం యివన్నీ చూసి మరోలా అనుకోకండి. ఇంటికెళ్లి అన్ని సంగతులూ రాయిస్తాను. మీరు వచ్చి మాట్లాడుకుందురు గాని, మరి శలవా?'

'అదేమిటీ అప్పుడే వెళ్ళిపోవడం, రెండురోజులు ఉండకూడదా?' చిన్నమ్మలు అడిగింది.

'చూడండి, యింత చిన్నపిల్ల ఉందో లేదోగాని ఎంత మర్యాదో? అదంతా కుటుంబ ధర్మాల్ని బట్టి ఉంటుంది. మళ్ళీ కాలేజీపాఠాలు పోతాయమ్మా. ఈసారి వచ్చి చాలా రోజులు ఉంటాగా! వస్తానండీ సుబ్బమ్మత్తగారూ!'

సుబ్బమ్మగారు భర్తను యివతలికి పిల్చి అడిగింది.

'ఇంకా ఆ పంచె విప్పి యియ్యడేం?

'ఛీ, పాడు ఆలోచనలూ నువ్వూను! తాసీల్దారుగారి కొడుకు మన యింట్లో పంచెకోసం ఆ పూర్నించి ఈపూరు వచ్చాడేం? ఆ అబ్బాయి హుందాతనం ఎలా ఉంది. నీ నిందాత్మకభావన లెలా ఉన్నాయి?' అని కసురుకున్నారు సోమన్నగారు.

'బాగానే ఉందిగాని, స్టేషనుకు వెళ్ళి అల్లుడ్ని దిగబెట్టిరారూ?'

'నిజమే సుమీ, యీమాట నాకు జ్ఞాపకమే లేదు. వెడతాను తలుపేసుకో.'

* * *

'ఒకళ్ళది ఎడంచేత్తో ముట్టుకుని ఎర

గను. అలాంటిది మీలాంటి గృహస్థు పది రూపాయ లెట్టి టిక్కట్టుకొని చేతిలో పెడితే ప్రాణం మా చెడ్డ సిగ్గుపడిపోతోంది' అన్నాడు వరహావతారం యింటరుక్లాసు పెట్టెలో కూర్చుని కిటికీదగ్గిరున్న సోమన్నగారితో.

'ఇదిగో, అలాఅంటేనే నాకు కష్టంగా ఉంటుంది. మావూరు మాపిల్లని చూసుకోడంకోసం వచ్చి నువ్వు టిక్కట్టు పెట్టుకుని మీవూరు వెళ్ళడమా? ఇదేమైనా న్యాయంగా ఉందేమో ఎవర్నైనా అడుగుదామా?'

'నాకు తెలిసింది కాదు. పెద్దల మనసు నొప్పించాను, క్షమించండి'

'ఇంత చిన్నదానికే మనస్సు కష్టపెట్టుకున్నావా? మొహం ఎదుట అనకూడదుగాని ఏం వినయమోయ్ నీకు? గంట కొట్టేశారు, వెడతాను మరీ! మీ నాన్నగారితో సంగతులు నాలుగూ చెప్పు. వెంటనే ఉత్తరం రాయిస్తావుగదూ? నేను ఎప్పుడు రమ్మంటే అప్పుడొస్తాను ఉంటాను మరీ!'

రైలు వెళ్లిపోయింది. ఎంతో తేలికయిన మనసుతో అటే చూస్తున్న సోమన్నగారు ఎవరో పిలవగా యిటు చూశారు. అది ఆయన పాతస్నేహితుడు సత్యంగొంతుక. ఆ రైలునుంచే దిగివస్తున్నట్టున్నాడు.

'ఏంరోయి సత్యం! ఎక్కడ్నుంచి యిలా?'

'అనకాపల్లినుంచిరా, మా తోడల్లుడి చెల్లెలికి పెళ్లంటేనూ మొన్నరాత్రి వచ్చేను'

ఇద్దరు మిత్రులూ స్టేషనునుంచి యిళ్ళవైపు నడక సాగించారు.

'పెళ్ళిళ్లు చాలా జోరుగా జరిగిపోతున్నాయే. ఇంక మీ రంగ డొక్కర్తే ఉండిపోయినట్టుంది మీ కుటుంబంలో' అన్నారు సోమన్నగారు.

'నీ దయవల్ల అదీ ఎన్నిరోజులో లేదులే!' అంత సంతోషంతో సత్యం చెప్పడం సోమన్నగారికి ఆశ్చర్యం కలిగించింది. సత్యం కూతురు రంగడికి యిరవై ఏళ్లకు తక్కువ వుండవు. పైగా ఓ కాలు యీడుస్తూ నడుస్తుంది. అలాంటి పిల్లకి హఠాత్తుగా సంబంధం కుదరడం సోమన్నగారికి విచిత్రం అనిపించింది.

'ఎక్కడ సంబంధం?'

'బందరు డిప్యూటీ తాసిల్దారుగా రబ్బాయి కూర్మావతారమని మహా బుద్ధిమంతుడులే. తనే వచ్చి స్వయంగా చూసుకున్నాడు. ఇంక నా బాధ్యత తీరిపోయినట్టే. అదేమిటి నువ్వలా ఉన్నావ్?'

సోమన్నగారికి నిలువు గుడ్లు పడిపోయాయి. ఆయన అస్పష్టంగా గొణుక్కున్నాడు. బాలింతరాలికి పోసినట్టు నీళ్లు, పిడుగులాంటి మనిషికి అరగంట తలగొడుగు, మనుగుడుపుకి మేపినట్టు తిండి, పది రూపాయల టిక్కట్టు, జరీ పంచ— ఏనాటి ఋణసంబంధమని ఎవడికి యిచ్చినట్టు? జరిగిన సంగతి చెప్పేసరికి సత్యం చెవులు గళ్ళడిపోయాయి.

'ఎంతలా మోసపోయాంరా? పిల్లల్ని కనడంలో పరీక్ష పెడితే, ఫస్టు మార్కు తెచ్చుకునే ఆంధ్రదేశంలో, చదువు అందచందాల ప్రసక్తిలేకుండా మొగాడనే పరికల్లా విరగబడే రోజుల్లో, తమకి ఆడపిల్లలున్నా మొగపిల్లల్ని సంతలో అమ్మే మహానుభావులు కల కాలంలో యిలాంటి పెద్దమనుషులు లోట్లు కనిపెట్టి పొగడ్తలో మనుషుల్ని మరిపించి అప్పుడప్పుడు ప్రత్యక్షమై అప్పటికప్పుడు మాయమాతున్నారన్నమాట! ఇలా పదిరోజుల పెట్టుగా నాలుగురోజులు గడిచినా గడిచినట్టే అని చూస్తున్నారన్నమాట! ఏంరా?'

'ఏం చెప్పను సత్యం? ముందు ఉత్తరం కూడా వస్తే నిజమే అనుకున్నాం గాని యిదంతా నాటకం అనీ 'ఉదర నిమిత్తం' అనీ ఎవడికి తెలుసూ? శిష్టరక్షణకోసం అవతారం ఎత్తిన ఆ కృష్ణావతారమే యిలా వచ్చిందా అనిపించింది గాని ఉల్పాభక్షణ కోసం వచ్చిన, సాక్షాత్ కల్క్యవతారం అని ఎవరనుకున్నారు? స్వయంగా టిక్కట్టు కొనియిచ్చి పంపేనుకదా! ఈ పాటికి ఏ వామనావతారంలో ఉన్నాడో మాకు పంగనామాలు పెట్టిన వరహావతారం!'

'వరహావతార మేమిటి? నీ మొహం! మా అల్లుడు కూర్మావతారం!'

వెర్రి మొహాలతో మిత్రులిద్దరూ యిల్లు చేరుకున్నారు. ఆతరువాత కన్నప్రాణం ఉండబట్టలేక వాకబు చెయ్యగా బందరు తాసిల్దారు ఆంగ్లో యిండియన్ లేడీ అనీ, ఆమెకు పెళ్ళే అవలేదనీ తేలింది! ★

సంసారపు గొడవలు

డి. వి. యస్. రావు

'ఏమండి సుబ్బమ్మగారు ఏం జేస్తున్నారు?' అంటూ ప్రవేశించింది రామమ్మ.

'రండి రండి. కొత్తగా తమ దర్శనాలే కరువయ్యాయి' అంటూ చాప పరిచింది సుబ్బమ్మ.

'మా అక్క, బావ, పిల్లలు వచ్చారు. ఈ వారంరోజులు వాళ్ళతో సరి. క్షణం తీరిక లేదంటె నమ్మండి సుబ్బమ్మగారు.'

'అంత తీరిక లేనిపని యేం జేస్తున్నావమ్మా.'

'పొద్దున్నె యే దోసో, వుప్మావో, యిడ్లీయో చేయాలి. వట్టి కాఫీ అలవాటు లేదట వారికి. దానితో యే యేడున్నరో, యెనిమిదో అవుతుంది. సరే మామూలు వంట వున్నదేగా. మళ్ళీ మధ్యాహ్నం కాఫీ, ఫలహారము. సాయంత్రానికి వంట. ఇక తీరుబడి యేముంది చెప్పండి?'

'నిజమే ఈ వెధవ కాఫీ వల్ల పని తెమలదు. అయినా యేమన్నా ఆరోగ్యమా? డబ్బు దండుగ. పని చెరుపు తప్ప'

'సరే కాని మన కోడలు కమల యేది? ఏం జేస్తున్నదండి?'

'ఆ రాణిగారి కేమిలెండి. ఏం జేసినా చెల్లుబడే. ఆమె ఆడిందే ఆట, పాడిందే పాట. అల్లా సాగుతున్నయి ఆమె రోజులు'

'అదేమిటి? కొత్తగా మాట్లాడుతున్నారే యీ రోజు'

'ఆ ఇంకెందుకండి రామమ్మగారు! ఇన్నాళ్లు యెల్లాగో వోపిక పట్టుకుని సరిపెట్టుకపోతున్నాను యెందుకు నలుగురిలో నగుబాటని. ఈ సంసారముతో వేగలేను యింక. అబ్బ చస్తున్నా దాంతో. చూడండి రామమ్మగారు! 60 యేండ్ల ముండను ఆరుగంటలకు లేవాలి? పదహారేళ్ళ పడుచు పదిగంటలకు లేవాలీ? దానమ్మ కడుపుకాల! రోజూ యింతే. యిల్లా అయితే సంసారము యెల్లా జేస్తారు?'

'ఏదో చిన్నతనము. పోనీయండి'

'చిన్నతనము చితకతనము. మనం చిన్నతనములో ఇల్లానే చేశామా? తొలికోడి కూసినప్పుడు లేస్తే పన్నెండుగంటలవరకు పనేనాయె మళ్లీ రెండింటికి మొదలెట్టితే రాత్రి పదకొండు దాకా పనే వుండె. మనము ఇల్లాగే పదిగంటలకు లేచామా?'

'నిజమే లెండి. మనమాదిరి వీళ్ళేం జేస్తారు, కాస్త చీపురు పట్టుకొని వూడిస్తె చెయ్యెంతా కందిపోతుందని భయపడేవాళ్లు. అయినా అందరూ అల్లా వుంటారా? వెంకమ్మగారి కోడలు రత్తమ్మ; పుల్లమ్మగారి కోడలు నాగమ్మ మన కమల...'

'అఘోరించినట్లే వుంది. అలా అయితే ఇంకేమి? నిక్షేపంలా అందరిలాగు నేనూ వుండేదాన్నే! దాని దుంపతెగ! ఒక్క పని చేతకాదు, యే పనన్నా మొదలెట్టితే అఘోరించినట్లె వుంటుంది. చూడండి మొన్నమటుకు మొన్న తులిశమ్మకు అర్ఘ్యమిస్తున్నానండి. అన్నంతిని కంచము కడిగేది కాస్త దూరము పోతే దాని కాళ్ళే మరిగిపోతాయి? ఆ నీళ్లు చింది నా మీద పడె దీని దుంపతెగ! దీనికి ఆచారము లేదు యేమీ లేదండి. సరేమర్లా చచ్చినట్లు స్నానం చేసి తడిబట్ట కట్టుకొని అన్నం తిన్నానండి 60 యేండ్ల ముండను ఈ చలిరోజుల్లో. మావాడు లేదండీ! వాడు బెల్లంకొట్టిన రాయిలా అల్లా నిలబడకపోతే దానిమీద నోరుచేసుకొంటె మరల ఇల్లాంటి పనులు చేస్తుందీ? మీరె చెప్పండి రామమ్మగారు.'

'తప్పు చేసినప్పుడు కోప్పడాల్సిన మాటేలెండి.'

'అయ్యో తీగ అన్నారు. ఏదో చెపుతారె సామెత! వాడి భయమేవుంటె నాకీ ఖర్మ యెందుకు? అది ఇల్లా రెచ్చిపోతుందా? కుక్కిన పేనులా వుండదూ? నిన్న పక్కింటి రత్తమ్మగారు పేరంటానికి రమ్మంటె పోయింది. కాస్త ఆలస్యము అయిందే అనుకోండి. నే చెప్పాగా 'అరె నీభార్య పేరంటానికి వెళ్లిందిరా' అని. అంతవరకు వకచోట కూర్చోగూడదూ కాలుకాలిన పిల్లిమాదిరి అటూ ఇటూ తిరక్కపోతే? అది వచ్చిందో లేదో చిన్నపిల్లవానిమల్లె వెంటబడి దానివళ్లో పెసలు గబగబా తింటుండె. అది పకపకా నవ్వుతుండె! ఇంక వాడి భయమేముంటుంది? దాన్ని నెత్తికెక్కించుకొంటున్నాడు. ఆడదానికి అంత అలుసు ఇస్తే ముందు ముందు అది వాడిమాట యేమి వింటుంది? ఆ సంసారమేమి బాగుపడుతుంది?"

ఈ కాలపు కుర్రవాళ్లలో చాలామంది ఇంతేనండి. పోయిన నెల్లో మా కోడలు పుట్టింటికిపోతే, అది పోయిన రెండో రోజునుండె సాగించాడు 'అమ్మా అది లేకపోతె యేం తోచటల్లేదే' అని. వాణ్ణి చూస్తుంటే మన్నుతిన్న పాము జ్ఞాపకం వచ్చిందనుకోండి- ఆ మందగొడితనానికి ఇంక యేం చెప్పమంటారు సుబ్బమ్మగారూ."

"అబ్బ బాబూ! ఈ రాకుసికొంపలో నే వేగలేనమ్మా? మరే దారైనా చూచుకొంటేనే బాగుండుననిపిస్తోంది."

(39-వ పేజీ చూడండి)




విజ్ఞానవీధులు

"డాక్టర్"



21. తుమ్ము ఆపుకోడం ఎలాగా?

తుమ్ములు శరీరానికి సహజము. ముక్కులోనో, గొంతులోనో, ఊపిరితిత్తులలోనో చేరే విజాతీయ పదార్థాన్ని బయటికి నెట్టి వేయడానికి తుమ్ము అనేది శరీరానికి మంచి బంటు. కనక సాధారణ పరిస్థితుల్లో తుమ్ము ఆపుకోడానికి ప్రయత్నము చేయకూడదు. అయితే నోటిదగ్గర మెత్తగా రుమాలు పెట్టుకోవడము మంచిదే. మన నోటి చిదివర్షము పక్కవారిమీద పడకుండానూ, మన పడిశము పరులకు పాకకుండానూ కాపాడుతుంది. ఇది తుమ్ము ఆపుకోడము అవదు.



అయితే తుమ్ములను ఆపుకోడముకూడా కొన్ని పరిస్థితులలో అవసరమే. పెళ్లిముహూర్తాలు చూడాలని వెళ్ళినప్పటిమాట కాదు నేను చెప్పేది. ఆపరేషను చేయించుకుని హాస్పిటల్లో పడుకున్నవారికి తుమ్మువస్తే రెండుబాధలు. గాయముతాలూకు కుట్లు బిగుస్తాయి తుమ్మితే. అదొకబాధ. ఒకవేళ కర్మము చాలక తెగితే అదోబాధ.

అలాంటివారు తుమ్ము వస్తుందని తెలియగానే బొటనవేలు ముక్కుకిందపెట్టి దానితోనూ చూపుడువేలుతోనూ ముక్కుని నొక్కితేసరి. తుమ్ము ఆగుతుంది.

22. భూమికాంతి

నక్షత్రాలకీ సూర్యుడికీ స్వతస్సిద్ధమైన కాంతి వుంది. గురుడూ, శుక్రుడూ, వంటి గ్రహాలకి స్వతస్సిద్ధమైన కాంతి లేకపోయినా, వాటిమీద పడిన సూర్యకాంతి పరావర్తమై మనవేపు మళ్ళి వాటి సొంత కాంతిలాగే కనపడుతోంది. సూర్యుడివైపుకి వున్న చంద్రబింబపు భాగముమీద పడి, మనవేపు పరావర్తమైన సూర్యకాంతినే మనము వెన్నెల అంటున్నాము.

అమావాస్యనాడు చంద్రుడూ, సూర్యుడూ భూమికి ఒకవైపునే వుంటారు. కనక సూర్యుడివైపు వున్న చంద్రబింబపు సగభాగమే కాంతిగా వుంటుంది. భూమివైపున్న సగానికీ సూర్యుడి వెల్తురు అందదు. అంటే, అమావాస్యనాడు చంద్రుడు కనబడడన్నమాట. పౌర్ణమినాడు సూర్యుడు పశ్చిమాన్ని అస్తమిస్తూండగా నిండు చంద్రుడు తూర్పున ఉదయిస్తాడు. ఆనాడు సూర్యుడి వెల్తురుపడే చంద్రబింబపు భాగమంతా భూమికి కనపడడానికి వీలు; కనక పౌర్ణమినాడు చంద్రబింబం నిండుగా వుంటుంది.

అమావాస్యనాడసలే కనపడని చంద్రబింబం పౌర్ణమినాటికి నిండుబింబం అవడానికి పదిహేనురోజులు పడుతుంది. శుక్లపాడ్యమినాడు అస్తంగత సూర్యునికి చేరువగా వుండే చంద్రబింబపు భాగము వెలుగుతూ మనభూమికి చంద్రరేఖగా కనపడుతుంది అని అందరికీ తెలుసును. అయితే, పరిశీలనగా చూచినవారికేగాని, కాంతిగా వెలిగే చంద్రరేఖమాత్రమే కాక మిగిలిన చంద్రబింబపు భాగముకూడా గుడ్డివెలుగుతో కనబడుతుందని తెలియదు.

ఈ గుడ్డివెలుగు చంద్రుడి కెక్కడిదీ? అని ప్రశ్న. సూర్యుణ్ణించి నేరుగా చంద్రుడికి వచ్చినది కాదు. అదైతే వెన్నెలలాగు కాంతిగానే కనబడాలి. అది కాకుంటే మరేది?

అదే భూమికాంతి. సూర్యుడి వెలుగు చంద్రుణ్ణించి పరావర్తమై మనకి వెన్నెల అయినట్లే, ఆ సూర్యుడి వెల్తురే భూమినించి పరావర్తమై చంద్రలోకవాసులకు భూమికాంతి అవుతుంది. అనుకూల పరిస్థితులుంటే, చంద్రుడిమీద పడిన ఈ భూమికాంతి మళ్ళీ పరావర్తమై భూమికే తిరిగి కనబడవచ్చును. ఈ అనుకూలపరిస్థితులు శుక్లపాడ్యమినాడే ఏర్పడతాయని తజ్ఞుల అభిప్రాయము. అందుకే కేవలం చంద్రరేఖ మాత్రమే కాక భూమికాంతి పడి వెలిగే చంద్రబింబమంతా కనపడుతుంది. సూర్యుడి కాంతి వెన్నెలగా మారినప్పుడు దీప్తి తగ్గినట్లే, భూమివల్ల పరావర్తమై దీప్తి తగ్గి, మళ్లీ చంద్రుడివల్ల (రెండోమారు) పరావర్తమవడమువల్ల ఇంకా దీప్తి తగ్గిపోతుంది. అందువల్లనే శుక్లపాడ్యమినాటి 'చంద్రబింబము' మసకమసకగా కనపడుతుంది.

"పైన చెప్పినది నిజమైతే అమావాస్యనాడు పూర్ణచంద్రబింబము ఈ గుడ్డివెలుగుతో ఎందుకు కనబడదూ?" అని సందేహిస్తారు కొందరు. అమావాస్యనాడు సూర్యోదయముతో ఉదయించి, సూర్యుడితోనే అస్తమిస్తాడు చంద్రుడు. సూర్యుడి దీప్తిలో భూమికాంతివల్ల గుడ్డిగా వెలిగే చంద్రుడి 'ఎరువువెన్నెల' కనబడదు. ★



తారాపథం

"ఘనమూర్తి"

మింటను మెరసే చుక్కల్లారా!
కంటికి చిన్నగ కనబడతారే
వన్నెవన్నెగా కనబడతారే
వెన్నెలరాత్రిలో కనబడ రేమి?

చిమచిమలాడే
చీకటిరాత్రిలో
చెక్కిన మణులకుమల్లే
లెక్కకు మిక్కిలి అగుపడతారే
ఎవరిచ్చారా చక్కదనం?
ఎవరిచ్చారా కాంతి?

అందరికన్నా పెద్దలుమీరని
వందలకొలదీ మైళ్లలోకలరని
స్వతంత్రశక్తితో కాంతులు మీరు
స్వేచ్ఛగ వెలిగిస్తారని
చెప్పేమాటలు నిజమేనా?
తప్పక అవి సత్యాలేనా?

మా లోకానికిమల్లె
మీ లోకంలోకూడా
పచ్చని చేలు పాడిపశువులు
పర్వతశ్రేణులు పవిత్రనదులు

నవనాగరిక ప్రజానీకం
ఉన్నారని చెప్పేమాటలు
ఉత్తవికావా మరి
రిత్తవి కావా?

మీ లోకం వాసులతో
మా లోకంవాసులు ఎంతో
మాటలు మంతులు చేద్దామని
బాటలు, దారులు వేద్దామని
యంత్రశక్తితో ఆశ్చర్యంగా
ఎంతో కృషిచేస్తూన్నారే!
కష్టానికి తగిన ఫలం
కరుణతోడ సమకూరుస్తారా
మింటను మెరిసే చుక్కల్లారా!

పాటలు నేర్చిన పెళ్లాం

ఆవిడ కొత్తగా కాపురానికి వచ్చింది. పుట్టిల్లు పల్లెటూరేమో, యీ బస్తీపద్ధతులు యింకా అలవాటుపడలేదు-నాతో మాట్లాడటానికే సిగ్గుపడేది. నిజం చెప్పొద్దూ! నాకూ కొంచెం సిగ్గుగానే వుంటోంది. సిగ్గుపడితే ఎట్లా? ఎలాగో ఓలాగు ధైర్యంచేసుకొని మాట్లాడాను; మాట్లాడించాను. అంతా ఒక వారం రోజులు తిరిగేలోగా యిద్దరికీ మాంచి చనువు ఏర్పడిపోయింది.

మా ఆవిడ పల్లెటూరుపిల్ల అయితే అయిందికానీ, కమ్మని కంఠం! నేనూ ఓమోస్తరుగా పాడుతానుగా. కాలక్షేపంగానైనా వుంటుందని నాకు వచ్చిన కొన్ని సినిమా పాటలు ఆవిడకు నేర్పేను. ఆవిడకూడా ఆ పాటలనన్నిటినీ ఎంతో శ్రద్ధాభక్తులతో నేర్చుకొన్నది.

ఈ మధ్య 'పెళ్ళిచేసిచూడు' సినిమా క్రొత్తగా వచ్చింది. ఇద్దరమూ వెళ్లాం. అందులో 'ఏడుకొండలవాడా' అనేపాట నాకు చాలా నచ్చింది. మా ఆవిడకు ఆ పాట అంతా నేర్పేశాను. ఆవిడ తరచు ఆపాటే సన్నగా పాడుకొంటూ యింటిపనులు చేస్తుండేది.

ఒకరోజు నాకు ఒంట్లో ఏమీ బాగాలేదు. పగలంతా జ్వరం కాసింది. రాత్రి 10, 11 గంటలప్పుడు జ్వరం దిగిపోయి చెమటలు పోశాయి. కొంచెం వేడివేడికాఫీ త్రాగి పడుకొన్నాను. జ్వరతీవ్రత సద్దుకోనేసరికి నాకూ కొంచెం హుషారుపుట్టుకొచ్చింది. మా ఆవిడను పిలిచి అలా ఆ మంచంమీద కూర్చొని 'ఏడుకొండలవాడా' పాట పడమని పురమాయించాను. ఆవిడకూడా, పాపం, అడిగిందే తడవుగా పాట పాడటం ప్రారంభించింది. నేను మంచంపక్కెమీద వేళ్లతో తాళంవేస్తూ వింటూ వున్నాను.

పాటఅంతా అయిపోయి చివరి చరణం- 'సద్దు శాయక దొంగా'- పాడుతున్నది. ఈ పాట అయిపోతున్నదికదా, యింకేపాట పాడమందామా అని నేను ఒకచెంపను ఆలోచిస్తూవుంటే, ఆవిడ 'సద్దుశాయక దొంగా, దొంగా, దొంగా దొంగా...' అంటూ ఆపకుండా పాడుతునేవుంది. ఎంతకీ ఆ 'దొంగా, దొంగా, 'అనటం మానకపోతే "అదేమిటే! చిల్లిపడ్డ గ్రామఫోనురికార్డులా దొంగా, దొంగా, అంటావేమిటే" అని అడిగాను.

నా ప్రశ్న వినికూడా ఆవిడ ఏ సమాధానమూ చెప్పకుండా యింకా అలానే 'దొంగా' 'దొంగా' అంటూ, కంటిగ్రుడ్లతో మాత్రం ఆలా కిటికీవైపు చూపించటం సాగించింది. విషయమేమిటో బోధపడక ఆవిడ సైగచేసి చూపిస్తున్న కిటికీ వైపు చూశాను. అక్కడ నిజంగానే దొంగ ఒకడు పొంచివున్నాడు. కారునలుపు ఆకారం. నెత్తిమీద నల్లటి గుడ్డ. ఎర్రటి కళ్లు. బుగ్గమీసాలు.

ఆ దృశ్యం కంటపడేసరికి నాకు ముచ్చెమటలు పోశాయి. మలేరియా పట్టుకున్నవాడికిలాగా విపరీతమైన వణుకు పుట్టుకొచ్చింది. మళ్ళీ మాట్లాడకుండా దుప్పటి కప్పేసుకొని, కళ్లు రెండూ గట్టిగా మూసేసుకు పడుకొన్నాను. గుండెలు దడదడా కొట్టుకొంటున్నాయి.

అలా ఎంతోసేపు ఆ దుప్పటి ముసుగులోనే వూపిరి బిగబట్టి పడుకొనివున్నా. వున్నట్లుండి "ఏయ్! తాళం చెవు లెక్కడ పెట్టావ్! మర్యాదగా యిచ్చెయ్; లేకపోతే ప్రాణాలు దక్కవు" అంటూ ఎవరో బొంగురుగొంతుకతో గద్దించి అడిగారు.

"చంపకు బాబోయ్! చంపకు.

ఇంద. ఈ తాళంచెవులు నా జేబులోనే వున్నా"యంటూ వాటినితీసి, దుప్పటి కొద్దిగా తొలిగించి అవతల వున్న మనిషికి వాటిని అందించాను. దుప్పటి కప్పుకొనివుండి కూడా కళ్లుమాత్రం తెరవలేకపోయాను. దుప్పటిముసుగులోనుంచే చెవులు రిక్కించి విన్నా- పెట్టెలు అవీ ఖాళీఅవుతున్నాయేమోనన్న దిగులు కొద్దీ. అనుకొన్నంత పనీ అయింది. పెట్టెలు యీడుస్తున్నట్లు, బోర్లిస్తున్నట్లు చప్పుళ్లు అవుతున్నాయి. 'కొంప అంతాగుల్ల అవుతున్నది కాబోలురా భగవంతుడా' అని ఎంతో దిగులుపడ్డాను. ఏమైతేమాత్రం యీ నిరసస్థితిలో నేనేం చెయ్యగలను లెమ్మనుకొని సమాధానపరుచుకొన్నాను. దుప్పటిముసుగు మాత్రం ఎక్కడా సందివ్వకుండా బిగపట్టి కప్పుకొన్నాను.

ఎప్పుడు నిద్రపట్టిందో ఏమో, కొంత సేపయ్యాక మెళుకువ వచ్చింది. జరిగిందంతా మళ్లా తలపోసి, అయినా యింట్లో యింకా ఏమేమి సమాను మిగిలి వున్నాయో చూద్దామని బుద్ధి పుట్టింది. ఎలాగో ధైర్యం తెచ్చుకొని దుప్పటి కొద్దిగా తొలిగించి చూశా. అవతలి మంచంమీద మా ఆవిడ కనుపించలేదు! కొంప తీసి ఇంటినీ, యిల్లాలినీ కూడా యీ దొంగ ఎత్తుకుపోయాడేమోనని భయం వేసింది. ఏం చెయ్యటానికీ తోచలేదు. మళ్లీ ఆలోచనల్లో పడ్డాను. ఎప్పుడో కునుకు పట్టేసింది.

తెల్లవారింది. దబ్బుదబ్బున నిద్దర లేచి యిల్లు అంతా కలయచూశాను. ఏ మూల పెట్టిన వస్తువు ఆ మూలే వున్నది. మా ఆవిడ కూడా యింట్లోనే వున్నది. కాఫీ కుంపటిదగ్గిర విసురుతున్నది.

"అయితే నిన్న దొంగ ఎత్తుకుపోలేదన్న మాట."

"చాల్లేస్తురు! మీ మాటలు మరీనూ! నన్నెందుకు ఎత్తుకుపోతాడు- దొంగ!"

"ఏమో! కమ్మగా 'ఏడుకొండలవాడా' పాటపాడుతావని ఎత్తుకుపోవచ్చు."

"అయితే నేపాడినపాట కమ్మగా వుండంటారు."


"ఆహా!"

"అలాగయితే యీ ఏభైరూపాయలూ పట్టుకెళ్ళి నాకో మంచి సిల్కు-చీరె తెచ్చిపెట్టండి."

"అదేమిటి! నీకెక్కడివి ఆ ఏభైరూపాయలు? ఆ దొంగగానీ నీకు యిచ్చిపోలేదుకదా!"

మా ఆవిడ పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతోంది. దీనికీ నవ్వు ఎందుకు వస్తోందో నాకు ఎంతకీ అర్థంకాలేదు. కోపం కూడా

(39-వ పేజీ చూడండి)



'ఒలింపిక్' పందేలు పుట్టుపూర్వోత్తరాలు

ఈ సంవత్సరం ప్రపంచ క్రీడా రంగంలో ఒకగొప్ప ఉత్సవం జరుగుతూంది. ఫిన్లండ్ దేశపు రాజధాని, హెల్సింకీలో జూలై 19 తారీకునుంచి ప్రారంభమైన ఒలంపిక్ పందేలే, అవి.


అసలు ఈ ఒలంపిక్ అంటే ఏమిటి? దాని ప్రాధాన్యత ఏమిటి? దాని ఆశయం ఏమిటి ? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవటం మంచిదికదూ !

పూర్వం గ్రీకు దేశస్థులు నాలుగు సంవత్సరాలకోసారి యీ క్రీడా ఉత్సవాల్ని జరిపేవారు. ఆ ఉత్సవంలో పాల్గొనటానికి దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి ఆటగాళ్లు వచ్చేవారు. గ్రీకుభాషలో 'ఒలంపియాడ్' అంటే నాలుగుసంవత్సరాలని అర్థం. అందుకనే అవి నాలుగు సంవత్సరాలకోసారి జరుగుతాయి.

కానీ, నవీనయుగంలో ఈ పందేల్ని ఫ్రెంచి దేశస్థుడైన "బారన్ ఫెరెడి కౌబర్టిన్" అనే ఆయన ప్రోత్సాహంవల్ల, ఒలంపిక్ పందేలకు జన్మస్థానమైన గ్రీకుదేశపు రాజధాని ఏథెన్సు నగరంలో, మొదటిసారిగా 1896 లో జరిపించారు. అప్పటినుంచీ యింతవరకు 14 సార్లు ఈ పందేలు జరిగాయి. 'హెల్సింకీ' లో జరిగేది 15 వది. 1916, 1940, 44 సంవత్సరాలలో ప్రపంచ యుద్ధాలమూలంగా ఇవి జరగలేదు.

శ్రీ రావు

ఈ నాడు యీ పందేలు, ప్రపంచశాంతి ఉద్యమంలో వివిధ దేశాలమధ్య క్రీడావినోదవ్యాసంగాలద్వారా సన్నిహిత సంబంధాలను పెంపొందించి శాంతిస్థాపనలో ఒక ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నవి. ప్రతిసారి ఈ ఆటల్లో పాల్గొనేవారి సంఖ్య వృద్ధిచెందుతూంది. ఈ సంవత్సరం 71 దేశాలనుంచి 8000 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. మనదేశంనుంచి దాదాపు 100 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. వీరిలో దండమూడి రాజగోపాల్, కామినేని ఈశ్వరరావు గార్లు (ఆంధ్రులు) వున్నారు. వీరిద్దరూ బరువుమొత్తే పోటీలో పాల్గొనబోతున్నారు. రాజగోపాల్ గారు 1948లో లండన్‌లో జరిగిన ఒలింపిక్ పందేలలో భారతప్రతినిధిగా పాల్గొన్నారు.



డి. రాజగోపాల్

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వారు ఏఏ దేశాల్లో పందేలు జరగాలో వివిధ దేశాల ఆహ్వానాల్ని పరిశీలించి నిర్ణయిస్తారు. ఆ నిర్ణయం జరిగినతర్వాత ఏ నగరంలో పోటీలు జరుగుతవో, ఆ నగరపు మేయరు వివిధ దేశాలనుంచి వచ్చే వేలకొలది ఆటగాళ్లకు బసలను ఏర్పాటు చేయమని స్థానిక ఒలింపిక్ కమిటీవారిని కోర్తాడు. ఆ ఉత్తరవు ప్రకారం వారు బసల నేర్పాటు చేస్తారు. ఈ బసల్నే 'ఒలింపిక్ గ్రామం' అంటారు. సామాన్యంగా ఆ గ్రామంలో ఒకే భాష మాట్లాడేవారందరికి ఒక బస ఇస్తారు.

ఒలింపిక్ పందేల్లో ఒక ప్రత్యేకమైన పతాకాన్ని ఎగురవేస్తారు. తెల్లటి స్వచ్ఛమైన సిల్కుగుడ్డ మీద ఐదు ఖండాల మైత్రినీ సూచిస్తూనీలము, పసుపు, నలుపు, ఆకుపచ్చ, ఎర్రని రంగులు గల వృత్తాలు ఉంటాయి



"స్వేచ్ఛా జీవి"

చిత్రకారుడు: చి॥ కాకుమాను గోవర్ధనరావు (రెండవఫారం, బందరు)

ఈ ఆటల ప్రారంభోత్సవము చూడటానికి చాలా ముచ్చటగా ఉంటుంది. ఏ దేశంలో అవి జరుగుతాయో ఆ దేశపు పెద్ద, ఈ ఉత్సవాన్ని ప్రారంభిస్తాడు. ఈసారి ఫిన్లండు దేశపు అధ్యక్షుడు ఈ ఉత్సవాన్ని ప్రారంభించాడు. అధ్యక్షుడు వేదికదగ్గరకు వెళ్తుండగా ఫిన్లెండ్ దేశపు జాతీయ గీతాన్ని వాయించారు. తర్వాత ప్రతిదేశపు ఆటగాళ్లు తమ జండాలను, తమదేశపు పేరుగల ఒక అట్టను పట్టుకొని బారులు తీర్చి నడిచారు.

ఉత్సవాన్ని ప్రారంభించిన తర్వాత విజయభేరీలు ఫిరంగులు చేసే ధ్వనులమధ్య ఒలింపిక్ జండాని ఎగురవేశారు. శాంతి సూచకంగా ఆకాశంలో వేలకొలది పావురాళ్లను ఎగురవేశారు. తర్వాత అక్కడకు వచ్చినవారంతా సంతోషంగా పాటలు పాడారు.

ప్రారంభోత్సవం తర్వాత ముఖ్యమైన ఘట్టం, ప్రమాణ స్వీకార మహోత్సవం. పందెం జరిపే దేశపుజండాను పట్టుకొని ఒక ఆటగాడు మెల్లిగా అడుగులు వేసుకుంటూ ప్రమాణస్వీకార మంటపపు మెట్లదగ్గరికి వెళ్తాడు. వివిధ దేశపు ఆటగాళ్లు తమ జండాల్ని పట్టుకొని అతని చుట్టూ అర్ధ వృత్తాకారంలో నిలబడ్తారు. అప్పుడు అతను ఈవిధంగా ప్రమాణ వాక్యాన్ని చదువుతాడు. "మేము మా దేశగౌరవంకొరకు, ఆటల గౌరవంకొరకు ఈ పందెములలో పాల్గొని, 'ఒలింపిక్' నిబంధనలను శిరసా వహించెదమని ప్రమాణము గైకొనెదము." ఈ వాక్యాన్ని అందరు తమ కుడిచేతుల్ని ఎత్తి

మళ్లీ చదువుతారు. తర్వాత ఆటగాళ్లు తిరిగి బారులుతీర్చి నడుస్తారు. అంతటితో ప్రారంభోత్సవం అయిపోతుంది.

ఈ ఉత్సవం 15 రోజులు జరుగుతుంది. ఆఖరురోజున ఆ దేశపు పెద్ద ఆటగాళ్ల నుద్దేశించి ప్రతి దేశపువారు 4 సంవత్సరాల కోసారి ఈ ఆటలను ఆడవలెనని ఉద్బోధిస్తూ ఉత్సవాన్ని ముగింపచేస్తాడు. తర్వాత భేరీలు, ఫిరంగులు మ్రోగుతుండగా జండాను దించివేసి హెల్సింకీ మేయరువద్ద దానిని దాచిపెడ్తారు.

ఈ ఉత్సవాల్లో అన్నిటికన్నా ముఖ్యమైనది, ఒలింపిక్ జ్యోతిని వెలిగించటం. ఈ జ్యోతిని గ్రీసు దేశంలోని 'ఒలంపియా'లో సూర్య రశ్మిద్వారా వెలిగిస్తారు. ఇలా వెలిగించిన జ్యోతిని అంచెలు అంచెలుగా కాలినడకను ఆటలు జరిగే స్థలానికి తీసుకొని వెళ్తారు మధ్య సముద్రం దాటవలసివస్తే ఓడమీదగాని, విమానంమీదగాని పంపుతారు. ఈ జ్యోతిని రాత్రింబగళ్లు ఆట జరిగేస్థలంలో వెలిగించి వుంచుతారు.

ఈనాడు ఒలింపిక్ పందేలలో 17 ముఖ్యమైన పోటీలు జరుగుతున్నయ్. అందులో బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, హాకీ, స్విమ్మింగ్ రేస్, డిస్క్ త్రో, హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్ రేస్, మారథన్ రేస్ ముఖ్యం. అన్నిటికన్నా కష్టమైనది మారథన్ రేస్. ఈ పోటీలో 26 మైళ్ల 385 గజాల దూరం పరుగెత్తాలి.

పోటీల్లో గెలిచినవారికి పతకాలు, యోగ్యతాపత్రాలుఇస్తారు. మొదటి బహుమానం బంగారపు పూతపూసిన వెండిపతకం, రెండవది వెండిపతకం, మూడవది కంచు పతకం. పోటీల్లో గెల్చినవారి దేశపు పతాకాన్ని 'స్కోర్ బోర్డు' మీద ఎగురవేసి ఆ దేశపు జాతీయ గీతాన్ని వాయిస్తారు. ★



(గతసంచిక తరువాయి)

పాటలు పాడే బొమ్మలను గురించి చెప్తానని గడియారం అన్నప్పటినుంచీ సుందరానికి అదేమిటో తెలుసుకోవాలని తొందరగా వున్నది. అందుకని సుందరమే రెట్టించి అడిగాడు "ఊఁ! ఆబొమ్మలను గురించి చెప్తానన్నావ్. చెప్పు త్వరగా."

"అవును. విను. 1779 వ సంవత్సరంలో రష్యాదేశంలో పీటర్స్‌బర్గ్ అనే పట్టణంలో ఒక బొమ్మను మహాఘనంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకుగాను పోలీసు బందోబస్తు వగైరా చాలా కట్టుదిట్టంగా చేశారు కూడా." గడియారం చెప్పుకువస్తున్నది.

"ఆ బొమ్మలో అంతటి విశేషమున్నదా ఏమిటి?" సుందరం ఆత్రంగా అడిగాడు.

"ఊఁ! అందులోనూ సామాన్యమైన విశేషమనుకొన్నావా! ఆ బొమ్మ ఒక చక్కని స్త్రీఆకారంలో వుండేది. ఈస్త్రీ పియానోవంటి వాయిద్యంముందు కూర్చుని, అప్పటి ప్రజలకు బాగా నలిగివున్న పది పాటలు వరసగా, విన సొంపుగా వాయించేసేది. ఎక్కడా తాళం తప్పటం కానీ, అపశ్రుతి పలకటం గానీ జరిగేదికాదు. పాటలన్నీ పూర్తిఅయ్యాక ఆవిడ కూర్చున్న చోటునుంచీ లేచి యివతలకు వచ్చి, అంతసేపూ తన వాయిద్యాన్ని విన్నవాళ్లందరికీ కృతజ్ఞత తెలుపుతున్నట్లుగా, వంగి వంగి దణ్ణాలు పెట్టేది. ఆవిడనడకలో మాంచి ఒయ్యారముండేది. వాయిద్యం వాయిస్తుంటే ఆమెకళ్లు, వేళ్లు ఎంతో సహజంగా కదిలేవి! వుండీ వుండీ తలకూడా ఆడించేది. ఇదంతా చూస్తుంటే, అది అసలు బొమ్మకాదనే అనిపించేది. ఈ వింతను చూడటానికి ఆరోజుల్లో జనం విరగపడ్డారంటే నమ్ము."

"బలేబాగుందే! అలాటిబొమ్మ నాకూ ఒకటి వుంటే ఎంత బాగుండునూ!"

"ఇంకా గమత్తుఅయిన బొమ్మలు మరికొన్ని వున్నాయి. వాటివిషయంకూడా చెప్తాను. విను. ఫ్రెంచిదేశస్థుడొకడు పిల్లంగోరు

వాయించే బొమ్మనొకదానిని తయారుచేశాడు. చక్కని కుర్రాడొకడు పిల్లంగోరు పెదిమలకు ఆనించుకొని పన్నెండు పాటలు ఒక్క బిగువను వాయించేసేవాడు. ఆ పిల్లంగోరుమీద యీ బొమ్మ తాలూకు వేళ్లు కదులుతుండగా చూస్తే, నిజంగా పిల్లంగోరు వాయించేవాళ్లు ఏఏ స్వరం కావాలంటే ఏఏ వేలు ఎంతెంత వేగంగా పైకి ఎత్తుతూ దించుతూ వాయిస్తారో, అంత సహజంగానూ వుండేది. స్విట్జర్‌లాండ్‌లో ఒకప్పుడు డ్రాజెస్ అనే ఆయనవుండేవాడు. ఆయనా, ఆయనకొడుకూ యిద్దరూ కలసి కొన్ని బొమ్మలు తయారుచేశారు. వీరు చేసిన బొమ్మలను ప్రపంచం ప్రపంచంఅంతా విస్తుబోయి చూచింది. వాళ్లు తయారుచేసిన బొమ్మల్లో, ఒకదాంట్లో ఒక కుర్రాడు బల్లముందు కూర్చొని ఏదో వ్రాస్తున్నట్లు వుంటుంది. ఈ కుర్రాడు తడవతడవకు ఎదురుగుండా బల్లమీద వున్న సిరాబుడ్డిలోకి కలాన్ని ముంచి, కలంపాళీకి అదనంగా అంటుకొన్న సిరాను పదిలంగా తుడిచేసి, అక్కడే వున్న ఒక పుస్తకంలోనుంచీ పేజీలకు పేజీలు చూచివ్రాత వ్రాశేవాడు. అతని దస్తూరి ఎలా వుండేదనుకొన్నావ్! నీ దస్తూరిలాగా, కోళ్లు కెలికినట్లుండేది కాదు. ముత్యాలు తీర్చినట్లుండేది. నీలాగా స్పెల్లింగ్ తప్పులు వ్రాశేవాడనుకొంటావేమో! అదీలేదు. అతడు వ్రాసినదాంట్లో మచ్చుకైనా ఒక్క తప్పూ కనుపించేదికాదు."

గడియారం, తన దస్తూరిని గురించి, తన 'స్పెల్లింగు'నుగురించి ఎద్దేవా చేస్తుండేసరికి సుందరం మూతి శారెడు పొడుగున ముందుకు పొడుచుకువచ్చింది. తనను సమర్థించుకోవటానికి "అది బొమ్మకాబట్టి తప్పులుచెయ్యదు." అన్నాడు.

"మనిషిఅయితే తప్పులుచెయ్యవచ్చేం! తలకాయ లేని బొమ్మలే తప్పులుచెయ్యవుకదా! తలకాయ వుండీ మీ మనుష్యులు తప్పులు చెయ్యొచ్చేం?" గడియారం కవ్వించి అడిగింది.

"పోనిలే. తలకాయ ల్లేకపోయినా మీ యంత్రాలే గొప్పవి. అలా ఒప్పుకొంటే చాలా?"

"గొప్పకోసం కాదోయ్! మాటవరసకు చెప్పతున్నాను అంతే! ... ఇంకా అటువంటి బొమ్మలను గురించి చెప్పమంటావా?"

"చెప్పు!"

"ఈ 'డ్రాజెస్' అనే ఆయన మరొక కుక్కబొమ్మనుకూడా చేశాడు. ఆ కుక్క నోటితో పళ్ల బుట్ట ఒకటి కరచిపట్టుకువుంటుంది. ఆ బుట్టనిండా 'ఏపిల్' పళ్లు వుంటాయి. నువ్వగనుక పొరపాటున ఆ పళ్లలోనుంచి ఒక్కటి పైకి తీశావా, యిక చూసుకో-ఆకుక్క 'బౌంయ్' 'బౌంయ్' మంటూ అరుపు లంకించుకొంటుంది. ఆ చుట్టుపట్ల ఆ సమయానికి నిజమైన కుక్క ఏదున్నాసరే, అదీ యీ కుక్క అరుపులకు మారు అరుపులు మొదలెట్టేస్తుంది. అంటే- యీ బొమ్మ కుక్క అరిచే అరుపు అంత సహజంగా వుండేదన్న మాట."

"అది సరే కానీ — సిగరెట్లు కాల్చే బొమ్మఒకటి వుంది. నీకు

తెలుసా ?" ఈసారి సుందరమే గడియారాన్ని "నీకు యిది తెలుసా" అని ఒక ప్రశ్న వేయగలిగాడు.

"నేను వినలేదే !"

"వినలేదూ ! ఇంతేనా ! నేనూ, మా అమ్మా, మా చెల్లాయి మేమంతా అప్పుడు యీవూళ్లో ఎగ్జిబిషన్ అవుతుంటే దానికి వెళ్లలేదూ ! అక్కడ చూశాం యీ బొమ్మని. ఆ బొమ్మ మాఅన్నయ్య అంత ఎత్తు వుంటుంది. మా అన్నయ్య అయితే నాన్నగారి ఎదుటమాత్రం సిగరెట్లు కాల్చడు కానీ, యీబొమ్మ అందరి ఎదుటా సిగరెట్లు తెగ కాల్చేస్తుంది. ఇంకో గమత్తు:—ఎవరికీ కనుపించకుండా మా అన్నయ్యవాళ్లు సిగరెట్లు కాలుస్తూంటే, యీ బొమ్మ సిగరెట్లు కాల్చటం చూడటానికి మా నాన్న, మా మాస్టారూ, మా హెడ్‌మాస్టారూ అందరూ వెళ్లి వచ్చారు. ఆబొమ్మ ఎంత దర్జాగా సిగరెట్లు కాల్చిందనుకొన్నావ్!"

గడియారం ముసిముసి నవ్వులు నవ్వుతూ "ఇలాటిదే మరొక బొమ్మను, మీనాన్న నీ అంత పిల్లాడుగా వున్నప్పుడు చూశారు. నీతో ఎప్పుడూ చెప్పలేదూ?"

"లేదే ! అది ఏం బొమ్మ? ఎలా వుంటుంది?"

"బాలగంగాధరతిలక్‌గారి పేరు విన్నావా, ఎప్పుడైనా ?"

"ఆ; వాడు మాక్లాసు కుర్రాడేగా ?"

"ఎబ్బే! అతను కాదు. నేచెప్పే ఆయన చాలా గొప్పవాడు. గాంధీగారికి గురువు."



"నాన్నా! పైవాళ్ల అబ్బాయి కొత్తచెప్పులు కొనుకున్నాడు; నాన్నా!"

"గాంధీగారికి గురువే!"

"ఆఁ! అవును. ఆయన చనిపోయి చాలాకాలం అయిందిలే. ఆయనలాగే ఒక బొమ్మను ఎవరో మన దేశంలోనే తయారుచేశారు. ఆ బొమ్మ ఒక కుర్చీలో కూర్చొని పేపరు చదువుతూ వుంటుంది. న్యూస్‌పేపర్లో పంక్తులు పొట్టివేగా. పేపరు చదివేటప్పుడు మనవాళ్లు చూడూ, మాటిమాటికీ తలను యీ చివరనుంచీ ఆ చివరకు కదిలిస్తుంటారే - అల్లాగే-యీ బొమ్మ తలకాయకూడా మాటిమాటికీ కదుల్తూవుండేది. ఈ బొమ్మను కూడా ఎగ్జిబిషన్లో పెట్టారు. ఆ బొమ్మ అలా పేపరు చదువుతూ తల ఆడిస్తూవుంటే, నిజంగా నే బాలగంగాధరతిలక్‌గారు అక్కడ పేపరు చదువుకొంటూ కూర్చొన్నారుకాబోలని మీ నాన్నగారే అనుకొన్నారట...ఇదేమిటి అదేమిటని ఆ డ్రజ్‌స్ కొన్ని బొమ్మల చేత ఒక నాటకం నాటకమంతా ఆడించేవాడు."

"నాటకమా ? అదెలాగు ?"

(ఇంకావుంది)

నక్షత్రాలు ఎన్ని?

ర్వం ఒక రాజుగారు వుండేవాడు. ఆయనకి ఎప్పుడూ ఏవో ధర్మసందేహాలు కలుగుతూ వుండేవి. తనకి వచ్చిన సందేహాలకు సమాధానాలు చెప్పమని దర్బారులోనివాళ్ళందరినీ వేధించుకుతినేవాడు. ఆ సందేహాలు తీర్చేసరికి వాళ్లందరికీ తలప్రాణాలు తోకకి వచ్చేవి.

ఒకరోజు రాత్రిపూట రాజుగారు, చల్లగాలికని, ఆరుబయట పడుకున్నారు. ఆరోజు అమావాస్య. మబ్బుమీదికి సందు లేకుండా బోలెడన్ని నక్షత్రాలు వచ్చాయి. నీలిచీరమీది జరీపువ్వుల లాగ, ఆ నీలిమబ్బుమీద మిలమిలా మెరుస్తున్న ఆ నక్షత్రాలని చూచి రాజు తన్మయుడైపోయాడు. వాటివంక అలాగే కన్నార్పకుండా చూస్తూ యిటువంటి సుందర ప్రకృతిని సృష్టించిన భగవంతుని ఎంతో కొనియాడాడు. కాని ఆయనకి యింతలోనే వో పెద్ద సందేహం కలిగింది. అదేమంటే- 'ఆకాశంమీద వున్న ఆ నక్షత్రాలన్నీ కలిపి ఎన్ని వుంటాయి ?' అని.

ఇంకేం ! మరునాడు దర్బారులో అందరూ ఆసీనులై వుండగా, రాజుగారు గణేశుడనే ఖగోళశాస్త్రజ్ఞుడిని పిలిచి 'అమావాస్యనాడు; ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు వుంటాయో' చెప్పమన్నాడు. రాజు అడిగిన ప్రశ్నకి గణేశుడు తెల్లముఖం వేశాడు. తను ఎన్నో ఖగోళశాస్త్రగ్రంథాలు చదివాడు, ఎన్నో పరిశోధనలు చేశాడుగాని, నక్షత్రాల సంఖ్యమాత్రం ఎంతో ఎందులోనూ లేదు. గణేశుడు వినయంగా నమస్కరించి 'ప్రభువులవారికి తెలియనిది ఏమీలేదు. ఇటువంటి గడ్డుప్రశ్నకి సమాధానం చెప్పడం మానవమాత్రుల తరంగాదు' అన్నాడు, రాజుతో. కాని రాజుగారు యిదేమీ వినిపించుకోలేదు. "పదిరోజులు గడువు యిస్తున్నాము. దీనికి సమాధానం చెప్పకపోతివా. నీ తలతీసి కోటగుమ్మానికి కట్టిస్తాము. తెలుసా!" అని శాసించాడు. సభలోనివారందరూ గణేశుడికి వచ్చిపడ్డ విషమపరీక్షకు విచారించారు. 'ఇక ఎలాగూ శిరచ్ఛేదనం తప్ప' దని కన్నీరు కారుస్తూ యింటికి వెళ్లిపోయాడు, గణేశుడు.

భర్త విచారంగా వుండటం చూచి గణేశుని భార్య 'కారణమేమి'టని ప్రశ్నించింది. గణేశుడు పట్టరానంత దుఃఖంతో జరిగినదంతా చెప్పేడు. ఆవిడ అంతావిని ఫక్కుననవ్వింది. 'నాప్రాణాలకిముప్పు వస్తే, నీకు నవ్వుగావున్నదా' అని భార్యపై మండిపడ్డాడు. ఆవిడ నవ్వాపుకుని "యీమాత్రందానికింత విచారపడాలిటండీ ! మీకెందుకు ! మీరు హాయిగా భోజనం చేసి పడుకోండి. పదిరోజులనాటి మాటగదా ! మీ ప్రాణాలకు నాప్రాణాలు అడ్డువేస్తాను; సరేనా!" అని భర్తని ఊరడించింది.

భార్య మాటలమీద అంతగా నమ్మకం కుదరకపోయినప్పటికీ 'విచారించి ఏం చేస్తాములే ! ఎలా జరగాలో అలానే జరుగుతుంది' అని గణేశుడు గుండెరాయిచేసుకున్నాడు.

తొమ్మిదిరోజులు గడిచిపోయి

నయ్. పదోరోజు తెల్లవారింది. ప్రొద్దున్నే ఏడుగంటలకల్లా దర్బారులో హాజరుకావాలి. గణేశుడి భార్య, భర్తకి అన్నీ సర్ది, దర్బారుకి వెళ్ళేందుకు సిద్ధంచేసింది. వెళ్లబోయేముందు భర్త చెవిలో ఏదో రహస్యంగా చెప్పింది.

గణేశుడు సంతోషంగా దర్బారుకి వెళ్లి, తన స్థానంలో కూర్చున్నాడు. గణేశుని జీవితం యివాళతో ఆఖరుకదా, చివరిసారి చూచి వెళ్దామని జనం తండోపతండాలుగా సభకు వచ్చారు. అందరూ సమయంకోసం ఎదురుచూస్తున్నారు.

రాజుగారు తన సందేహానికి గణేశుణ్ణి సమాధానం చెప్పమన్నాడు. అంతా నిశ్శబ్దంగావుంది. గణేశుడు లేచి 'ప్రభూ! నక్షత్రాలసంఖ్య మొత్తం ఏభైఆరులక్షలకోట్ల, తొంభైనాలుగులక్షల, ఎనభై తొమ్మిదివేల, అయిదువందల, నలభైవొకటి' అని చెప్పి కూర్చున్నాడు. రాజుతోపాటు అందరూ తెల్లబోయారు.

'దీన్ని ఎలా ఋజువుచెయ్యగలవు?' అని రాజు మళ్ళీ ప్రశ్నించాడు. గణేశుడు సవినయంగా, 'ఏలినవారికి నమ్మకం లేకపోతే, మరెవరిచేతనైనా లెఖ్కపెట్టించుకోవచ్చును' అన్నాడు. కాని నక్షత్రాలని ఎవరు లెఖ్కపెట్టగలరు? 'మావల్ల కా'దన్నారు అందరూ. రాజుగారు గణేశుడు చెప్పినదాన్నే నమ్మాల్సివచ్చింది. గణేశుని సామర్థ్యానికి మెచ్చి రాజు ఎన్నో కానుకలిచ్చి సత్కరించాడు.

★





డాన్ క్విక్ సెట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికిచెందిన డాన్ క్విక్ సెట్ అనే వెర్రి వెంగళప్ప ఒకడు తనుకూడా ఒకవీరుడు (నైట్)గా పేరుపొందాలని వుబలాటపడి, 'రోజినాన్టి' అనే ఒక కుంటిగుర్రాన్ని ఎక్కి బయలుదేరాడు. ఒకానొక స్త్రీమూర్తిని ఎంచుకొని ఆమెకుతానే 'డల్ సీనియా' అనేపేరు పెట్టుకొన్నాడు. ఆమెమన్నన సంపాదించటం కోసమే తాను ధర్మరక్షణమనే కఠోరదీక్ష స్వీకరించానని నమ్మాడు.

ఏవేవో వెర్రివెర్రి ఆశలుచూపి శాంకోపాంజా అనే ఒక అమాయకపు కూలీని తన బంటుగా చేసుకొన్నాడు వాడు 'డాపుల్' అనే ఒక గాడిదనెక్కి యీయన వెనకాలే బయలుదేరాడు. ఒకటి రెండు చోట్ల డాన్ క్విక్ సెట్ ఏవేవో సాహసకార్యాల చేయబోయాడు. ప్రతిసారి చావుదెబ్బలు తిన్నాడు.

ఒకరోజు ఒక మైదానంగుండా పోతుండగా దుమ్ము అంతఎత్తున లేచి పెద్ద మేఘంలా వీళ్ల కంటబడింది. అవేవో పెద్ద సేనాసమూహాలను భ్రమించిన డాన్ క్విక్ సెట్ ఆ మేఘంవస్తున్నవైపుకు విరుచుపడ్డాడు. తీరాచూస్తే అవి సేనలుకావు! కొన్ని గొర్రెల మందలు. మందగావస్తున్న గొర్రెలనన్నిటినీ చెదరగొట్టినందుకు గొర్రెలకాపురులు యీయనను రాళ్లతోకొట్టి, గుర్రంమీదనుంచీ పడగొట్టారు. అప్పటికప్పుడే ఎంతో ఆకలితో కుమిలిపోతున్న యీ యిద్దరూ ఎట్లాగో కాలు చెయ్యీకూడ దీసుకొని, మళ్ళీ ప్రయాణం సాగించారు

౩

శాంకో పాంజాకు, డాన్ క్విక్ సెట్ కు—యిద్దరికీ కరకర ఆకలివేస్తున్నది. ఏవో తినటానికివున్నాయి కదా అనుకొంటే, అవివున్న గోనె కాస్తా పోయింది; పోనీ డబ్బైనావుంటే ఎక్కడో ఒకచోట ఏదైనా ఒకటి కొనుక్కొనే తిని వాళ్ళేమో కానీ, ఆ డబ్బుల సంచీకి అంతకుముందే వుద్వాసన అయిందాయెను. ఇంకేం చేస్తారు? ఇద్దరూ ముఖాలు వేలవేసి ఎట్లాగో ప్రయాణం చేస్తున్నారు. ఎక్కడైనా ఒక ఆశ్రయం దొరక్కపోతుందా అనే ఆశతోనే యిద్దరూ ఆకలికి కడగొట్టుకు పోతున్న ప్రాణాలను ఎగిరిపోకుండా పట్టుకు వుంచుకో గలిగారు.

అట్లా ఎంతో దూరం ప్రయాణం చేశారు. ఎంత దూరం ప్రయాణంచేసినా వీళ్లకు పని కల్పించే వాడు ఒక్కడూ కనుపించలేదు. అసలు ఆ చుట్టు పట్ల ఎక్కడా మనుష్యసంచారమైనా వున్నట్లు తోచలేదు. ఇక యిప్పటిలో తినటానికి ఏదీ దొరకదు కాబోలని యిద్దరికీ అధైర్యం తోచింది. ఇద్దరికీ శోష వచ్చేస్తున్నట్లే అనిపించింది. ఒక్కడూ నోరు తెరిచి మాట్లాడలేకుండా వున్నాడు. ఆ గుర్రము, గాడిద మాత్రం వాటి మానాన అవి జోగుతూ పోతూనే వున్నాయి. అలా పోగాపోగా, కొంతసేపటికి చీకటి కూడా పడిపోయింది. ఇంకా కొంతసేపు ప్రయాణం చేశాక దూరంగా చీకటితెరలలో కదులుతున్న దీపాలు కొన్ని వీళ్ల కంటపడ్డాయి.

ఒంట్లో ఎంత ఓపిక లేకపోయినా, సాహస కార్యంపేరు చెప్పేసరికి డాన్ క్విక్ సెట్ గారికి వళ్లూపై తెలియదాయె! ఇంకేం—ఆ దీపాలు కదులుతున్న వైపుకు గుర్రాన్ని పోనిచ్చాడు. గబగబాపోయి ఆ వూరేగింపు నట్టనడాన గుర్రాన్ని నిలిపేసి, ఆ వూరేగింపులో వున్న వాళ్ళందరినీ వురిమిచూసి, ఒక్కొక్కడూ యిలా తనముందుకు వచ్చి నిల్చొని తన పేరేమిటో, ఏపనిమీద పోతున్నాడో అదంతా తనకు నివేదించుకోవాలని హుకుం హుంకరించాడు.

ఇంతకీ ఆ వూరేగింపు ఏమిటో తెలుసా! ఎవరో ఒకాయన చచ్చిపోతే, ఆయనతాలూకు అంత్యక్రియలు జరిపేటందుకు కొందరు మతబోధకులు, మరి కొంతమందీ, దీపాలు పెట్టుకొని పెద్ద వూరేగింపుగా నడిచిపోతున్నారు. ఎవరైనా చచ్చిపోతే,

అనువాదం: శ్రీ విశ్వాత్మల నరసింహమూర్తి

డబ్బు పుచ్చుకు గంటల తరబడి ఏడ్చేకూలీలు కొందరుంటారు. ఇలాటి కూలీలు కూడా ఒక పదిమంది దాకా యీ వూరేగింపులో వున్నారు.

ఈ వూరేగింపు చావుకు సంబంధించినది కావటంచేతా, అందులోనూ అప్పటికే బాగా చీకటి పడిపోయివున్నందువల్లా, వీళ్లందరి మనసులూ అసలే బిక్కు బిక్కు మంటున్నాయి. వాళ్లాస్థితిలో ప్రాణాలు వుగ్గబెట్టుకువుంటే, డాన్ క్వెక్ సెట్ గారు యిలా అర్ధాంతరంగా ఎక్కడినుంచో వూడిపడి దిక్కులు పిక్కటిల్లేలా అరపులు అరిచేసరికి వాళ్లకు నవనాడులూ క్రుంగిపోయాయి. ఈయనగారి ఆకారం అదీ చూసి, ఏదో దిష్టిబొమ్మకు ప్రాణంవచ్చి యిలా కవచం, టోపీ తగిలించుకు, యీ కొ పుచ్చుకు తమపైకేమన్నా వచ్చిందేమో నని వాళ్లు అనుమానించారు. ఈ వీరుడి వెనకాల యింకా ఎన్ని యిలాంటి ఆకారాలు వస్తున్నాయోననే అనుమానం వాళ్ల మనస్సుల్లో ఒక్కసారిగా మెదిలింది. ఇక అంతే—ఒకళ్ల కాళ్లకి యింకోళ్లు అడ్డం పడుతూ, అందరూ తలాఒక దిక్కు పరుగెత్తారు. ఈ త్రోక్కులాటతో ఆచోటు చోటంతా చితచితలాడి పోయింది. ఎవళ్ళదారి వాళ్లు చూసుకోవటంలో, తిను బండారాలు మోసుకు వస్తున్న ఒక గాడిద విషయం ఎవరూ పట్టించుకోనే లేదు. ఆ గాడిద అంత బరువుతోనూ కదలలేక అక్కడే నిలుచుండి పోయింది. ఇది ముందుగా శాంకో పాంజాగాడి కంటబడింది. క్షణమైనా ఆలస్యం చేయకుండా వాడు గబగబా పరిగెత్తుకొంటూ వచ్చి, ఆ గాడిదమీదవున్న మూటలన్నీ దించేసి, అందులోని సరుకు అంతా తన పైగుడ్డలో మూటలు కట్టేశాడు.

ఎట్లాగైతే నేం—తినటానికి యింత తిండి దొరికింది. శాంకో పాంజాకు ఎక్కడలేని సరదా పుట్టుకొచ్చింది. అంతపెద్ద వూరేగింపు వుంటే, అందులో ఒక్కడైనా నిలిచివుండకుండా అందరూ డాన్ క్వెక్ సెట్ గారి అదిలింపుకే ఝడిసిపోయి, పిక్కబలం చూపించేశారు. ఇంత అవలీలగా వాళ్లందరినీ బెదరగొట్టినందుకు తన యజమానిని కాస్త పొగుడుదామని వీడికి అనిపించింది. ఆ సంతోషంలో వాడు ఆయనను ఒక పేరుపెట్టి పిలిచాడు. డాన్ క్వెక్ సెట్ గారు ఆ పేరుకు ఎంతో మురిసిపోయి, ఆక్షణంనుంచీ తాను ఆ పేరుతోనే వ్యవహరించబడుతానని ప్రతిజ్ఞ పట్టాడు. ఇంతకీ వాడు పెట్టిన పేరేమిటో తెలుసా? ఆ వూరేగింపులోని వాళ్లు ఒక్కళ్లైనా మిగలకుండా అందరూ తలా ఒక దిక్కుగా పారిపోతుంటే, వాళ్లకు వినిపించేలా "ఓ పిరికిపందలారా! మీ కీనాడు బుద్ధిచెప్పిన వీర శిఖామణి పేరేమిటని ఎవరైనా అడిగితే ప్రపంచఖ్యాతిగాంచిన 'భీకరానన వీర శూరాగ్రేసరుడు' డాన్ క్వెక్ సెట్ గారని చెప్పకొండి" అంటూ శాంకోపాంజాగాడు బిగ్గరగా అరిచాడు.

తనను 'భీకరాననుడని' శాంకోపాంజా అంటూవుంటే, డాన్ క్వెక్ సెట్ గారికి చప్పట్లుచరుస్తూ, గంతులు వెయ్యాలన్నంత సంతోషం వేసింది.

శాంకో పాంజాగాడి వీపుమీద పెద్దగా చరిచి "నా ముద్దుల శాంకో! నాకు 'భీకరానన వీరశూరాగ్రేసరుడ'ను యీ బిరుద మీయవలెనని నీకు ఎట్లు తోచినదో, ఆ తెరగంతయు వినిపింపుము." అంటూ అమందానంద కందళిత హృదయారవిందుండై, నెమ్మోమున చిరునగవులు దోప, అడిగాడు.

"ఆ లైట్ల వెలుగులో చూస్తుంటే మీ ముఖం భయంకరంగా వున్నట్లు నాకే తోచింది. అలా ఎందుకు తోచిందో ఆ కారణాలు మాత్రం నేనూహించలేను. బహుశః మీనోట్లో ఒక్క పన్ను అయినా మిగలకుండా వూడిపోయి వుండటమే కావచ్చు; లేదా యీ వీర విహారాలతో మీ ప్రాణం అలిసి సొలిసివున్నందు వల్ల కూడా కావచ్చు. మొత్తానికి ఆ దీపాల వెలుతురులో మీముఖం చూస్తుంటే, నాకెందుకో భయంకరంగా కనుపించింది" అని శాంకో పాంజా గుడ్లు తిప్పుకొంటూ చెప్పుకొచ్చాడు.

ఇంతలో డాన్ క్విక్ సెట్ గారు వాడి ధోరణికి అడ్డంవచ్చి "నిలు, నిలుమా శాంకో! నా నెమ్మోము భయంకరముగా తోచుటకు కారణము నీవూహించిన వేవియును కాదు. వెనుకటి వీరులలో ప్రతి ఒక్కరికిని యివే మాదిరి బిరుదములుండెడివి. వీరాభిషిక్తుడనై యున్న నాపై, ఎవరో ఋషిపుంగవుడు కనికరించి, తన యంశమును నీలో ప్రవేశపెట్టి, నాకీ బిరుదమును ప్రసాదించినాడు. ఇందులకు సందియములేదు. ఇకపై 'భీకరానన వీరాగ్రేసర డాన్ క్విక్ సెట్'గారనియే పిలిపించుకొందును." అన్నాడు.

తిండి దొరికినందుకు శాంకో పాంజాకు, బిరుదు దొరికి నందుకు డాన్ క్విక్ సెట్ గారికి, వళ్లు పరవశమైపోయింది. ఇద్దరూ ఏవేవో తీయ తీయని కబుర్లు చెప్పుకొంటూ అలాగే ప్రయాణాలు కొనసాగించారు.

అలా పోగాపోగా, విశాలమైన మైదానంలో తేలారు. అప్పటికి ఎంతో సేపటినుంచి విడవకుండా ప్రయాణం చేస్తున్నారేమో యిద్దరికీ కాసేపు విశ్రాంతి తీసుకొందామనిపించింది. 'రోజినాన్ టీ'ని, 'డాపుల్'ను యథేచ్ఛగా వదిలేసి యిద్దరూ పచ్చగడ్డిమీద కూలబడ్డారు. శాంకోపాంజాగాడు కైంకర్యం చేసిన బోపతు తినుబండారాల మూట, గాడిద వీపుమీద నుంచీ దించి, యిద్దరూ తిండికి ఎగబడ్డారు. ఒకళ్లకు ఒకళ్లు ఎదురు బొదురుగా కాళ్లు బారచాపుకుకూర్చొని, మూటలో చేతికి అందిన దినుసునల్లా బొక్కటం మొదలుపెట్టారు. ఎంత ఆకలి అవుతున్నదో ఏమో, యిద్దరు తెగమేశారు. కడుపు నిండేసరికి యిద్దరికీ కునుకు పట్టింది. అక్కడే ఆగడ్డిలోనే నడుములు వాల్చి నిద్రకు పడ్డారు.

తెల్లవారింది. ఇద్దరూ మళ్లీ వాహనాలను వెతుక్కొని వచ్చి, వాటి మూపులపై ఎక్కి మళ్ళీ ప్రయాణం సాగించారు. ఆట్టేదూరం పోకముందే బలే గమ్మత్తైన విషయం ఒకటి జరిగింది.

పది గజాలైనా పోయారో లేదో, యింతలో అల్లంతదూరాన, డాన్ క్విక్ సెట్ గారి కంటే వింత అయిన ఆకారం ఒకటి వీళ్ల కంటబడింది. ఆ ఆకారం గాడిదనెక్కి వీళ్లవైపే వస్తున్నది. ఇంకొంచెం దగ్గిరకు వచ్చాక గాడిదమీద వున్న ఆ ఆకారం ఒక పురుషుడి దైనట్లు తోచింది. వాడి నెత్తిమీద ఏదోవస్తువు ఆ నీరెండలో బంగారంమల్లే మెరుసిపోతోంది.

డాన్ క్విక్ సెట్ గారు వీరగాథలన్నీ కంఠస్థం చేసినవాడు కదూ! ఎదురుగుండా వస్తున్నవాడు, తళతళాబంగారంలా మెరిసిపోతున్న శిరస్త్రాణం ధరించి వుండటాన్ని గమనించేసరికి, యీయనకు మూర్ దేశపు రాజు మేంబ్రినో కథ చప్పున జ్ఞాపకానికి వచ్చింది. ఆ కథలో మేంబ్రినో రాజు యిలాటిదే ఒక బంగారపు టోపీని ఎన్నో సాహసకార్యాలు చేసి సంపాదించాడు. ఆ బంగారపుటోపీ కూడా మాంచి మహాత్తువున్న టోపీ. అది ఎవడి తలమీద వుంటే, వాడిని ఎవరూ ఏవిధంగానూ ఓడించలేరు. ఈ బంగారుటోపీ కథ జ్ఞాపకానికి రాగానే, డాన్ క్విక్ సెట్ గారు, ఆమహత్తుగల టోపీ యిప్పుడు యీరూపేణా తన వళ్లోకి వచ్చి పడుతున్నదని సంబరాలు పడ్డాడు. అప్పటికప్పుడే తాను టోపీని వూడలాక్కొన్నట్లు, చెడామడా యుద్ధాలుచేసి ఎంద రెందరో రాజుల్ని, మహారాజుల్ని జయించి పారేసినట్లే వూహించుకొన్నాడు.

"శాంకో! శాంకో! వాహనమెక్కి మన వైపునకే వచ్చుచున్న ఆ వీరుని గాంచితివా? ఆతని శిరస్త్రాణమును గమనించితివా! అది సువర్ణరత్న ఖచితమైన 'మెంబ్రినో' రాజుగారి కిరీటము. నేనిదే ఆ

వీరుని పుక్కుడచి ఆ కిరీటమును పొందెదగాక! ఇకపై భీకరానన వీరశూరాగ్రేసరుడు డాన్ క్విక్ సెట్ గారు అజేయులు!" అంటూ ఆకాశంవైపు చేతులు చాచి గొంతెత్తి అరిచాడు.

"స్వామీ! మీరు పొరపడుతున్నట్లున్నారు. తొందరపడకండి. నాకంటికి, గాడిద నెక్కి వచ్చుచున్న వ్యక్తి ఎవరో సాధారణ వ్యక్తికి మల్లే తోస్తున్నాడు. అతడు నెత్తిన ఏదో మెరిసే పాత్రను బోర్లించు కొన్నట్లున్నాడు." అని మాత్రం శాంకోపాంజా అన్నాడు. తాను అనే మాటలు తన యజమాని ఎలాగూ ఖాతరు చెయ్యడని వీడికి తెలుసు. అయినా, అని చూద్దామని ఆ మాటలు అన్నాడు.

శాంకోపాంజా అనుమాన పడ్డం తపనీ అయింది. వీడి మాటలు వినీ వినకుండానే, డాన్ క్విక్ సెట్ గారు మండిపడ్డారు. "అది మెంబ్రినో రాజుగారి కిరీటము. ఇందిసుమంతయు సందియము లేదు. నీవు మాత్రము యిటనే నిలచియుండుము. ఇప్పటికి ఎన్నియో సంవత్సరములుగా వేచియున్న యవకాశ మిప్పుడు నాకు లభించుచున్నది. నేనొంటరిగా పోయి నా చిర వాంఛిత మీడేర్చుకొందుగాక!" అంటూ గుర్రాన్ని అదిలించి, యీటె తిప్పుకొంటూ ముందుకు చొచ్చుకుపోయాడు.

అవతల మనిషి బాగా చెయ్యి వాటు దూరంలోకి వచ్చాక "తుంటరీ, నిలువు మందే! అడ్డుగైన ముందుకు వేసితివా, నీ ప్రాణములు నీవి కావు. వీరధర్మములరీత్యా నాకు సక్రమించవలసిన ఆ బంగారు కిరీటమును నాకు మర్యాదగా అప్పగించి వేయుము." అంటూ డాన్ క్విక్ సెట్ గారు వాడిని సవాలుచేశాడు.

ఉరమని పిడుగులావచ్చిపడ్డ యీ భీకరాకారాన్ని చూచి అవతలిమనిషి కంగారెత్తిపోయాడు. అసలు వాడొక మంగలి. తన వృత్తిలో నిత్యం అవసరమయ్యే యిత్తడి నీళ్ళబొచ్చెను, తలమీద బోర్లిం



చుకు వస్తున్నాడు. వాడు యీమధ్యనే కొత్త టోపీ ఒకటి కొనుక్కొన్నాడు, అది ఎండకు ఎక్కడ పాడై పోతుందోనన్న దిగులుకొద్దీ, దానికి ఆచ్ఛాదనంగా యీ యిత్తడి బొచ్చెను నెత్తిమీద బోర్లించుకు వస్తున్నాడు. ఆ బొచ్చెను చూసే, డాన్‌క్విక్‌సెట్ గారు బంగారుకిరీటమని భ్రమపడ్డాడు.

డాన్ క్విక్‌సెట్ వాడి గుండెలమీదికి యీటె గురిపెట్టి, చంపేస్తానంటూవుంటే వాడికి నిజంగా హడలెత్తిపోయింది. ఎటు తప్పించుకోటానికీ దిక్కు తోచక, వాడు గాడిదవీపుమీదనుంచి, చలిమిడి వుండ జారినట్లు జారిపోయి, కాలికొద్దీ పరుగు లంకించుకొన్నాడు. కొంతదూరం పరిగెత్తాక వెనక్కు తిరిగి చూస్తే, డాన్ క్విక్‌సెట్‌గారు గుర్రంమీద తరుముకు వస్తున్న దృశ్యం కనుపించింది. ఈ యిత్తడి బొచ్చె మూలంగాకదా, యింత ప్రాణంమీదికి వచ్చిందని, ఆ బొచ్చెను తలమీదినుంచీ తీసి అక్కడే పారేసి, తన దారిని తాను పరుగెత్తేశాడు.

డాన్ క్విక్‌సెట్ గారు గబగబా వచ్చి, గుర్రాన్ని రక్కన ఆపేసి, దిగివచ్చి ఆ బొచ్చె పడి వున్నచోట మోకరిల్లి, దాన్ని రెండు చేతులతోనూ పైకియెత్తి, ఎంతో భక్తిగా కళ్లకు అద్దుకొన్నాడు. తీరాకళ్లు తెరిచిచూస్తే, ఆబొచ్చె చుట్టూ వుండే అంచు ఎక్కడ పడిపోయిందో, అసలు కనుపించనే లేదు. ఈ కిరీటం రాక రాక తనచేతికి వస్తే, సరిగ్గా యీ సమయానికే యిందులో సగభాగం యిలా వూడిపోవటం చూస్తే డాన్ క్విక్‌సెట్‌గారికి ఏడుపువచ్చింది. ఈ కిరీటం యిలా పాడుకావటమనేది కూడా, వుడుకుమోతు మాంత్రికు డెవ్వడో మాయచేసినందువల్లనే నని తనకు తను సమాధానం చెప్పుకొని, కొంత వూరట పడ్డాడు. ఆ అర్ధ కిరీటాన్నే తగిలించుకు తిరుగుతానని పంతం పట్టాడు.

నెత్తిమీద అప్పటికేవున్న బరువు చాలక యీ జోడి బొచ్చెను కూడా తగిలించుకొన్నాడు. ఈలోగా శాంకో పాంజా కూడా గాడిదను ఎక్కి నింపాదిగా వచ్చి యీయనను కలుసుకొన్నాడు. ఇద్దరు మళ్ళీ ప్రయాణం సాగించారు. దారిపొడుగునా యీ నవరత్నఖచిత సువర్ణకిరీట ప్రభావాన్నిగురించి డాన్ క్విక్‌సెట్‌గారు ఆమందకొడి మనిషికి వేయికథలు చెప్పాడు. వీరుల వూసు ఎలాగూ వచ్చిందికదా అని, మునుపటి కథలలోని వీరులకు ఎలాంటి ఎలాంటి దివ్యసత్కారాలు జరిగాయో, అలాంటివే యీ భీకరానన వీరశూరాగ్రేసర డాన్ క్విక్‌సెట్‌గారికీ, వారి అనుంగు భృత్యుడైన శాంకో పాంజాగారికి అనతికాలంలోనే జరుగబోతున్నాయని వీడిని తెగ వూరించాడు.

(ఇంకావుంది)

పాటలునేర్పిన పెళ్ళాం

(25-వ పేజీ తరువాయి)

వచ్చింది. నిలదీసి అడిగాను; "నీకీ డబ్బు ఎలా వచ్చిందో చెప్పమని."

"ఆడదానికంటె ఎక్కువ భయమైతే ఎట్లాగండీ! బొంగురు గొంతుక పెట్టి తాళంచెవు లిమ్మని గద్దిస్తే, తాళాలు యిచ్చెయ్యటమేనా!"

"ఏమిటీ, తాళాలు యిమ్మన్నది ఆ దొంగకాదూ?"

"ఏబ్బే! నేనేనండీ. మీ కెంత ధైర్యం వుందో చూద్దామని గొంతు మార్చి నేనే గద్దించాను."

"అయితే మరి, దొంగ ఏమైనట్లు?"

"ఏమైనాడు? మీరూ నేనూ కదులుతూవుండటంచూసి వుడాయించాడు. మీరింత పిరికివాళ్లని తెలిస్తే లోపలికే వేంచేసేవాడు."

"చాల్లే నీవేళాకోళం." అంటూ అక్కడనుంచీ లేచి యివతలకు ఒచ్చేశాను. ★

సంసారపు గొడవలు

(21-వ పేజీ తరువాయి)

"పెద్దవారము మనమే అల్లా అంటె సంసారము ఎలా జరగాలో మీరే ఆలోచించండి. కొత్తపిల్ల. మనమే నెమ్మదిగా చెప్పి చేయించుకోవాలిగాని."

"అల్లా అయితే అనుకోవాల్సిన పనేముంది? నే చెప్పినా చేస్తుందా? దాని యిష్టమైతే తప్ప! మొన్న భాగవతము వినాలని బుద్ధిపుట్టింది. కాని పాడు కండ్లకు మసక లొకటి వచ్చిపడినై. దాన్ని పిలిచి ఏమే కమలా భాగవతము కొద్దిగా చదువు తావాఅంటే యేమందో చూచారూ! భాగవతమెందుకూ బాపిరాజుగారు రచించిన హిమబిందు చదువుతున్నా వినండి అని చెప్పింది. వినాశకాలే విపరీత బుద్ధి అని చూచారూ దానిపోకడలూ బుద్ధులూ అదీనీ. నా యీడుకుతోడు నేను నవలలు వినాలట చూడండి రామమ్మగారు! ఏమన్నా భయముండేనా యిట్లా చెప్పటం? నాతోనా పరాచికాలు! నాకు వళ్ళు మండిందంటే నమ్మండీ. నోటిమీద వాతపెడదామనుకున్నా యిల్లాంటి కూత లెప్పుడూ కూయకుండా. దానమ్మకడుపు కాల, చిన్నా పెద్దా తారతమ్యముండొద్దండీ మాట్లాడేటప్పుడు."

"ఏదో చిన్నమాటలు లెండి. అవన్నీ మనస్సులో పెట్టుకుంటే యెలాగండీ? కొత్తప్పుడు నాకోడలు గూడా యిదే ఫక్కీ. మెల్లి మెల్లిగా వాళ్ళకే తెలుస్తుంది పెద్దలవద్ద యెల్లా మాట్లాడాలో; సంసారాన్ని యెలా పొదుపుగావాడాలో."

"కనే కోడలుంటె వద్దనే అత్త వుంటుందండీ" ఆదంతా మీ పిచ్చిగాని. అది తెలివిగా సంసారాన్ని జరుపుతుంటె యేదో కృష్ణారామా అంటూ కూర్చొనేదాన్నిగా. వట్టి తెలివితక్కువ దద్దమ్మ, దుబారామనిషి, మొద్దురాచ్చిప్ప" నేనీ నడుమ మద్రాసు వెళ్లాలేండి. మాతమ్ముడు యెన్నిరోజులనుండో రమ్మనమని వుత్తరాలు వ్రాస్తున్నాడు. నాకు తీరికేదండి! అస్తమానము యింటిగొడవె! వెధవగొడవ. వెళ్లానేగాని యిల్లేమై పోతుందోనని వకటే భయం. నే ననుకున్నంతా జరిగింది. ఏం జెప్పనండి రామమ్మగారు? మనకరివేపాకుచెట్టుముప్పాతికవంతు ఆకులేకుండాపోయింది. నా ప్రాణంతో సమానంగా పెంచానని మీకు గూడా తెలుసుగా? యేదో మీబోటి తెలిసినవారికి మినహా మరెవ్వరికీ పెట్టను, చెట్టు పాడైపోతుందని దాన్ని కిలిచి ఏమే కమలా చెట్టున ఆకే లేదేమె! అంటె, ఏమి సమాధాన మిచ్చిందో విన్నారూ? 'కరివేపాకు ఏమి భాగ్యముతే అత్తయ్యా అదే మరల ఆకువేస్తుంది. మరి వాళ్ళు అడిగినప్పుడు యెల్లా లేదనమంటారు?' ఆమెగారేమొ మహాదాత, నే నేమొ పిసనారినైనట్లు అందరు అనుకోరండి? అయినా వున్నదని అడిగినవారందరకూ పెట్టుకుంటూరా? ఇంక ఈ సంసారము ఏమి బాగుపడుతుందో మీరే చెప్పండి రామమ్మగారు.'

'మామ్మా అన్నంపెట్టవూ! అంటూ రామమ్మ మనుమరాలు వచ్చింది.'

'వస్తానండి సుబ్బమ్మగారు. అమ్మాయికి అన్నంపెట్టాలి. సంసారంలో ఇల్లాంటి గొడవలు వుంటూనే వుంటవి. అయినా మీబోటి పెద్దవారికి చెప్పాల్సిన పనేముంది లెండి.'

'రేపూ రామ్మా. యేదో మీబోటివారు రావటంవల్లనే కాస్తంత కాలక్షేపం జరుగుతుంది. అది మాట్లాడితే దాని నోటి ముత్యాలేమన్నా రాలిపోతాయా! పొద్దస్తమానం ఏవో పుస్తకాలు చదవటంతప్ప కాసేపైనా నాతో కులాసాగా మాట్లాడదండి. మరి అదేం పాపమో కాని. దానికి నేనేం అపకారం చేశానని. యేదో అనుకున్నప్పుడనుకున్నా తరువాత మాట్లాడగూడదు? వెళ్ళమ్మా వెళ్ళు. అమ్మాయికి యెంతగా ఆకలి వేస్తోందో? ఈ గొడవ యెప్పుడూ వున్నదేగా!' ★



మినర్వా మువిటోన్ వారి టెక్నికలర్ చిత్రం "ఝాన్సీకీ రాణీ"లో ఝాన్సి లక్ష్మీబాయిగా

మెహతాబ్

చిత్రాలకు రాబడి తగ్గుతోంది

నిమా చిత్రాలకు రాబడి తగ్గిపోతోందనే ప్రకటనలు ఈ మధ్య ఎక్కడ చూసినా ఎక్కువవుతున్నాయి. భారతీయ చిత్రాలు ప్రదర్శించబడే హాళ్ళలో నూటికి 25 వంతులు, విదేశీయచిత్రాలు ప్రదర్శించబడే హాళ్ళలో నూటికి 33 వంతులు రాబడి పడిపోయిందని అంచనాలు వేయబడినాయి. కొత్తగా విడుదలఅయిన హిందీ తమిళచిత్రాలు మరీ అద్భుతంగా ఉంటే తప్ప సాధారణంగా మొదటివారంలోనే పై తరగతిటిక్కెట్లు పల్చబడిపోవటం జరుగుతోంది. మద్రాసుకు వచ్చే హిందిచిత్రాలన్నీ వరసగా దెబ్బతింటున్నాయి. తమిళజనాభా ఎక్కువ గనక తమిళచిత్రాల గతి అంత అధ్వాన్నంగా లేదు. అయినా 'కాంచన' 'లవ్' మొదలైన చిత్రాలు స్వల్పకాలంలోనే ఎత్తివేయబడటం కనిపిస్తోంది. అదే రెండుమూడేళ్ల కిందట అయితే తమిళచిత్రాలు నెలల తరబడి నడిచేవి.

ఈపరిస్థితికి రకరకాల కారణాలు చెప్పబడుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనీ, ఆర్థికమాంద్యం మూలంగా నిరుద్యోగసమస్య ప్రబలిందనీ, పూర్వకాలంలో లాగ ప్రజలు వినోదం కోసం డబ్బు తగలేసే స్థితిలో లేరనీ కొందరంటున్నారు. యుద్ధకాలంలో నిగతా వస్తువుల కొరతమూలంగా ప్రజలు కొనాలన్న వస్తువులు కొనుక్కోలేక పోయారు. అందుచేత సినిమాలకు పెట్టగల డబ్బు వారిదగ్గర ఉండేది. అందుచేతే ఆరోజుల్లో సినిమాలకు బాగా డబ్బు వచ్చేదని కొందరంటున్నారు.

టిక్కెట్ల ఖరీదులు రెండుమూడింతలు పెరగటం మూలాన ప్రేక్షకుల సంఖ్య, ముఖ్యంగా పై తరగతులకు వెళ్లేప్రేక్షకుల సంఖ్య తగ్గుతోందని కొందరంటున్నారు. ఈ వాదాన్ననుసరించే బొంబాయిలోను, బెంగుళూరులోను కొన్ని సినిమా హాళ్ళవారు పై తరగతుల రేట్లను తగ్గించారు. తగ్గించినతరవాత మొత్తం రోజువారీ వసూళ్లు పెరుగుతున్నాయని కూడా అంచనా వేయబడింది.

ప్రభుత్వం సినిమాపరిశ్రమమీద రకరకాల పేర్లతో పన్నులు వేసి మొత్తం రాబడిలో నూటికి 60 వంతులు పిండుకుంటున్నదనీ, మిగిలిన 40 వంతులలో అత్యధిక భాగం డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు పోగా ఏ అయిదారు వంతులో నిర్మాతలకు మిగిలి చిత్రనిర్మాణవ్యయమైనా భర్తీకావటం లేదని నిర్మాతలు వాదిస్తున్నారు. టిక్కెట్ ఖరీదులో నూటికి 25 నుంచి 60 వంతుల వరకూ కూడా వినోదంపన్ను కొన్నికొన్ని చోట్ల రాష్ట్రప్రభుత్వాలు వసూలుచేయటం మూలంగా టిక్కెట్ ఖరీదును పెంచవలసి వచ్చిందనీ, ఇందుమూలంగా ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోందని, ముఖ్యంగా వినోదం పన్నును బాగా తగ్గించాలనీ కూడా వీరు వాదిస్తున్నారు.

ఫిలిం విమర్శకుల నడిగితే ఇప్పటి చిత్రాలు పూర్వపు చిత్రాలలా లేవు; బాగా పతనమైనాయనీ అంటున్నారు. హాలీవుడ్ చిత్రాలను అనుకరించి, పాశ్చాత్యసంగీతం, నృత్యాలు, ఆచారాలు ప్రవేశపెట్టి మన చిత్రాలను సంకరం చేస్తున్నారనీ, ఇటువంటి చెత్తచిత్రాలకు డబ్బు తగలెయ్యటానికి ప్రజలు ఇష్టపడటం లేదనీ వీరి వాదం.

చిత్రాలకు రాబడి తగ్గటానికి కారణంగా మరికొందరు ఆర్థికశాస్త్రంలోని "ఓవర్ ప్రొడక్షన్" సూత్రాన్ని ఉటంకిస్తున్నారు. యుద్ధానంతరం అన్ని పరిశ్రమలలోను ఉత్పత్తి పెరిగినట్లే సినిమా పరిశ్రమలో కూడా ఉత్పత్తి ఏటేటా పెరుగుతున్నది. చిత్రాల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో రెండోస్థానం ఆక్రమించింది. అమెరికా ఏటా 400 చిత్రాలు ఉత్పత్తిచేస్తే, భారతదేశం 250



"జాల్" చిత్రంలో గీతాబాలి.

దాకా ఉత్పత్తిచేస్తోంది. అయితే అమెరికన్ చిత్రాలకు ప్రపంచమంతటా మార్కెట్ ఉన్నది. అందుచేత అమెరికన్లకు ఉత్పత్తికి తగిన వినియోగం కూడా లభిస్తున్నది. అయితే ఎమ్. జి. ఎమ్. లాంటి కంపెనీలు కూడా ఇటీవల రాబడి తగ్గటంచేత ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అటువంటప్పుడు స్వదేశంలోనే తప్ప ఇతరదేశాల్లో చెప్పుకోదగిన మార్కెట్ లేని భారతీయచిత్రాలకు రాబడి తగ్గటంలో ఆశ్చర్యమేముంది? ఒక చిత్రంవెంట ఒక చిత్రం (దాదాపు, రోజున్నర కొక చిత్రం చొప్పున) తయారై విడుదల అవుతున్నది. ఇన్ని చిత్రాలకు తగిన మార్కెట్ మనదేశంలో లేదు. దేశంలో సుమారు మూడు వేల సినిమాహాళ్లు ఉన్నాయి. ముప్ఫయికోట్ల జనాభాకు మూడు వేల సినిమాహాళ్లు! అంటే ఉన్న హాళ్ళన్నీ పట్టణాల్లోనేగాని పల్లె ప్రాంతాల్లో శూన్యమన్నమాట.

పైన చెప్పబడిన ఈ కారణాలన్నీ కలిసి సినిమాపరిశ్రమమీద దెబ్బతీస్తున్నాయి. ఈ మధ్య విడుదలయిన చిత్రాల్లో నూటికి 95 వంతులు ఆర్థికంగా నష్టపోయాయి. చిత్రనిర్మాతలు ఎన్నిరకాల ట్రిక్కులు ప్రయోగించినా ప్రేక్షకుల సంఖ్య పెరగటం లేదు. ఇప్పుడు తాహతుగల నిర్మాతలు కొత్తరకం ట్రిక్కు (కలర్) ప్రయోగించాలని ప్రయత్నిస్తున్నారు. మహబూబ్, సొహ్రాబ్ మోడీ ఒకరు 50, ఒకరు 60లక్షలు ఖర్చుపెట్టి టెక్నికలర్ చిత్రాలు తీశారు. సాధారణంగా ఏ చిత్రానికయినా ఉత్పత్తి వ్యయం భర్తీకావాలంటే 4 రెట్లు ధనమయినా బాక్సాఫీసువద్ద వసూలుకావాలి. అంటే ఈ చిత్రాలు 2 కోట్లు, 2½ కోట్లు పుంజుకుంటేగాని వాటి డబ్బు వాటికి రాదన్నమాట. ఇవి టెక్నికలర్ రంగంలో మనకు ప్రథమ ప్రయత్నాలు కనక ప్రేక్షకులు వేలంవెర్రిగా వచ్చి చూస్తారనటంలో సందేహం లేదు. రంగుల చిత్రాలకు మనదేశంలో ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని సొహ్రాబ్ మోడీ కిందటి "ఫిల్మ్‌ఫేర్" సంచికలో ఆశాభావం ప్రకటించాడు. ఈ ఆశ సఫలమౌతుందో లేదో కాలమే నిర్ణయించాలి. కాని వట్టి రంగులతోనే సినిమాపరిశ్రమను ఉద్ధరించాలనుకోవటం భ్రమమాత్రమే అవుతుంది.

మనచిత్రాలస్థాయి పెరగటం ప్రథమావసరం. ఎప్పటికప్పుడు మారే ప్రజాభిరుచుల కనుగుణంగా నిర్మాతలు ఎప్పటికప్పుడు నూత్న పంథాలు అవలంబించాలి. టెక్నికల్ పరిణతితోపాటు ఎందుకోనే కథలలోను, కథాచిత్రణంలోను పరిణతి చూపించాలి. అతి స్వల్పవ్యయంతో, పురాతన పరికరాలతో అద్భుతచిత్రాలు నిర్మించే ఇటలీనుండి మనవాళ్ళు నేర్చుకోవలసినదెంతైనా వుంది. (ఇటీవల యూరప్ వెళ్ళి వచ్చిన నిర్మాత కర్దార్ ఒక చిత్రమైన మాట అన్నారు: "ఇటాలియన్లకు లేని సౌకర్యం ఒకటి మనకున్నది. ఇటాలియను సామాన్యప్రజల కథలే తీసుకుంటారు గనుక వారి సెట్టింగులు కూడా సామాన్యంగానే వుంటాయి. కాని మన కథలు బ్రహ్మాండమైన సెట్టింగులకు అనుకూలమైనవి." నిజానికి ఇటాలియన్లు సామాన్యప్రజల కథలు తీసుకోవటానికి కారణం పెద్ద సెట్టింగులకు అనుకూలించే కథలు కరువై కాదు. రోమన్‌చరిత్రకంటే సమృద్ధిగా కథలు సప్లయి చెయ్యగల చరిత్ర మరొకటి లేదు. వాస్తవజీవితాన్ని చిత్రించాలనే కాంక్షతోనైతే నేమి, తమది బీద దేశంగనక స్వల్పంలో తేలిపోవాలనే ఆశయంతోనైతే నేమి ఇటాలియన్లు సాధారణంగా సామాన్యప్రజల కథలనే తీసుకుంటారు.)

ఇదిలా ఉంచి మన సినిమాపరిశ్రమకు ప్రభుత్వం చెయ్యదగిన సహాయం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఫిల్మ్‌ఫెడరేషన్ కోరినట్లు కొత్తసినిమాహాళ్ళ నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. భవననిర్మాణసామగ్రి కొరతగా ఉన్నదనే కారణంచేత ప్రస్తుతం రాష్ట్రకేంద్రప్రభుత్వాలు కొత్త హాళ్ళ నిర్మాణానికి సహాయపడటం లేదు. అదీగాక రాష్ట్రకేంద్రప్రభుత్వాలు రెండూ వేరు వేరు పేర్లతో పన్నులు వసూలుచేసే విధానాన్ని మార్చుకోవాలి. నిర్మాతలమీద పన్ను వేసినా, డిస్ట్రిబ్యూటర్లమీద, ఎగ్జిబిటర్లమీద, ఎవరిమీద వేసినా ఈపన్నుల భారం యావత్తూ బాక్సాఫీసువద్ద టిక్కెట్టు రూపంలో ప్రేక్షకులమీదనే పడుతుంది. సినిమాచిత్రాలు చూడకుండా ప్రేక్షకులను నిరుత్సాహపరచినందువల్ల ప్రభుత్వానికిగాని, ఎగ్జిబిటర్లకుగాని, ఆఖరికి ప్రజలకుగాని ఒరిగేదేమీ లేదు. ★

సినిమా వార్తలు

జూలై 19 న విడుదలఅవుతుందని ప్రకటించబడిన ఈస్టిండియావారి "సంక్రాంతి" ఆఖరు నిమిషంలో నిలిపివేయబడింది. బహుశా ఈ చిత్రం జెమినీవారి "ముగ్గురు కొడుకులు" (ఆగస్టు 7 విడుదల) పూర్తిగా నడిచినతరవాత విడుదల కావచ్చునట. లేక "సంక్రాంతి" పేరు సార్థకమయ్యేందుకు వచ్చే సంక్రాంతికి విడుదల అవుతుందా?

* * *

రాజ్యం ప్రొడక్షన్సువారి "దాసి" రెండుభాషల్లో ఒకేసారి తయారు అవుతున్నది. ఇటీవల రేవతి స్టూడియోలో ఒక సెట్‌మీద షూటింగ్ జరిగింది. ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, లక్ష్మిరాజ్యం, ఎస్. వి. రంగారావు, రేలంగి, శివరావు, శ్రీవత్స, దొరస్వామి, శాంతకుమారి, కనకం, వసంత, హేమలతమ్మారావు మొదలైన ప్రముఖ నటీనటులు పాల్గొంటున్నారు. దర్శకుడు సి. వి. రంగనాథదాసు; పర్యవేక్షణ ప్రసాద్. సంగీతం కీ॥ శే॥ సి. ఆర్. సుబ్బరామన్. సుబ్బరామన్ పరమపదించారు కనుక దక్షిణామూర్తిగారిని సంగీతదర్శకుడుగా నియమించాలని రాజ్యంపిక్చర్సువారు ఆలోచిస్తున్నారు.

* * *

భానుమతి డైరెక్టుచేస్తున్న "చండీరాణి" కొన్ని దృశ్యాలు షూట్ (సెవ్ఫ్యాన్‌లో) చేయబడినవట. భానుమతి ఇటీవల అస్వస్థతతో ఉన్న కారణంగా తాత్కాలికంగా నిర్మాణం ఆగినది. "చండీరాణి"కి ఫొటోగ్రఫీ నిర్వహిస్తున్న కమల్ ఘోష్ స్థానంలో చెల్వరాజ్ నియమించబడినాడట.

* * *

అవర్ ఇండియావారి "నాయిల్లు" ఇప్పటికి 12 రీళ్లవరకూ తయారైనది...టి. కె. ప్రొడక్షన్సువారి "పాలేరు" జంపనవారి "మేనరికం" షూటింగ్ ఇటీవల తిరిగి ప్రారంభమైంది.....విజయావారి "చంద్రహారం" షూటింగ్ కొన్నిరోజులనుండీ కొత్త సెట్టుమీద జరుగుతున్నది. ఈ సెట్టు చందనరాజు కట్టించిన చందన మహాల్ అంతర్భాగం. చందనరాజును ప్రేమించి

"జాల్" సమీక్ష

ఫిల్మ్ ఆర్ట్స్ వారి "జాల్" హిందీ చిత్రం ఈ నెల 18 నుండీ కృష్ణాటాకీస్‌లో ప్రదర్శింపబడుతోంది. గీతాబాలి, దేవానంద్, పూర్ణిమ, కె. ఎన్. సింగ్ ముఖ్యపాత్రధారులు. కథావస్తువు క్రైస్తవ ధర్మానికి సంబంధించినది.

భారతదేశ పశ్చిమతీరంలో ఒక క్రైస్తవ గ్రామం. అందులో మేరియా అనే యువతి అంధసోదరుడితో చేపలమ్మి జీవిస్తూ వుంటుంది. ఒకరోజున మేరియా లిజా అనే మరొక యువతిని పోలీసులబారినుండి రక్షిస్తుంది. లిజా టోనీ అనే యువకుడికి దొంగ బంగారపు వ్యాపారంలో సహాయపడుతూ వుంటుంది. మేరియాను టోనీ ప్రేమపాశంలో బంధిస్తాడు. తన అక్రమప్రవర్తనకు పశ్చాత్తప్తురాలైన లిజా టోనీ దుర్మార్గుడనీ, అతన్ని ప్రేమించవద్దనీ హితవు చెబుతుంది. కాని మేరియా టోనీపై ప్రేమ తొలగించుకోలేక అతనివెంటపడి అగ్రజుణ్ణి, ఇంటిని వదిలి వెళ్లిపోతుంది. టోనీ మేరియాతోపాటు దొంగబంగారాన్ని కూడా పడవలో అవతలకు చేరవేస్తున్నందున పోలీసులు వెంటాడుతారు. టోనీకి, పోలీసులకు తుపాకియుద్ధం జరుగుతుంది. చివరకు మేరియా టోనీతో చెబుతుంది లొంగిపొమ్మని. టోనీ తన పాపాలకు పశ్చాత్తప్తుడై న్యాయచట్టానికి లొంగిపోతాడు.

ఈ చిత్రానికి డైరెక్టరు గురుదత్. ఈ మాత్రం ఉదాత్తమైన కథావస్తువుతో వెలువడే హిందీచిత్రాలు చాలా అరుదనే చెప్పాలి. అన్నిటికంటే మెచ్చుకోదగినవి సంగీతం, ఫొటోగ్రఫీ. సంగీత దర్శకుడు ఎస్. డి. బర్మన్. ప్రతి పాటా శ్రోతలను ముగ్ధులను చేసేదిగా వుంది. ముఖ్యంగా ఒక వెన్నెలరాత్రి పాట. టోనీవద్దకు ఏమైనా సరే వెళ్ళకూడదనుకుంటుంది మేరియా. ఆమెను తనవద్దకు రప్పించాలని టోనీ వెన్నెల్లోకూర్చుని పాట పాడతాడు. ఆపాట మేరియాను ఉచ్చువేసి లాక్కువెడుతున్నట్టు లాక్కువెడుతుంది.

వి. కె. మూర్తి ఫొటోగ్రఫీ కూడా ప్రశంసనీయంగా వుంది. [illegible] ఎంతో జాగ్రత్తగా, నిర్దుష్టంగా కంపోజ్ చేయబడింది. సముద్ర తరంగాల మీద వెన్నెల పరుచుకోవటం, పొగమంచు వ్యాపించటం మొదలైన దృశ్యాలు చాల బాగున్నాయి.

కథలో చురుకుతనం లోపించినప్పటికీ సంగీతం కోసం, ఫొటోగ్రఫీకోసం ఈ చిత్రం చూడదగినది. సాధారణంగా విదేశీ చిత్రాల్లో ఏమంచి అంశం కనిపించినా అనుకరించటం మన వారికి అలవాటయింది. ఈ చిత్రంలో కూడా కొన్నిచోట్ల గారీ కూపర్ నటించిన "అన్ కాంకర్డ్"ను, ఇటాలియన్ చిత్రం "బిట్టర్ రైస్"ను తలపించే దృశ్యాలున్నాయి. ★

అతని ప్రేమ పొందలేని దేవకన్య అతని మెడలోని చంద్రహారం దొంగిలించటం, అతడు చనిపోవటం మొదలైనవి ఈ సెట్టు మీద జరుగుతాయి. తమిళ "చంద్రహారం"లో విమల అనే నటి దేవకన్యగా నటిస్తోంది......హిందీ "పెళ్లి చేసి చూడు" నిర్మాణం బహుశా "చంద్రహారం" అయిపోయాక ప్రారంభమవుతుందట. జి. వరలక్ష్మి పాత్రను ధరించటానికి బహుశా ఒక బొంబాయినటి బుక్ కావచ్చునట.

* * *

బొంబే టాకీస్‌వారు కూడా రంగుల చిత్రాలరంగంలోకి దిగుతున్నారట. దిలీప్ కుమార్, అశోక్ కుమార్, మీనాకుమారి మొదలైనవారు నటించబోయే ఒకచిత్రాన్ని వారు గేవాకలర్‌లో తీస్తారట.

* * *



"ఝాన్సీకీరాణీ" నిర్మాత సొహరాబ్ మోడీ, ఆయనభార్య మెహతాబ్, కుమారుడు ఈనెల 15న ఇంగ్లండు వెళ్లేసందర్భంలో తీసిన ఛాయాచిత్రం.



ఇంటర్వ్యూలు:

★

లనచిత్రరంగంలోకి ప్రవేశించిన అనతికాలంలోనే అందరి ఆదరాభిమానాలను చూరగొన్న కొద్దిమంది తారల్లో సావిత్రి ఒకతె. అదృష్టదేవత ఆమెను వెదుక్కుంటూవచ్చిన దనిపిస్తుంది. ఇందుకు నిదర్శనంగా ఆమె ఈనాడు పాల్గొంటున్న చిత్రాల సంఖ్యను గమనిస్తే చాలు.

శుభోదయావారి "ఆదర్శం" లో సావిత్రి సంగీతం అంటే చెవి కోసుకునే "శశి" పాత్ర ధరిస్తున్నది. రోహిణీవారి "వంజన్స్"లో ఒక ప్రముఖ పాత్రను ధరిస్తోంది. హెచ్. ఎమ్ రెడ్డిగారు అరవం, హిందీలలో పునర్నిర్మిస్తున్న "గృహలక్ష్మి"లో పూర్వం కాంచనమాల నటించినపాత్ర ధరిస్తున్నది. శోభావారి "స్వీట్ హోం"లోను, పీపుల్స్ ఆర్ట్ వారి "పల్లెటూరు"లోను. వినోదావారి "దేవదాసు" లోను ఈమె నాయికపాత్రలు ధరిస్తోంది. ఇవిగాక భాస్కర్ ప్రొడక్షన్స్ వారి "బ్రతుకు తెరువు" నవయుగ వారి "జ్యోతి", హిందీ "పెళ్లి చేసి చూడు", ఎ. వి. ఎమ్. వారి "వదిన" లో కూడా ప్రాముఖ్యంగల పాత్రలు ధరిస్తోంది. విజయావారి తెలుగు "చంద్రహారం"లో ఎన్ టి. రామారావు మెళ్ళో హారం ఎత్తుకుపోయిన దేవకన్యగా మరొక ప్రముఖపాత్ర ధరిస్తోంది. ఈమె నటించిన ఈస్టిండియావారి "సంక్రాంతి" విడుదలకు తయారై ఉంది.

ఈనాడు ఆమె ఇన్ని చిత్రాల్లో నటిస్తున్నా ఆమె చిత్రాలు విడుదలైనవి కొద్దే. ఆకొద్ది చిత్రాల్లోనూ చిన్న చిన్న పాత్రలు మాత్రమే ధరించింది. మొదటి చిత్రం "సంసారం." విడుదలైన ఇతర చిత్రాలు "పాతాళభైరవి" "శాంతి" "రూపవతి" ప్రియురాలు" "పెళ్లి చేసి చూడు."

"మొదట నన్ను బుక్ చేసినవారు కెమేరా ముందు నటించటానికి నేను భయపడుతున్నానని ఇవ్వదలచినపోర్షనుగాక మరొక చిన్న పోర్షను ఇచ్చారు కాని నేను 'స్టేజ్ ఫియర్' అనేది ఎన్నడూ ఎరుగను. నేను స్కూల్లో చదువుకునే రోజుల్లోను, చదువు మానేసిన తరవాతకూడా నిర్భయంగా నాట్యప్రదర్శనాలు ఇచ్చేదాన్ని. కొ. నాడ నాట్య కళాపరిషత్తు ఉత్సవాలలో ఒక నాటకంలో వేషం వేశాను. ఆ నాటకంలో నా అభినయం చూసి పరిషత్తు వారు ప్రత్యేకంగా నా నాట్య ప్రదర్శనం

సావిత్రి ★

ఏర్పాటుచేశారు," అన్నది సావిత్రి.

సావిత్రిస్వస్థలం బెజవాడ. తండ్రి కొమ్మారెడ్డి వెంకటరామయ్య చౌదరి గారికి కవుతరంలో భూములున్నాయి. సావిత్రికి చిన్నప్పటినుండి నృత్యసంగీతాలపై మక్కువ ఎక్కువ. ఆమె ఉత్సాహం చూసి కాదనలేక తండ్రిగారు నెల్లూరునుండి కోటసుబ్రహ్మణ్యమూర్తి గారిని పిలిపించి సంగీతం, నృత్యం నేర్పించారు. సావిత్రి క్లాసికల్ సంగీతం చక్కగా పాడుతుంది. "అయితే మీరు నటించే చిత్రాల్లో మీరే ఎందుకు పాడగూడదు?" అని అడగ్గా "బహుశా నాకంఠం 'మైక్'కి సరిపోదనుకుంటాను. పైగా ఇన్ని చిత్రాల్లో నటిస్తూ పాటలరికార్డింగుకు, రిహార్సల్స్‌కు తిరగటానికి నాకు వ్యవధి ఉండదు," అన్నదామె.

సావిత్రి ఇన్ని చిత్రాల్లో ఒకేసారి నటిస్తున్నా, రోజుకు కనీసం రెండు కాల్ షీట్లు ఉంటున్నా, సెట్స్‌మీదికి సరియైన టైముకి వెళ్ళటంలో అమితశ్రద్ధ చూపిస్తుంది. పొద్దున ఆరుగంటలకి కాల్ షీట్ ఉంటే 4-30 కే ఆమె బయలుదేరుతుంది. (సాధారణంగా కాల్ షీట్ టైమ్‌కు గంట, రెండు గంటలతరవాత మేకప్ రూముకు వచ్చేవారే ఎక్కువనుంది.)

"మీకు ఎవరి దర్శకత్వంమీద గౌరవం ఎక్కువ?" అని అడగ్గా సావిత్రి ప్రసాద్ గార్ని పేర్కొన్నది. "ప్రసాద్ గారు నటీనటులకు అర్థమయ్యే భాషలో మాట్లాడతారు. ఆయన 'టేకింగ్' విషయంలో ఎంత శ్రద్ధ చూపుతారో నటీనటుల నటన విషయంలో కూడా అంత శ్రద్ధా చూపుతారు. కొందరు డైరెక్టర్లు ఎంతసేపు చెప్పినా వారు చెప్పే ముక్క ఒక్కటీ బోధపడదు. ప్రసాద్ గారికి విషయవివరణలో నేర్పున్నది. అలాగే వేదాంతం రాఘవయ్యగారుకూడా. సహజంగా నాట్యాచార్యులు గనక ఆయన నటీనటులవిషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు; ప్రతియాక్షనూ చేసి చూపిస్తారు," అన్నది సావిత్రి.

సావిత్రి ఎక్కువ చదువుకోలేదు. చిన్నప్పటినుండీ సంగీతం, నృత్యం అంటే ఇష్టంఉంటంమూలాన చదువు థర్డుఫారమ్ దాటి సాగలేదు. "కాని ఇప్పుడు నాకు తీరిక లభించినప్పుడల్లా కనిపించిన ప్రతి పత్రికా చదివేస్తూ ఉంటాను." అంటుందామె.

"మీరు తరుచు సినిమాలకు వెడుతుంటారా?" అని అడిగితే "హిందీ, ఇంగ్లీషు చిత్రాలు చూస్తూ వుంటాను. అరవ చిత్రాలంటే నాకు తలనొప్పి. ఆ మాట కొస్తే నాకు హిందీచిత్రాలన్నా తలనొప్పే. మన తెలుగుచిత్రాలు అన్నివిధాలా వాటికంటే మెరుగని నా అభిప్రాయం."

సావిత్రి ఇంకా పదిహేడేళ్లు నిండని అవివాహిత. మాట్లాడేటప్పుడు మితంగా, సహృదయత, సౌజన్యం ఉట్టిపడేటట్లు మాట్లాడుతుంది. "పెళ్లిచేసిచూడు"లో ఆమె నటించిన "సావిత్రి" పాత్ర చిన్నదైనా ప్రేక్షకుల ప్రశంసలకు పాత్రమైంది. ఇందు కొకటే కారణం కనిపిస్తుంది. ఆమె వ్యక్తిత్వానికి తగిన పాత్ర అది. "అభిజ్ఞాన శాకుంతలం"లోని వనితా శకుంతల నైర్మల్యమూ, ముగ్ధత్వమూ ప్రధాన గుణాలైన పాత్ర ఆ "సావిత్రి" పాత్ర. అందుకే సావిత్రి తన స్వభావాన్నే తాను నటించుకుంటున్నట్లు నటించింది ఆ చిత్రంలో. మన నిర్మాతల్లోను, దర్శకులలోను నటీనటులకు తగిన పాత్రలను ఇచ్చేవారు, ఇవ్వాలనే ఆలోచన కలవారు అరుదు. కొందరు నిర్మాతల దృష్టిలో నటికిగాని నటునికిగాని ఉండవలసిన ప్రధాన అర్హత గ్లామర్. దీనికి అనవసర ప్రాధాన్యం ఇవ్వటం అవివేకం. అందుకే సావిత్రి లాంటి సరళ ప్రకృతిగల వ్యక్తికి "వాంప్" పాత్రలను కొందరు నిర్మాతలు అంటగట్టడం అనుచితంగా కనిపిస్తున్నది. ★



మోడరన్ థియేటర్సువారి "అత్తింటి కాపురం"లో బి. ఎస్. సరోజ.

ప్రశ్నలు సమాధానాలు

పి. నాగేశ్వరరావు—పెనమలూరు.

కేవలం ధనంకోసంకాక కళను ఉద్ధరించుటకు నటించే నటు లెవరైనా మన తెలుగుచిత్ర జగత్తులో ఉన్నారా అండి?

—సరిగ్గా మీ రడిగిన ప్రశ్నే అడుగుతూ ఇంకా పలువురు మా కార్యాలయానికి ప్రశ్నలు పంపారు. వారందరికీ మీ ప్రశ్నద్వారా సమాధాన మిస్తున్నాము. ధనార్జనకూ, కళోద్ధరణకూ విరోధమున్న దనేవారు "ఆదర్శవాదులు." తెలుగుచిత్ర జగత్తుకే కాదు. ఏ జగత్తుకూ ఆదర్శం ఆధారం కాదు. "ధనమూల మిదం జగత్"

*　　*　　*

ముక్కామల రమేష్‌కుమార్—గన్నవరం.

"భావి భారతనిర్మాతలు విద్యార్థులే నని" ప్రతివారు వుపన్యాసాలు యిస్తారుగాని వారికోసము సహృదయంతో పాటుబడే ఒక్క వ్యక్తిని గూడ నేను వినలేదు కనలేదు! వుంటే తెలవిస్తారా?

—విద్యార్థులకోసం ఒకరు పాటుపడే దేమిటి? లోకంలో అన్నిటికోసం (ముఖ్యంగా విద్యార్థినుల బాగుకోసం) విద్యార్థులే పాటుపడతారు.

ప్రస్తుత విద్యావిధానమునుగురించి మీ అభిప్రాయం ఏమిటి?

—తల్లిదండ్రులకి వన్ను విరిగే ప్రయాస, ఉపాధ్యాయులికి దిన దిన గండం, విద్యార్థులికి (ఉత్తరకుమార) వీరవిహారం, నేటి విద్యావిధానం.

*　　*　　*

సాంఘిక చిత్రాలకన్నా జానపద చిత్రాలు విజయవంతమై ధనాన్ని ఆర్జించుటకు గల కారణం ఏమిటండి?

—'జానపద కథలు జానపదచిత్రాల్లో ఎలాగూ చూస్తూనే ఉన్నాంగదా, సాంఘిక చిత్రాల్లో కూడా ఆ కథలే చూడటం దేనికి' అని ప్రేక్షకులు నిర్ణయించుకున్నట్లున్నారు.

*　　*　　*

ఆర్. శ్రీమన్నారాయణశర్మ—నల్లగొండ.

సంగీతానికి సాహిత్యానికిగల సంబంధ మేమిటో తెలవిస్తారా?

—సినిమా పాటలకు సంబంధించినవరకూ ఈ రెండూ చాలకాలం కిందటే విడాకు లిచ్చుకున్నాయి.

నేను కొద్దికొద్దిగా కవిత్వము వ్రాస్తుంటాను. దానిని వృద్ధిలోనికి తేవాలంటే యేం చేయాలంటారో తెలపియండి.

—ఉన్మాదులు, ప్రేమికులు, కవులు ఒక తరగతివారే అని షేక్స్పియర్ అన్నాడు. కనుక అది కవిత్వమో, కొంప తీసి మరేమన్నానో ముందు తేల్చుకోండి.

*　　*　　*

యం. సత్యనారాయణ—నిడదవోలు.

ముఖ్యమంత్రి రాజగోపాలాచారిగారు P. W. D. తన రెండవ శత్రువు అని ప్రకటించుటలో గల ఆంతర్యమేమి?

—బహుశా పులిచింతల, నందికొండ ప్రాజెక్టుల్ని తల్చుకుని వుంటారు.

*　　*　　*

ఆంధ్రరాష్ట్ర నిర్మాణము విషయములో పండిట్ నెహ్రూ అవలంబిస్తున్న వైఖరి, మనకు నిజముగా ఆంధ్రరాష్ట్రము యిచ్చుట యిష్టములేకనా? లేక ఎందువలన?

—జంకువల్ల.

*　　*　　*

వర్స నవనీత కృష్ణ—పెద్దపల్లి.

"కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో" అనే గ్రంథంచినవలను సినిమాగా తీయ సాహసించే దర్శక నిర్మాతలు లేరా?

—లేకేం! ఇదివరకొకరు తెలుగులో తీసి నష్టపడ్డారు. ఇప్పుడు తమిళ, కన్నడ భాషల్లో తీయాలని నిర్మాత కెంపరాజ్ సాహసం చేస్తున్నాడట.

*　　*　　*

ప్రసాద్ ఆర్టు ప్రొడక్షన్సు వారి "కన్నకడుపు" చిత్రంలో నాయకీ నాయకు లెవరు? మీరు అంజలీదేవి, నాగేశ్వరరావు నటిస్తారని వ్రాసినారు. ఎంతవరకు నిజం?

—ఆ చిత్రం పేరు"కన్నకడుపు" కాదు; తాత్కాలికంగా వ్యవహరిస్తున్న పేరు మాత్రమే. నాయికా నాయకుల పాత్రలకు ఇంకా ఎవరూ నిర్ణయం కాలేదు. అంజలీదేవి, నాగేశ్వరరావు నటిస్తారని మొదట అనుకున్నారుగాని ఇప్పుడు వారు నటించటం లేదు.

*　　*　　*

వై. పి. సోమయాజులు—పాముల్రు.

విజయదశమి ప్రత్యేక సంచికకు బాలబాలికలు పంపే రచనలు "పోటీకొరకు" అయితే "పోటీకొరకు"నని లేక మామూలు ప్రచురణకు" అయితే "మామూలు ప్రచురణకు అని వ్రాయవలెనన్నారు కదా! ఒక రచనను పోటీకొరకై పంపిన పోటీలో గెలుపొందని పక్షమున రచన బాగుండిన పక్ష

మన మామూలుగా ప్రచురించెదరా లేదా?

—బాగుంటె ప్రచురించగలం.

బాగా చదువుకున్న మగవారికీ, బాగా చదువుకున్న ఆడువారికీ తేడా ఏమైనా వుంటుందా? బాగా చదువుకున్న ఆడువారికి అహంభావము, పెంకితనము ఎక్కువంటారు కొందరు. ఇది నిజమేనా?

—మగవారికీ, ఆడవారికీ మధ్యవుండే తేడాలు చదువుకున్నా అలాగే మిగిలిపోతాయి నిజంగానే 'బాగా' చదువుకుంటే మగవారికికూడాఅహంభావంఉండదు.

*　　*　　*

బి. వి. వి. ఆర్. సుబ్బారావు—వినుకొండ.

మన చిత్రనిర్మాతలు, సాంఘిక, జానపద చిత్రాలను నిర్మించడంలో ఎంతో ముందడుగు వేస్తూ, చరిత్రాత్మక గాధలను తెరమీదకు తీసుకురావడానికి వెనుదీయడంలో గల కారణా లేమిటి?

—చారిత్రిక చిత్రాల పేరుతో జానపద కథలను చిత్రించటంకంటె వాటి జోలికి పోకపోవటం మంచిదికాదూ?

*　　*　　*

సయ్యద్ షఫీ—అమలాపురం.

"రేడియోల ద్వారా వింటున్న సినిమా సంగీతాన్ని భారతప్రభుత్వం నిషేధిస్తుంది" అని ప్రకటించినారు. నిషేధించినట్లయితే ప్రభుత్వానికి లాభమా? సినిమానిర్మాతలకు నష్టమా? మీ వుద్దేశం ఏమిటి?

—సినిమాసంగీతాన్ని రేడియోల్లో పూర్తిగా నిషేధించటంలేదు. ఇప్పుడు ప్రసారంచేస్తున్న దానికంటె కొంత తగ్గిస్తారు, అంతే. ఇందువల్ల గ్రామఫోనుకంపెనీలకు లాభించవచ్చు.

*　　*　　*

కె. నారాయణ—మద్దికెర.

తమ "ఆంధ్ర పత్రిక" కాంగ్రెస్ వర్గానికి చెందినది అని కొన్ని పత్రికలవారు చేస్తున్న ఆరోపణనుగురించి తమ అభిప్రాయమేమి?

—ఆరోపణకి అది నేరమా?

*　　*　　*

ఆర్. రామారావు—సరిపల్లి.

దర్శకుడు అనతగ్గవాడు సినిమారంగములోని ఏ సాంకేతిక శాఖలోనుండి వస్తే మంచిది?

—ఫొటోగ్రఫీ, సౌండు, ఎడిటింగ్, ఆర్టు, నటన మొదలైన అన్నిశాఖలతోను ఎంత ఎక్కువ పరిచయం ఉంటే అంత మంచిదర్శకు డవుతాడు. అన్నిటినీ మించి జీవితాన్ని కాచి వడబోసినవాడై ఉండాలి.

వి. వి. నారాయణరావు—అరూర్మరు.

ఘంటసాల, రాజేశ్వరరావులలో ఎవరు బాగా పాడగలరు? ఎవరి మ్యూజిక్ బాగుంటుంది?

—గులాబీలు బావుంటాయా, మల్లెలు బావుంటాయా అన్నట్లుంది మీ ప్రశ్న. అయితే ఆ ఇద్దరికీ ఒక తేడా వున్నది. ఘంటసాలసంగీతం భావప్రధానమైనది. రాజేశ్వరరావుసంగీతం సంగీత ప్రధానమైనది.

*　　*　　*

కాకూర పాండురంగారావు—బరహాంపూర్.

ఆంధ్రరాష్ట్రముకొరకు స్వామీ సీతారాంవంటివారు సత్యాగ్రహం సాగించుతూ వుంటే మన కేంద్రప్రభుత్వమువారు ఈ విషయమై ఎట్టిచర్యా తీసుకొనుటలేదని నా వూహ. మీరేమంటారు?

—మొత్తానికి సరిగ్గానే ఊహించారు.

ఆంధ్రరాష్ట్రము ప్రాప్తించుట మీకు ఇష్టమేనా?

—చాలా చాలా ఇష్టం.

మీ పత్రికలో వివిధమైన రచనలు ప్రకటించెదరు?

—ప్రకటనకు వీలైన రచనల్ని.

*　　*　　*

మంగళగిరి గోపాలకృష్ణమూర్తి—సంతరావూరు.

ప్రస్తుతము ఆంధ్రపత్రిక, వారపత్రిక సినిమాపత్రికగా మారుచున్నదని నేనంటాను? మీ రేమంటారు?

—48 పేజీలలో సగటున ఆరు పేజీలు సినిమావిషయాలు వేసే పత్రిక సినిమా పత్రికే అయితే మా పత్రిక సినిమాపత్రికే.

*　　*　　*

గాజులపల్లి సత్యం—కడప.

సినిమా నిర్మాణంలో డైరక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ బాధ్యత యేమిటి? కెమెరామన్ బాధ్యత యేమిటి? సెట్ మీద ఆంగిల్స్ నిర్ణయించడంలో ఎవరిమాట నెగ్గుతుంది?

—డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ, కెమేరామన్ ఇద్దరూ వేరువేరు వ్యక్తులైనప్పుడు ఆంగిల్స్, ట్రాలీషాట్, క్రేన్‌షాట్ మొదలైనవి, లైటింగ్ ఎఫెక్ట్స్ మొదలైనవి నిర్ణయించేది ఫొటోగ్రఫీ డైరక్టరే. కెమేరాను ఆపరేట్ చేసే వ్యక్తిని కెమేరామన్ అంటారు.

*　　*　　*

చిత్రపు లక్ష్మీనరసమ్మ—చల్లపల్లి.

రాజకీయరంగంలో స్త్రీలు అధిక సంఖ్యలో కన్పించరు. అది సంఘంచేసిన కట్టుబాటా, లేక ప్రభుత్వం సహకరించక పోవటమా.

—స్త్రీల కింకా కొంత వివేకం మిగిలి ఉండడంవల్ల నేమో!

*　　*　　*

చల్లారామయ్యచౌదరి—రామచంద్రపురం.
కర్నూలుజిల్లా.

రాజాజీ ఇటీవల తాను ప్రసంగించిన ప్రతి సభలోను భగవత్ప్రచారం చేశారు. పాపము భక్తాగ్రేసరునకు రాజ్యపాలన ఎందుకండీ?

—మళ్ళీ రాజ్యపాలన చేతికొచ్చిన తరవాతే వారికి భగవంతునిపై భక్తి మరీ గట్టిగా కుదిరి ఉంటుంది.

*　　*　　*

ఎ. హెచ్. రావు—గుంటూరు.

మార్క్స్ సిద్ధాంతాలకు, గాంధీ సిద్ధాంతాలకు గల తేడా ఏమిటి? ఈ రెండు సిద్ధాంతములగురించి మీ అభిప్రాయమేమిటి?

మార్క్స్ 'భౌతిక ప్రపంచమొక్కటే అనాది, అదే మానసిక, ఆధ్యాత్మిక ప్రపంచాలకి పునాది' అంటాడు. ఈ సూత్రాన్ని తలకిందులు చేస్తే గాంధీజం వస్తుంది. కేవలంతర్కం దార్వా ఏది రైటో చెప్పలేము.

*　　*　　*

కొండేణ వీరభద్రాచార్య—పెద్దాపురం

జీవాత్మ, పరమాత్మ, అంతరాత్మ అననేమి? ఈ మూడింటికి వ్యత్యాసమేమి?

—"మధురభావ" సాధకులను అడిగితే జీవాత్మ ప్రేయసి, పరమాత్మ ప్రియుడు, అంతరాత్మ వీరిద్దరికీ రాయబారాలు నడిపే దూతిక అంటారు.

"తూ. చ" అను సాంకేతిక పదములను పూర్తిపదములుగా వ్రాయగోరుచున్నాను. "తూ. చ" గురించి ఎవరి నడిగినా నాకు తృప్తికరమైన జవాబు రాలేదు. దీని భావార్థం తెలిసినప్పటికీ ఆ సాంకేతిక అక్షరముల పూర్తిపదములు తెలుసుకొందామని నా కోరిక.

—'తూ. చ' సాంకేతిక పదాలు కావు, సంస్కృత అవ్యయాలు. "తుహి చ స్మహవై పాదపూరణే పూజనే పి చ ఇత్యమరః సంస్కృతంలో తు. చ సాధారణంగా పాదపూరణంకోసమే వాడతారు. వాటిని వదిలిపెట్టినా ఇబ్బందిలేదు. అందుకే 'తూ చకూడా తప్పకుండా పాఠం వల్లించాడు' అనేసామెత వాడుకలోకివచ్చింది."

*　　*　　*

తుర్లూరి రామమోరావు-తాడంకి.

'బ్రతకలేక బడిపంతులుద్యోగం' అంటారు. నిజంగా నూటికి నూరుపాళ్లు ప్రజాసేవ చేయగలిగినవాడు బడిపంతులే నంటాను. మీ రేమంటారు?

—'చేయవలసినవారు' అంటే మంచిది. అయితే అలా 'ప్రజాసేవ' చెయ్యలేక పోతున్నవారిని నిందించలేం కూడా. 'ప్రజాసేవ' ఇప్పుడు రాజకీయవాదులకు గుత్తకు పోయింది.

*　　*

పోతిన కొండలరావు—బెజవాడ.

రాజగోపాలాచారిగారి వయస్సు ఎంత?

—పదేళ్లకి పైబడీ, నూరేళ్లకి లోబడీ.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వప్రుల నరసింహమూర్తి
పెళ్లవకుండా ఇవ్వేం పనులే? మా కడుపున చెడ బుట్టావే!"
"కాదే మాతా! మా జామాతా ఎవరనుకొన్నావ్! సాక్షాద్విష్ణువు!"
"విన్నారండీ, మన అల్లుడటా సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తట!"
"విష్ణుమూర్తి నాకల్లుడు అయితే - తేస్సాగొయ్యా దేశాలన్నీ - ఇట్టే జయించి పారేయనూ!"
దక్షిణదేశపు సార్వభౌమునికి పటాకట్టే కప్పం కట్టక రాజాగారూ విర్రవీగగా
కప్పంకోసం సార్వభౌముడూ - సైనిక బలాలు పంపాడు - నాలువేపులా శత్రుసేనలూ - ఇక్షుపురమునూ ముట్టడించినవి.
"ఒసే అమ్మడూ! చూశావంటే! ఆపద మీదకు వచ్చింది."
"బయమొద్దండి నాన్నారూ మీ - అల్లుడుగారితో చెపుతాను!"
ఆ రాత్రే ఆ చిన్నది మగనితో - సంగతి అంతా చెప్పింది
"రేపు ప్రొద్దునే శత్రువులందరి నొక్క వేలితో ఉక్కడగించెద"
సాలెయువకుడూ చేసిన ప్రార్థన - శ్రీ హరి గుండెలో గుండ్రాయిల్లే - పడగా, పాపం, విధి లేకా - సాలెలోకి తన అంశము పంపెను
శ్రీ హరి అంశము పొందిన సాలె - మగుసడు దినాన రణరంగంలో - చక్రం విసిరి శత్రు సేనలను - నిశ్శేషంగా చంపాడు
బుద్ధిశాలియగు సాలెవాడు తను కోరిన స్త్రీనే కాకుండా వైకుంఠంలో విష్ణుని సైతం లొంగదీసుకో గలిగాడు.
దమనకుడు
"కావున ననే, ఓ కరటకుడా! - ఉపాయ యుక్తి ఆలోచించి - పింగళకునికీ సంజీవకునికి - మైత్రీ బంధం ఛేదిస్తా!"
"అయితే సరే మరి వెళ్లిరా క్షేమంగాపోయి, లాభంగారా!"